www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 30-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 242 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి ఉ. 10.30 తదుపరి అమావాస్య నక్షత్రం: విశాఖ మ. 12.34 తదుపరి అనూరాధ; వర్జ్యం: సా. 4.52-6.35; దుర్ముహూర్తం: ఉ. 6.32-8.00; అమృతఘడియలు: తె. 3.12-4.55; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేర్ హాస్పిటల్స్ చేతికి ఏస్టర్ డీఎం హెల్త్

మూడో అతి పెద్ద హాస్పిటల్ చైన్‌గా అవతరణ.. హైదరాబాద్‌లోనే ప్రధాన కార్యాలయం



న్యూఢిల్లీ: దేశంలో ఆస్పత్రుల రంగంలో మరో భారీ విలీనం చోటు చేసుకుంది. బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ హాస్పిటల్ చెయిన్, బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్‌లో (కేర్ హాస్పిటల్స్) విలీనమవుతోంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. విలీనం తర్వాత కంపెనీ పేరు ఏస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్‌గా (ఏడీక్యూసీఎల్) మారుస్తారు. కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించనున్నట్టు ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ ప్రకటించింది. ఈ విలీనంతో అపోలో, మణిపాల్ హాస్పిటల్స్ తర్వాత ఏడీక్యూసీఎల్ దేశంలో మూడో అతి పెద్ద ఆస్పత్రుల చెయిన్‌గా ఆవిర్భవించనుంది.

ఏస్టర్ డీఎందే మెజారిటీ వాటా

ఈ విలీనంతో ఏర్పడే ఏడీక్యూసీఎల్ కంపెనీ ఈక్విటీలో ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ వాటాదారులకు 57.3 శాతం వాటా ఉంటుంది. మిగిలిన 42.7 శాతం వాటా క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ (క్యూసీఐఎల్) వాటాదారులకుంటుందని ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ స్టాక్ ఎక్స్ఛేంజిలకు తెలిపింది. విలీన కంపెనీ మొత్తం ఈక్విటీలో ఏస్టర్ డీఎం ప్రమోటర్లయిన మూపెన్ కుటుంబానికి 24 శాతం, కేర్ హాస్పిటల్‌ను నిర్వహిస్తున్న ప్రైవేటు ఈక్విటీ (పీఈ) సంస్థ బ్లాక్‌స్టోన్‌కు 30.7 శాతం వాటా ఉంటుంది. విలీనం తర్వాత కూడా ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ ప్రధాన ప్రమోటర్ ఆజాద్ మూపెన్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా, క్వాలిటీ కేర్ గ్రూప్ ఎండీ వరుణ్ ఖన్నా ఎండీ, సీఎఫ్ఓగా కొనసాగుతారు.

10,000కు పైగా పడకలు

ఈ విలీనంతో ఏస్టర్ డీఎం, కేర్ హాస్పిటల్స్, కిమ్స్ హెల్త్, ఎవర్‌కేర్ పేర్లతో నడుస్తున్న నాలుగు ప్రధాన హాస్పిటల్ చెయిన్స్ ఏడీక్యూసీఎల్ నిర్వహణలోకి రానున్నాయి. ఈ నాలుగు హాస్పిటల్స్‌కు ప్రస్తుతం దేశంలోని 27 నగరాల్లో 10,150+ పడకలతో కూడిన 38 ఆస్పత్రులున్నాయి. అంతర్గత వనరులతో 2027 మార్చి నాటికి మరో 3,500 పడకలను ఏడీక్యూసీఎల్ ఏర్పాటు చేయనుంది.

ఏస్టర్ గూటికి ప్రేరణ హాస్పిటల్

మహారాష్ట్రలోని కొల్హాపూర్ కేంద్రంగా పనిచేసే 254 పడకల ప్రేరణ హాస్పిటల్‌ను, ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ పూర్తిగా కొనుగోలు చేసింది. ఏస్టర్ ఆధార్ హాస్పిటల్ పేరుతో నిర్వహిస్తున్న ఈ హాస్పిటల్ ఈక్విటీలో ఏస్టర్ డీఎంకు ఇప్పటికే 87 శాతం వాటా ఉంది. మిగిలిన 13 శాతం వాటా కొనుగోలు చేసేందుకు కూడా ఒప్పందం కుదిరినట్టు తెలిపింది.

సబ్బులు మరింత ప్రియం

ఎనిమిది శాతం వరకు పెంపు



న్యూఢిల్లీ: దేశంలో సబ్బుల ధర పెరిగింది. హిందూస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్), విప్రో కన్స్యూమర్, గోద్రెజ్‌తో సహా అన్ని ఎఫ్ఎంసీజీ కంపెనీలు స్నానపు సబ్బుల ధర ఏడు నుంచి ఎనిమిది శాతం పెంచేశాయి. సబ్బుల తయారీలో ప్రధాన ముడి పదార్థమైన పామాయిల్ ధర 35 నుంచి 40 శాతం పెరగడంతో కంపెనీలు ఈ చర్య తీసుకున్నాయి. స్నానపు సబ్బుల ధరతో పాటు చర్మ సంరక్షణ క్రీమ్‌ల ధరలను కూడా కంపెనీలు పెంచాయి. కొన్ని కంపెనీలు ఒక్కసారిగా ఏడెనిమిది శాతం పెంచితే, కొన్ని కంపెనీలు దశలవారీగా పెంచేందుకు నిర్ణయించాయి. ఒకేసారి పెంచితే డిమాండ్ తగ్గే ప్రమాదం ఉందని కంపెనీల భయం. ప్రతికూల వాతావరణంతో ఉత్పత్తి తగ్గడంతో ఇటీవల ఎఫ్ఎంసీజీ కంపెనీలు కాఫీ, టీ పొడి ధరలనూ 25 శాతం వరకు పెంచాయి.

మరో చారిత్రక కనిష్ఠానికి రూపాయి

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంలో రూపాయి 13 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ఠ స్థాయి 84.60కి దిగజారింది. మార్కెట్ నుంచి విదేశీ నిధులు నిరాటంకంగా తరలిపోతుండడంతో పాటు దిగుమతిదారుల నుంచి నెలాఖరు డిమాండు, శుక్రవారం వెలువడిన నిరుత్సాహపూరిత జీడీపీ గణాంకాలు కరెన్సీ మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీన పరిచాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	600	విజయవాడ	605
వరంగల్	602	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,110 ▲	71,600 ▲	1,00000 ▲
ముంబై	76,740 ▲	70,290 ▲	89,380 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	109
వరంగల్	105	గుంటూరు	109
కరీంనగర్	105	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	99
కర్నూలు	105	నెల్లూరు	99
విశాఖపట్నం	115	అనంతపురం	99
గోదావరి	109		

సెన్సెక్స్ 760 పాయింట్లు అప్

ముంబై: ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌ను శుక్రవారం పరుగులు తీయించాయి. సెన్సెక్స్ 759 పాయింట్ల లాభంతో 79,802 వద్ద ముగియగా నిఫ్టీ 216.95 పాయింట్ల లాభంతో 24,131.10 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 685.68 పాయింట్లు, నిఫ్టీ 223.85 పాయింట్లు లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్-100 సూచీ 0.31 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.76 శాతం లాభంతో ముగిశాయి.

లాభాల్లో అదానీ షేర్లు: అదానీ గ్రూప్‌లోని 11 కంపెనీల్లో 9 కంపెనీల షేర్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ అత్యధికంగా 22 శాతం లాభపడగా అదానీ ఎనర్జీ (16%), అంబుజా సిమెంట్స్ (3.73%) అదానీ పోర్ట్స్ (1.94%), ఏసీ సీ (1.59%), అదానీ టోటల్ గ్యాస్ (1.03%), అదానీ ఎంటర్‌ప్రైజెస్ (1.02%), ఎన్‌డీటీవీ (0.60 శాతం, అదానీ విల్మర్ (0.05 శాతం) లాభపడ్డాయి.

- ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజనీర్స్ లిస్టింగ్ అదిరింది. బీఎస్ఈలో ఈ షేరు ఇష్యూ ధర రూ.148 కన్నా 47.29 % ప్రీమియంతో రూ.218 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 57.77% లాభపడి రూ.233.50 వరకు వెళ్లిన ఈ షేరు చివరికి 39.86% లాభంతో రూ.207 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా 39.97 శాతం లాభంతో రూ.207.16 వద్ద ముగిసింది.
- ఢిల్లీ మార్కెట్లో బంగారం ధర 10 గ్రాములు రూ.700 పెరిగి రూ.79,400 పలుకగా కిలో వెండి ధర రూ.1300 పెరిగి రూ.92,200కి చేరింది.

కీలక రంగాలు డీలా

న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తికి కీలకమైన 8 రంగాల ఉత్పత్తి వృద్ధిరేటు ఈ అక్టోబరులో 3.1 శాతానికి పడిపోయింది. గత ఏడాదిలో ఇదే నెలలో నమోదైన 12.7 శాతం ఉత్పత్తి వృద్ధితో పోలిస్తే బాగా తగ్గింది. సెప్టెంబరులో నమోదైన 2.4 శాతం వృద్ధితో పోలిస్తే మాత్రం కాస్త మెరుగైంది. బొగ్గు, ముడిచమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలను కీలకంగా భావిస్తారు. దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీలో ఈ 8 రంగాలు 40.27 శాతం వెయిటేజీ కలిగి ఉన్నాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి 7 నెలలకు (ఏప్రిల్-అక్టోబరు) కీలక రంగాల ఉత్పత్తిలో 4.1 శాతం వృద్ధి నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వృద్ధి 8.8 శాతంగా ఉంది.

ఎన్‌సీసీకి భారీ కాంట్రాక్టు

హైదరాబాద్: కెన్-బెత్వా లింక్ ప్రాజెక్టు పరిధిలోని దౌధాన్ డామ్ ప్రాజెక్టు కాంట్రాక్టును ఇన్‌ఫ్రా రంగంలోని ఎన్‌సీసీ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ కాంట్రాక్టు విలువ రూ.3389.49 కోట్లు. గురువారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ అందినట్టు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాంట్రాక్టులో భాగంగా ప్రాజెక్టు ప్లానింగ్, డిజైన్, ఇంజనీరింగ్, హైడ్రో మెకానికల్ పనులను ఇపీసీ విధానంలో ఎన్‌సీసీ చేపడుతుంది.

ఉత్తమ ఎంప్లాయర్‌గా టీసీఎస్

హైదరాబాద్: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కార్పొరేట్ విభాగంలో ఉత్తమ ఎంప్లాయర్‌గా లింక్డ్ ఇన్ టాలెంట్ అవార్డు 2024 గెలుచుకుంది. భారీ పరిశ్రమల విభాగంలో అందుకున్న ఈ అవార్డు 6 లక్షలు పైబడిన తమ ఉద్యోగుల కోసం భవిష్యత్ దృక్పథంతో కూడిన పని ప్రదేశాలు రూపొందించాలన్న తమ కట్టుబాటుకు నిదర్శనమని టీసీఎస్ తెలిపింది.



రెండేళ్ల కనిష్ఠానికి జీడీపీ వృద్ధి రేటు

క్యూ2లో 5.4 శాతానికి పరిమితం
తయారీ రంగం పేలవ పనితీరు..
వినియోగంలో తగ్గుదలే కారణం

న్యూఢిల్లీ: భారత ఆర్థిక ప్రగతి చక్రం వేగం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి జీడీపీ వృద్ధిరేటు 7 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి జారుకుంది. తయారీ, మైనింగ్ రంగాల పేలవ పనితీరుతోపాటు దేశంలో వస్తు వినియోగం తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో జీడీపీ వృద్ధి రేటు 8.1 శాతంగా నమోదు కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో 6.7 శాతంగా ఉంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- 2022-23 ఆర్థిక సంవత్సరం క్యూ3 (అక్టోబరు-డిసెంబరు) వృద్ధిరేటు 4.3 శాతానికి పడిపోగా.. ఆ తర్వాత నమోదైన అత్యల్ప స్థాయి ఇదే.
- వినియోగదారుల వ్యయానికి సంకేతమైన ప్రైవేట్ తుది వినియోగ వ్యయం (పీఎఫ్‌సీఈ) క్యూ1లో 7.4 శాతం కాగా.. క్యూ2లో 6 శాతానికి తగ్గింది.
- రెండేళ్ల స్థాయికి జారినప్పటికీ, శరవేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ తన హోదాను నిలబెట్టుకోగలిగింది. సెప్టెంబరు త్రైమాసికంలో చైనా జీడీపీ వృద్ధి రేటు 4.6 శాతానికి పరిమితమైంది.
- జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరం క్యూ2లో వాస్తవిక జీడీపీ లేదా స్థిర ధరల ఆధారిత జీడీపీ అంచనా రూ.44.10 లక్షల కోట్లుగా ఉంది. 2023-24లో ఇదే కాలానికి రూ.41.86 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 5.4 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ2లో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ అంచనా రూ.76.60 లక్షల కోట్లుగా ఉంది. గత క్యూ2లో రూ.70.90 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 8 శాతం వృద్ధి నమోదైంది.
- 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి వాస్తవిక జీడీపీ అంచనా రూ.87.74 లక్షల కోట్లుగా ఉంది. 2023-24లో ఇదే కాలానికి రూ.82.77 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 6 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, ఈ ప్రథమార్ధంలో నామినల్ జీడీపీ అంచనా రూ.153.91 లక్షల కోట్లుగా ఉంది. 2023-204 ప్రథమార్ధంలో రూ.141.40 కోట్ల నామినల్ జీడీపీతో పోలిస్తే 8.9 శాతం వృద్ధి నమోదైంది. రెండో త్రైమాసిక జీడీపీ నిరాశపరిచినప్పటికీ, పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాలకు అనుగుణంగా 6.5 శాతానికి చేరుకోగలదన్న నమ్మకం ఉందని ప్రభుత్వ ముఖ్య సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ అన్నారు.

క్యూ2లో స్థూల విలువ జోడింపు (జీవీఏ) శాతం

రంగం	2024-25	2023-24
వ్యవసాయం సంబంధిత రంగాలు	3.5	1.7
మైనింగ్ అండ్ క్వారీయింగ్	-0.01	11.1
మాన్యుఫాక్చరింగ్	2.2	14.3
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవలు	3.3	10.5
నిర్మాణం	7.7	13.6
వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్	6.0	4.5
ఆర్థిక సేవలు, రియల్టీ, వృత్తి నైపుణ్య సేవలు	6.7	6.2
ప్రజా పాలన, రక్షణ, ఇతర సేవలు	9.2	7.7

స్పోర్ట్స్

హైబ్రిడ్‌కు ఒప్పుకొంటారా? లేక తప్పుకొంటారా?

చాంపియన్స్ ట్రోఫీపై పాక్ బోర్డుకు ఐసీసీ అల్టిమేటం



న్యూఢిల్లీ/దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై తాడోపేడో తేల్చేందుకు ఐసీసీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైబ్రిడ్ పద్ధతికి అంగీకరించాల్సిందేనని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు స్పష్టం చేసింది. ఒకవేళ పీసీబీ ఇందుకు ఒప్పుకోకపోతే ఆతిథ్య హక్కులను వదులుకోవాల్సి ఉంటుందని ఏకంగా అల్టిమేటం జారీ చేసింది. ఒకవేళ.. పాక్ బోర్డు ఈ టోర్నీని బాయ్‌కాట్ చేయాలనుకుంటే, ఆ జట్టు లేకుండానే చాంపియన్స్ ట్రోఫీ జరుగుతుందని ఖరాఖండీగా చెప్పేసింది. పాక్ నిర్ణయం తెలిపేందుకు శనివారం వరకు గడువిచ్చింది. ప్రస్తుత పరిస్థితిలో ఐసీసీకి తలొగ్గడం మినహా పాక్ బోర్డుకు మరో దారి లేదని ఇతర సభ్య దేశాలు కూడా భావిస్తున్నాయి. భద్రతా కారణాలరీత్యా వచ్చే ఏడాది జరిగే ఈ మెగా టోర్నీ కోసం తాము పాక్‌లో అడుగుపెట్టమని బీసీసీఐ ఇదివరకే ఐసీసీకి తెలిపింది. అంతేకాదు.. పాక్‌లో భారత జట్టు పర్యటనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని కేంద్ర విదేశాంగ శాఖ కూడా శుక్రవారం స్పష్టం చేసింది. కానీ పాక్ మాత్రం మ్యాచ్‌లన్నీ తమ దేశంలోనే జరగాలని, హైబ్రిడ్ పద్ధతిని ఒప్పుకోమంటూ వాదిస్తోంది. శుక్రవారం జరగాల్సిన ఐసీసీ బోర్డు సమావేశం కూడా ఇందుకే వాయిదాపడింది. హైబ్రిడ్ పద్ధతికి పాక్ అనుకూలంగా ఉంటే మాత్రం భారత్ ఆడే మ్యాచ్‌లు యూఏఈలో జరుగనున్నాయి. 'ఒకవేళ భారత్ ఈ టోర్నీలో ఆడకపోతే బ్రాడ్‌కాస్టర్ సంస్థ పెన్నీ కూడా ఐసీసీకి ఇవ్వదు. ఆ విషయం పాక్‌కు కూడా తెలుసు. హైబ్రిడ్ పద్ధతికి పాక్ బోర్డు చైర్మన్ నక్వీ అంగీకరిస్తేనే శనివారం సమావేశం జరుగుతుంది. ఇందుకు నేటి వరకు గడువిచ్చాం. ఒకవేళ వారు మరీ పట్టుదలగా వ్యవహరించి బహిష్కరించాలనుకుంటే, పాక్ లేకుండానే మరో దేశంలో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించడం ఖాయం. ఏదిఏమైనా పీసీబీ హైబ్రిడ్ పద్ధతికి అంగీకరిస్తుందనే భావిస్తున్నాం' అని ఐసీసీ బోర్డు అధికారి పేర్కొన్నాడు. ఈ సంకటస్థితిలో పాక్ క్రికెట్ బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. డిసెంబరు 1న జైషా ఐసీసీ కొత్త బాస్‌గా బాధ్యతలు తీసుకోబోతున్నాడు. దీంతో ప్రస్తుత చైర్మన్ గ్రెగ్ బార్క్‌లే చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై అధికారికంగా చివరి నిర్ణయం తీసుకోనున్నాడు.

ఇద్దరూ సమంగా..



లిరెన్‌తో గుకేష్ నాలుగో రౌండ్ డ్రా
ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మూడో రౌండ్లో విజయంతో అద్భుతంగా పుంజుకున్న భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ఆ తర్వాతి రౌండ్‌ను మాత్రం డ్రాగా ముగించాడు. డిఫెండింగ్ చాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో శుక్రవారం జరిగిన నాలుగో రౌండ్లో పాయింట్ పంచుకున్నాడు. నల్లపావులతో ఆడిన గుకేష్ ఆరంభంలో వెనుకంజలో ఉన్నా, ఆ తర్వాత పుంజుకొని గేమ్‌ను డ్రా దిశగా మళ్లించాడు. చివరికి 42 ఎత్తుల తర్వాత ఇరువురు ఆటగాళ్లు డ్రాకు అంగీకరించారు. బుధవారం జరిగిన మూడో రౌండ్లో 32 ఏళ్ల లిరెన్‌పై గుకేష్ గెలిచిన సంగతి తెలిసిందే. నాలుగో రౌండ్ తర్వాత ఇద్దరు ఆటగాళ్లు చెరి రెండు పాయింట్ల (2-2)తో సమంగా నిలిచారు. తొలి రౌండ్ ఓటమితో టోర్నీని ప్రారంభించిన 18 ఏళ్ల గుకేష్, రెండో రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. మరో పది రౌండ్లు మిగిలున్న ఈ టోర్నమెంట్‌లో ఎవరైతే ముందుగా 7.5 పాయింట్లకు చేరతారో వాళ్లు విజేతగా నిలుస్తారు. శనివారం జరిగే ఐదో రౌండ్లో గుకేష్ తెల్లపావులతో తలపడనున్నాడు.



విరాట్‌ను దాటేశాడు

ఆర్జనలో పంత్‌దే అగ్రస్థానం

న్యూఢిల్లీ: ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర కలిగిన ఆటగాడిగా నిలిచిన రిషభ్ పంత్ మరో ఘనత కూడా దక్కించుకున్నాడు. భారత క్రికెట్‌లో వేతనం రూపంలో ఎక్కువగా ఆర్జించే ఆటగాడిగా విరాట్‌ను అధిగమించాడు. ఇప్పుడు పంత్ బీసీసీఐ నుంచి రూ.30 కోట్లు అందుకోబోతున్నాడు. ఎలాగంటే.. ఐపీఎల్ వేలంలో అతడిని లఖ్‌నవూ రూ.27 కోట్లకు తీసుకుంది. అలాగే బోర్డు కాంట్రాక్ట్‌లో గ్రేడ్ 'బి'లో ఉన్న పంత్‌కు రూ.3 కోట్ల వార్షిక వేతనం దక్కుతుంది. దీంతో మొత్తంగా అతడు రూ.30 కోట్లతో టాప్‌లో నిలిచాడు. అటు విరాట్‌ను ఆర్‌సీబీ రూ.21 కోట్లకు రిటైన్ చేసుకోగా.. గ్రేడ్ ఎ+లో ఉన్న అతడి వార్షిక వేతనం రూ.7 కోట్లుగా ఉంది. దీంతో తను రూ.28 కోట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. శ్రేయాస్ ఐపీఎల్ ధర రూ. 26.75 కోట్లుగా ఉన్నా తనకు బోర్డు కాంట్రాక్ట్ లేదు.

బ్రూక్ అజేయ శతకం

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 319/5

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ దీటుగా జవాబిస్తోంది. బ్రూక్ (132 బ్యాటింగ్) అజేయ శతకానికి తోడు పోప్ (77) అర్ధసెంచరీతో రాణించగా.. రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 319/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం కివీస్‌కన్నా 29 పరుగులు వెనుకబడి ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 348 పరుగులకు ఆలౌటైంది. కార్స్, బషీర్‌లకు నాలుగేసి వికెట్లు దక్కాయి.

గిల్ సిద్ధం

రోహిత్‌తో ప్రాక్టీస్
నేటినుంచి భారత్ వామప్ మ్యాచ్



కాన్‌బెర్రా: గాయంతో తొలి టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ రెండో టెస్టుకు అందుబాటులో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే అతను తొలిసారిగా శుక్రవారం నెట్స్‌లో ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రాక్టీస్ సాగించాడు. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్టుకు దూరమైన కెప్టెన్ రోహిత్‌శర్మ కూడా సాధన చేశాడు. స్థానిక మనూకా ఓవల్ మైదానంలో భారత ఆటగాళ్లు కాసేపు నెట్స్‌లో గడిపారు. డిసెంబరు ఆరు నుంచి రెండో టెస్టు జరుగనుంది. అయితే దానికి ముందు శనివారం నుంచి ప్రైమ్ మినిస్టర్ లెవన్‌తో భారత్ రెండు రోజుల వామప్ మ్యాచ్ ఆడనుంది. ముందుగా రోహిత్ మైదానంలోకి రాగా ఆ తర్వాత యశస్వీ జైస్వాల్, కోహ్లీ వారికి జత కలిశారు. అటు గిల్ బొటన వేలి గాయం నుంచి పూర్తి స్థాయిలో కోలుకున్నట్టు కనిపించింది. పేసర్లు ప్రసిద్ధ్, యష్ దయాళ్, ఆకాశ్‌ల బంతులను గిల్ సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. అతడి ఫిట్‌నెస్‌పై సహాయక కోచ్ అభిషేక్ నాయర్ కూడా సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే బుమ్రా, సిరాజ్, హర్షిత్ మాత్రం ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నారు. మిగిలిన ఆటగాళ్లు గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ఆడారు. మరోవైపు వర్షం కురవడంతో టీమిండియా సాధన ఎక్కువసేపు సాగలేదు.

రోహిత్ ఏ స్థానంలో..?

రెండో టెస్టులో రోహిత్‌శర్మతోపాటు శుభ్‌మన్ గిల్ కూడా ఆడడం దాదాపు ఖాయమైనందున బ్యాటింగ్ ఆర్డర్ మరింత పటిష్ఠంగా మారనుంది. వీరి రాకతో జట్టులో దేవ్‌దత్, జురెల్‌ల స్థానాలు గల్లంతైనట్టే. అయితే ఈ ఇద్దరినీ ఏ స్థానాల్లో ఆడిస్తారనేది ఆసక్తికరంగా మారింది. 'గిల్, రోహిత్ రాకతో మాకు సెలెక్షన్ డైలమా తప్పదు. ఇద్దరు టాప్ ప్లేయర్స్ జట్టులోకి తిరిగి వస్తే ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుంది' అని అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తెలిపాడు. అయితే రోహిత్ బ్యాటింగ్ ఆర్డర్‌పై అతడు పెదవి విప్పలేదు. అడిలైడ్ చేరుకున్నాక ఆ విషయం ఆలోచిస్తామని చెప్పాడు. అటు ఓపెనర్‌గా రాహుల్ మెరుగ్గానే ఆడడంతో పాటు తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో తొలి వికెట్‌కు 201 పరుగులు అందించాడు. దీంతో ఫామ్‌లో లేని రోహిత్‌ను మిడిలార్డర్‌లో ఆడించే అవకాశాలు లేకపోలేదని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

మనోళ్ల దూకుడు



సెమీస్‌కు సింధు, ఉన్నతి, లక్ష్య రజావత్,
డబుల్స్‌లో గాయత్రి, అశ్వని జోడీలు
సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవూ: సొంతగడ్డపై జరుగుతున్న సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు జోరు కొనసాగిస్తున్నారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టైటిళ్లను క్లీన్‌స్వీప్ చేసే దిశగా దూసుకెళ్తున్నారు. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో రెండుసార్లు చాంపియన్, టాప్‌సీడ్ పీవీ సింధు 21-15, 21-17తో చైనాకు చెందిన డాయి వాంగ్‌ను చిత్తు చేసింది. మరో భారత అమ్మాయి ఉన్నతి హుడా 21-16, 21-9తో ఇషికా జైస్వాల్ (అమెరికా)ను ఓడించి సెమీస్‌లో సింధుతో అమీతుమీకి సిద్ధమైంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ లక్ష్య సేన్ 21-8, 21-19తో సహచర షట్లర్ మీరాబా లువాంగ్ మైస్నమ్‌పై, రెండో సీడ్ ప్రియాన్షు రజావత్ 21-13, 21-8తో గుయెన్ హై డాంగ్ (హాంకాంగ్)పై గెలిచి సెమీస్‌లో ప్రవేశించారు. మహిళల డబుల్స్‌లో రెండో సీడ్ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-8, 21-15తో ఆరో సీడ్, మలేసియా ద్వయం గో కీ/టో మి జింగ్‌పై, టాప్ సీడ్ అశ్వినీ పొన్నప్ప/తనీషా క్యాస్ట్రో జంట 21-12, 17-21, 21-16తో భారత్‌కే చెందిన శ్రుతి మిశ్రా/ప్రియపై గెలిచి సెమీస్ లోకి అడుగుపెట్టాయి. పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన ఇషాన్ భట్నాగర్/శంకర్ ప్రసాద్ జోడీ 21-12, 30-29తో మూడో సీడ్, మలేసియా జంట ఆరోన్/కాంగ్ కై జింగ్‌పై, పృథ్వీ కృష్ణమూర్తి/సాయిప్రతీక్ ద్వయం 12-21, 21-11, 21-16తో మలేసియాకే చెందిన లిమ్ జి/వాంగ్ తిమ్ జోడీపై గెలిచి సెమీస్‌లో ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జంట, ఐదో సీడ్ తనీషా క్యాస్ట్రో/ధ్రువ్ కపిల 21-16, 21-13తో లూ బింగ్/హో లా (మలేసియా) జోడీని ఓడించి ఫైనల్‌కు అడుగుదూరంలో నిలిచింది.

అదరగొట్టిన రోహిత్, తిలక్

రాజ్‌కోట్: రోహిత్ రాయుడు (56), తిలక్ వర్మ (51) అజేయ అర్ధ శతకాలతో చెలరేగడంతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో హైదరాబాద్ వరుస ఓటములకు బ్రేక్ పడింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో బౌలర్లు రవితేజ (4/26), అజేయ్ దేవ్‌గౌడ్ (2/14), సీవీ మిలింద్ (2/16) సత్తా చాటడంతో.. బిహార్ 20 ఓవర్లలో 118/9 స్కోరు చేసింది. ఛేదనలో హైదరాబాద్ 12.3 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి 119 పరుగులతో విజయం సాధించింది. నాలుగు వికెట్లు తీసిన రవితేజకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఉత్కంఠ పోరులో పుణె గెలుపు

నొయిడా: ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన పోరులో చివరి సెకన్లలో పుణెరి పల్టన్‌కు విజయం దక్కింది. శుక్రవారం ప్రొ కబడ్డీ లీగ్‌లో జరిగిన ఈ రసవత్తర మ్యాచ్‌లో పుణె 34-33తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది. పుణె కెప్టెన్ ఆకాష్ షిండే 12 పాయింట్లు సాధించి ఆ జట్టుకు విజయాన్ని కట్టబెట్టాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 42-30తో తమిళ తలైవాస్‌పై గెలిచింది.

ఓటమి దిశగా శ్రీలంక

రెండో ఇన్నింగ్స్ 103/5

డర్బన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక ఓటమి దిశగా పయనిస్తోంది. 516 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన ఈ జట్టు మూడో రోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్‌లో 103 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయింది. క్రీజులో చాందిమల్ (29 బ్యాటింగ్), ధనంజయ పరుగులేమీ చేయకుండా ఉన్నారు. జాన్సెన్, రబాడలకు రెండేసి వికెట్లు దక్కాయి. శ్రీలంక గెలవాలంటే ఇంకా 413 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు సఫారీ రెండో ఇన్నింగ్స్‌లో స్టబ్స్ (122), బవుమా (113) సెంచరీలు సాధించారు. దీంతో ఆతిథ్య జట్టు 366/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 45, దక్షిణాఫ్రికా 191 పరుగులు చేశాయి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 30-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 242 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

● 'సరగసీ' మహిళ మృతి..

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

కేసు సుమోటోగా విచారణకు స్వీకరించిన జాతీయ మానవ హక్కుల కమిషన్

రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి ఆదేశం

నిందితుడు రాజేశ్‌ను అరెస్టు చేసిన పోలీసులు

నేడు కోర్టులో హాజరుపరిచే అవకాశం 9

ఇందిరమ్మ ఇంట్లో అదనపు గదులకు ఓకే!

లబ్ధిదారులను అనుమతించాలన్న సీఎం

పథకంలో నిరుపేదలకు తొలి ప్రాధాన్యం

ఆదివాసీ, ఐటీడీఏల్లో ప్రత్యేక కోటా

దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, కార్మికులకు పెద్దపీట.. సమీక్షలో రేవంత్ 11



ఇందిరమ్మ ఇళ్లపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి

రేవంత్ భరోసా!

సంక్రాంతి నుంచి రైతు భరోసా అమలు.. ఎకరానికి 7,500 చొప్పున పెట్టుబడి సాయం

నేడు పాలమూరులో ప్రకటించనున్న సీఎం రేవంత్

రైతు సదస్సు ముగింపు సభకు ముఖ్యమంత్రి హాజరు

పలు కీలక పథకాలపై ప్రకటన చేసే అవకాశం

రూ.2 లక్షల వరకు రుణమాఫీ చెక్కుల పంపిణీ

ఏడాదిలో వ్యవసాయ ప్రగతిని వివరించనున్న సీఎం

సిద్ధమవుతున్న తెలంగాణ తల్లి విగ్రహం

పెద్ద అంబర్‌పేటలో రూపుదిద్దుకుంటున్న శిల్పం

10 టన్నుల ఇత్తడితో 17 అడుగుల ఎత్తులో తయారీ

ఆకస్మికంగా పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

9న సచివాలయంలో విగ్రహ ఆవిష్కరణ

హైదరాబాద్/మహబూబ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా.. శనివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతు సదస్సు కీలక ప్రకటనలకు వేదిక కానుంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ సందర్భంగా రైతు భరోసా పథకం అమలుకు సంబంధించి ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది రెండో పంటకాలం నుంచి ఎకరానికి రూ.7,500 చొప్పున పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పథకాన్ని సంక్రాంతి పండుగ నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీనిపై మహబూబ్‌నగర్ రైతు సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేసే అవకాశాలున్నాయి. గతంలో ఎకరానికి రూ.5 వేల చొప్పున ఉన్న పెట్టుబడి సాయాన్ని రూ.7500కు పెంచి రైతు భరోసా పేరిట అందజేస్తామని ఎన్నికల

మిగతా 11వ పేజీలో...



మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండుగలో ట్రాక్టరు నడుపుతున్న మంత్రి ఉత్తమ్

వానాకాలం పంటతో రైతులకు రూ.40 వేల కోట్లు

వరిలో ఉమ్మడి రాష్ట్రం రికార్డులు చెరిపేశాం: మంత్రి ఉత్తమ్ కుమార్ 11

ఆయిల్‌పామ్‌తో ఎకరాకు 2లక్షలు: తుమ్మల

ఫోన్ చేస్తే ఇంటికే వరి విత్తనాలు!

విత్తనాభివృద్ధి సంస్థ వినూత్న సేవలు

ఫార్మా క్లస్టర్ రద్దు!

లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరణ

గిరిజనుల ఆందోళనతో ప్రభుత్వం వెనక్కి

అక్కడే బహుళ ఉపయోగ పారిశ్రామిక పార్క్

వస్త్ర సంబంధ పరిశ్రమలకు ప్రాధాన్యం


స్థానికులకు భారీగా ఉపాధికి అవకాశం

ప్రతిపాదనలు సిద్ధం చేసిన టీజీఐఐసీ

త్వరలోనే భూసేకరణ నోటిఫికేషన్?

తాండూరు సబ్ కలెక్టర్‌కు బాధ్యతలు

లగచర్లలో ఫార్మా విలేజ్ పెట్టడం లేదని వారం క్రితమే వామపక్షాలకు చెప్పిన సీఎం



లగచర్ల ఘటనపై..

ఒక ఎఫ్ఐఆర్ చాలు

పోలీసులకు హైకోర్టు ఆదేశం

మరో రెండు నిలిపివేత 10

హైదరాబాద్/వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన లగచర్ల ఫార్మా క్లస్టర్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇందుకోసం గత ఆగస్టులో ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను శుక్రవారం ఉపసంహరించుకుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పేరుతో పత్రిక ప్రకటన జారీ చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ కోసం వచ్చిన జిల్లా కలెక్టర్‌పై గ్రామస్థులు దాడి చేయడం, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా 28 మంది నిందితులను అరెస్టు చేయడం, పోలీసుల చర్యలపై గ్రామస్థులు ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్ వరకు వెళ్లడం, కమిషన్ బృందాలు రాష్ట్రానికి వచ్చి విచారణ జరపడంతో లగచర్ల భూసేకరణ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా క్లస్టర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫార్మా కంపెనీలు అంటే ప్రజల్లో అనుమానాలు ఉన్న నేపథ్యంలో దాని



స్థానంలో అదేచోట బహుళ ఉపయోగ పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్(టీజీఐఐసీ) రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. అందులో ఎక్కువగా వస్త్ర పరిశ్రమ ప్రాజెక్టులకు అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దాంతో పెద్ద ఎత్తున స్థానికులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. పారిశ్రామిక పార్కు భూసేకరణకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్‌ను ఇవ్వనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి తాండూరు సబ్ కలెక్టర్‌ను భూసేకరణ అధికారిగా నియమించనున్నట్లు తెలుస్తోంది. ఫార్మా విలేజ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు ఇతర పరిశ్రమలు అయితే స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తారని రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 10వ పేజీలో...



సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్, అజయ్ మాకెన్, అంబిక సోని, ఖుర్షీద్

ఎన్నికల అక్రమాలపై ఉద్యమం

దేశవ్యాప్తంగా ప్రజాఉద్యమం చేపడతాం

పార్టీ ప్రక్షాళనకు కఠిన చర్యలు తప్పవు

అదానీ కుంభకోణం, మణిపూర్ అల్లర్లు, మత కల్లోలాలపై ఆందోళనల నిర్వహణ

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో తీర్మానం

కార్యకర్తలు పోరాటం ఆపొద్దు: రాహుల్

న్యూఢిల్లీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు, ప్రశ్నార్థకంగా మారిన ఎన్నికల కమిషన్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా.. దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్వహించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది. ఈవీఎంల దుర్వినియోగం, ఓట్ల లెక్కింపు, ఓటర్ల జాబితా విషయంలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన

మిగతా 8వ పేజీలో...

'మహా' ఎన్నికల అక్రమాలపై నిగ్గుతేల్చండి

ఈసీకి కాంగ్రెస్ 12 పేజీల నివేదిక

రాజకీయ శరణార్థిగా గుర్తించండి!

అమెరికా ప్రభుత్వానికి ప్రభాకర్‌రావు విజ్ఞప్తి



ఫోన్‌ట్యాపింగ్ కేసులో తెలంగాణ సర్కార్ వేధింపులకు గురిచేస్తోంది

భారత్‌లో తనకు రక్షణ లేదని తెలిపిన ఎస్ఐబీ మాజీ చీఫ్

విదేశాంగ శాఖను ఆశ్రయించనున్న దర్యాప్తు అధికారులు

షికాగోలో శ్రవణ్‌కుమార్.. ఇంటర్‌పోల్ సాయంతో రప్పించే యత్నం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారులకు షాక్ ఇచ్చారు. ఓవైపు అధికారులు ఆయన్ను భారత్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తుండగా.. మరోవైపు ఆయన ఏకంగా తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలంటూ అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, బడా వ్యాపారుల్ని లక్ష్యంగా చేసుకుని, నాటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావు బృందం ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడినట్లు కేసు దర్యాప్తులో గుర్తించిన సంగతి తెలిసిందే. గత డిసెంబరు 10న కేసు నమోదైన మరుసటిరోజే ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లిపోయారు. అప్పటి నుంచి దర్యాప్తు అధికారులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారు. విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపించగా.. అమెరికాలో చికిత్స పొందుతున్నానని

మిగతా 9వ పేజీలో...



9

పత్తి చేలో పులి పంజా.. యువతి మృతి

పత్తి ఏరుతుండగా దాడి చేసిన పెద్దపులి

మెడపై గాయం.. ఆస్పత్రికి వెళ్లేలోపే మృతి

ఆసిఫాబాద్ జిల్లా నజ్రుల్‌నగర్‌లో ఘటన

రూ.20 లక్షలు, వెదెకరాలు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు అటవీ శాఖ ఓకే

ఇంటర్నల్ మార్కులు ఈ సారికి

యథాతథం



పదో తరగతి పరీక్షలపై ప్రభుత్వ నిర్ణయం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు 10

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

అలిగి.. సొంతూరికి శిండే

డిప్యూటీతో పాటు హోం కూడా ఇవ్వాలని పట్టు

సీఎం వద్దే హోం ఉంటుందని బీజేపీ స్పష్టీకరణ

ముంబైలో మహాయుతి సమావేశం రద్దు 8



కరీంనగర్ జిల్లా అల్గునూర్‌లో నిర్వహించిన దీక్షా దివస్ సభలో కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు

దీక్షాదివస్ స్ఫూర్తిగా మరో పోరు

కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచుదాం

తెలంగాణలో ఏ వర్గమూ సంతోషంగా లేదు

ఈపాటి పాలనకు విజయోత్సవాలు ఎందుకు?

కేసీఆర్ కాలిగోటికి రేవంత్ సరిపోడు

కేసీఆర్ త్యాగాన్ని నేటి తరానికి చెప్పాలి: కేటీఆర్

బంగారు తెలంగాణను ఆగం పట్టిస్తున్నారు: హరీశ్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

'దీక్షా దివస్‌ను, కేసీఆర్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరోసారి కదనరంగంలోకి దిగుదాం. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుదాం'.. అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీ రామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అసెంబ్లీలో, పార్లమెంటులో, ప్రతి వేదికపైనా తెలంగాణ పక్షాన గొంతు విప్పుతూనే ఉందామని

మిగతా 9వ పేజీలో...

పనికొచ్చే చదువు

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఉన్నత విద్య పాఠ్య ప్రణాళిక

డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ వంటి అన్ని ఉన్నత విద్య కోర్సుల్లో మార్పులపై దృష్టి



రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కసరత్తు

కొత్త కరికులమ్ ఖరారుకు 4 కమిటీలు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు!

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అవసరాలు నానాటికీ మారుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఉన్నత విద్యలో మార్పులు, చేర్పులు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇలా తీసుకువచ్చే కొత్త పాఠ్యప్రణాళిక (కరికులమ్)ను వచ్చే ఏడాది నుంచి అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించారు. డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ వంటి అన్ని ఉన్నత విద్య కోర్సుల్లో ఈ మార్పులను తీసుకురావాలని

మిగతా 12వ పేజీలో...



8

ప్రతి ఓటీపీని బ్యాంకు ధ్రువీకరించాల్సిందే

ఆ తర్వాతే వినియోగదారుడికి సందేశం

రేపటి నుంచి ట్రేసబిలిటీ మార్గదర్శకాలు

ట్రాయ్ ఆదేశం అమలుకు టెలికం సంస్థలు సిద్ధం.. మోసపూరిత సందేశాలకు తెర!

వేలిముద్ర పడకున్నా అవ్వాతాతలకు పింఛను

పంచాయతీ కార్యదర్శుల వేలిముద్రతో లబ్ధిదారుల గుర్తింపు, నగదు పంపిణీ

వయోవృద్ధుల సమస్యకు పరిష్కారం 10

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉపశమనం!

అమెరికా, ఫ్రాన్స్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్–హిజ్బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇది ఓ అరవైరోజులే అమల్లో ఉంటున్నందున, ఆ తరువాత ఏమిటన్న ప్రశ్న ఎలాగూ ఉంది. గద్దెదిగిపోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఒప్పందాన్ని సగర్వంగా ప్రకటించారు కానీ, ఇజ్రాయెల్ ఇప్పటికే ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోందని వార్తలు వస్తున్నాయి. ఏడాదిగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న బాంబులు ఆగిపోతాయన్న సంతోషం వల్ల కాబోలు, ఒప్పందం అమలులోకి వచ్చిననాడే లెబనాన్ పౌరులు తిరిగి స్వగ్రామాలకు రావడం, ఇజ్రాయెల్ సైన్యాలు ఇంకా అక్కడే ఉండటంతో కొన్ని ఘర్షణలు జరిగాయన్న వార్తలు వింటున్నాం. హిజ్బొల్లా మిలిటెంట్లు నక్కివున్నారన్న ఆరోపణమీద ఒప్పందం కుదిరిన 24గంటల్లోనే ఇజ్రాయెల్ వైమానికదాడులు చేయడమూ చూశాం. త్వరలోనే ఈ పరిస్థితులన్నీ మారి, కాల్పులు నిలిచిపోతాయని నమ్మినప్పటికీ, ఆ శాంతి ఎంతకాలమన్న ప్రశ్న మిగిలేవుంటుంది. లెబనాన్ ప్రవర్తనమీద ఈ ఒప్పందం అమలు ఆధారపడివుంటుందని ఇజ్రాయెల్ ప్రధాని ఓ మాట అని ఉంచారు కూడా.

ఈ కాల్పుల విరమణకీ, ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టులో ఇజ్రాయెల్ చేసుకున్న అభ్యర్థనకు సంబంధం ఉన్నదో లేదో తెలియదుగానీ, ఇజ్రాయెల్ మంచిమనసు చేసుకోవడం వెనుక ఏదో మర్మం ఉంది. ఒకపక్క హిజ్బొల్లాతో సంధి కుదుర్చుకొని, మరోపక్క గాజాలో పదిమంది పిల్లలతో సహా మరింతమందిని సరికొత్తగా ఊచకోతకోసిన ఇజ్రాయెల్ ప్రధాని, తనమీద జారీ చేసిన అరెస్టువారెంట్లను ఎత్తివేయాలని ఐసీసీకి విజ్ఞప్తిచేసుకున్నారు. తమ పిటిషన్ తిరస్కరించినపక్షంలో ఐసీసీ ఎంత చెడ్డదో మిగతా ప్రపంచానికి తెలుస్తుందనీ, అందుకే పిటిషన్ వేశామని ఇజ్రాయెల్ ఓ బెదిరింపు వ్యాఖ్య కూడా చేసింది. హమాస్‌మీద యుద్ధం పేరిట గాజాను సర్వనాశనం చేసినట్టుగానే, హిజ్బొల్లాను అంతం చేస్తున్నానంటూ లెబనాన్‌లో ఇజ్రాయెల్ తీవ్ర విధ్వంసం సాగించింది. ఇజ్రాయెల్–హిజ్బొల్లా మధ్య 14నెలలుగా సాగుతున్న యుద్ధంలో లెబనాన్‌లో మరణించినవారి సంఖ్య ఐదువేలలోపు ఉండవచ్చుగానీ, లక్ష ఇళ్ళు నాశనమై, 12లక్షల మంది ఇతర ప్రాంతాలకు తరలిపోవలసివచ్చింది. ఆస్తినష్టం 850 కోట్ల వరకూ ఉండవచ్చునని అంచనా. ఇజ్రాయెల్ మీద హిజ్బొల్లా దాడులకు ప్రతీకారంగా, లెబనాన్‌మీద ఇజ్రాయెల్ అంతకు పదిరెట్లు విరుచుకుపడింది.

ఇజ్రాయెల్–హిజ్బొల్లా ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు అడుగుముందుకు పడిందని కొన్ని పశ్చిమదేశాలు, వాటి మిత్రదేశాలు ముచ్చటపడిపోతున్నాయి. గత సంవత్సరకాలంలో ఇజ్రాయెల్ దాడులకు హిజ్బొల్లా దెబ్బతిన్నది తప్ప, నాశనం కాలేదని, ఇరాన్ సహకారం కొద్దోగొప్పో కొనసాగుతున్నందున అది ఇంకా నిలవగలుగుతోందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. హిజ్బొల్లా దాడులతో దక్షిణ లెబనాన్‌ను అనుకొని ఉన్న ఉత్తర ఇజ్రాయెల్ నిత్యం వొణుకుతున్నది. ప్రాణనష్టం తక్కువగానే ఉన్నప్పటికీ, ఆస్తినష్టం, పంటనష్టం అధికం. హిజ్బొల్లా దెబ్బలకు ఓ యాభైవేలమంది ఇజ్రాయెలీలు ఇల్లూవాకిలీ వదిలిపెట్టి పోవలసి వచ్చింది. వారిని వెనక్కుతేవాలని నెతన్యాహూమీద ఒత్తిడి పెరిగిపోతోంది. అమెరికా, ఫ్రాన్స్ అధినేతలకు లెబనాన్ జనం కంటే, ఇజ్రాయెలీలమీద ప్రేమ ఎక్కువ ఉండటం సహజం. హమాస్, హౌతీ, హిజ్బొల్లా, ఇరాన్.. ఇలా ఓ పరిమితయుద్ధాన్ని అపరిమితం చేసి, ఆర్థికంగానూ, ఆయుధాలపరంగానూ నిండా మునిగిన నెతన్యాహూను బయటపడవేయడానికే ఈ ఒప్పందం కుదిరిందని కొందరి నమ్మకం. ఈ ఒప్పందం అమల్లో ఉన్నకాలంలో మిగతాశత్రువులను తుదముట్టించేందుకు ఇజ్రాయెల్‌కు వీలుకలుగుతుంది. ఆ తరువాత పాలస్తీనా భవిష్యత్తును నిర్ణయించడంలో అమెరికా, ఇజ్రాయెల్ మాట మరింత బలంగా చెల్లుబాటు అవుతుంది కనుక, పశ్చిమాసియా కొత్తచిత్రాన్ని వాటిపక్షాన గీసుకోవచ్చు. అమెరికా, ఇజ్రాయెల్‌కు నచ్చని, గిట్టుబాటుకాని రీతిలో ఏ నిర్ణయమూ జరగదన్న విషయాన్ని గుర్తిస్తే, హిజ్బొల్లాతో ఒప్పందంలోనూ ఈ రెండుదేశాల ప్రయోజనం అర్థమవుతుంది. ప్రస్తుతం దెబ్బతిని ఉన్నందున హిజ్బొల్లా కూడా ఈ కొద్ది విరామానికి అంగీకరించివుండచ్చు. చర్చల్లో అది ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం, ఒప్పందంలో భాగంగా అది ఖాళీచేసిన ప్రాంతాల్లోకి లెబనీస్ సైన్యం రావడం, వారికి అమెరికా, ఫ్రాన్స్ సహాయపడటం వంటి అంశాలు ఒక విధంగా ఆశ్చర్యకరంగా ఉన్నాయి. యుద్ధంలో అలిసిపోయిన ఇజ్రాయెల్, హిజ్బొల్లాలకు కాస్తంత ఉపశమనం ఇవ్వడానికి ఈ ఒప్పందం ఉపకరించవచ్చు.

‘మహా’ విజయం ఎలా సాధ్యమైంది?

ఈ నెల 15న ప్రచురితమైన నా కాలమ్ శీర్షిక ‘వెలలేని మాగాణి మహారాష్ట్ర’. బీజేపీ, శివసేన, ఎన్‌సీపీలతో కూడిన మహాయుతి కూటమి నవంబర్ 20 ఎన్నికలలో ఆ ‘మాగాణి’ని గెలుచుకున్నది. ఆ విజయం తిరుగులేనిది అనడానికి నేనేమీ సంకోచించను. మహారాష్ట్ర శాసనసభలోని 238 సీట్లకు గాను 230 స్థానాలను మహాయుతి స్వాయత్తం చేసుకున్నది.

మహాయుతి మహా విజయానికి ప్రధాన కారణమేమిటి? ఈ విషయమైపెద్ద చర్చ ప్రారంభమయింది. లడ్కీ బెహన యోజన (ఎల్‌బివై) కారణమని అత్యధికులు అంగీకరిస్తున్నారు. ప్రతి గృహిణికి (కుటుంబ వార్షిక ఆదాయం రెండున్నర లక్షల రూపాయల కంటే తక్కువగా ఉన్న పక్షంలో) నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని మహాయుతి వాగ్దానం చేసింది. ముఖ్యమంత్రి శిందే ప్రభుత్వం గత జూలై 1 నుంచి ఆ పథకాన్ని అమలుపరుస్తోంది. 2.5 కోట్ల మంది గృహిణులు ఎల్‌బివై లబ్ధిదారులుగా ఉన్నారు. తమను మళ్లీ ఎన్నుకున్న పక్షంలో ఆ ఆర్థిక సహాయాన్ని రూ.2100కు పెంచుతామని కూడా మహాయుతి హామీ ఇచ్చింది. లడ్కీ బెహన యోజన సంపూర్ణంగా విజయవంతమయింది. వ్యవసాయరంగంలో దురవస్థలు, పెచ్చరిల్లిపోతున్న నిరుద్యోగిత, గ్రామీణ మహిళలకు కొరవడిన ఉపాధి అవకాశాలు, గ్రామీణ వేతనాలు గొర్రె తోకలా ఉండిపోవడం, ద్రవ్యోల్బణం మొదలైన సమస్యలు ఆ ఆర్థిక సహాయ పథకం ప్రజలను విశేషంగా ఆకట్టుకునేలా చేశాయి. అయితే అదేమీ వినూత్న పథకమేమీ కాదు. అదొక అనుకరణ పథకం. మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఇప్పటికే అమలవుతున్న పథకాలను అనుసరించి ఎల్‌బివైను రూపొందించారు. సరే, మహాయుతి ప్రధాన ప్రత్యర్థి ఎమ్‌వీఏ సైతం తాము అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సహాయమందిస్తామని హామీ ఇచ్చింది. పాలక, ప్రతిపక్ష కూటముల వాదనలను తుల్యంగా చూస్తే లడ్కీ బెహన యోజన ఎన్నికలలో మహాయుతి విజయానికి దోహదం చేసిన నిర్ణయాత్మకమైన కారణమని నేను భావించడం లేదు.



■ పి. చిదంబరం

‘పళని’ పలుకు

ఒక ప్రచ్ఛన్న సందేశం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసిందని నేను భావిస్తున్నాను. బీజేపీ నాయకత్రయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు ఆ సందేశాన్ని మహారాష్ట్ర ఓటర్లకు చేరవేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శ్రేణులు ఆ సందేశాన్ని మరింత విపులంగా ప్రజల మనసుల్లో నాటాయి. బీజేపీ నాయకత్రయం రెండు నినాదాలనిచ్చారు. ఒకటి– ‘ఏక్ హై తో సేఫ్ హై’ (మనం ఒకటిగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం); రెండోది ‘బాతేంగే తో కటేంగే’ (విభజనలతో వినాశనమవుతాం). ఈ నినాదాలు తటస్థ స్వభావంతో ఉన్నట్టు అనిపిస్తుంది కదూ. అయితే అదొక వంచనాత్మక తటస్థత. నిజానికి ఒక నిర్దిష్ట సామాజిక సమూహాన్ని ఉద్దేశించే ఆ నినాదాలనిచ్చారు. ‘లవ్ జిహాద్’, ‘ఓట్ జిహాద్’పై భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు అడ్డు ఆపూ లేకుండా జరిగాయి. పాత నినాదాలు అయిన ‘తుక్డే తుక్డే గ్యాంగ్’, ‘అర్బన్ నక్సల్స్’ను పునరుద్ధరించి విరివిగా ఉపయోగించుకున్నారు. ఈ సందేశాలను చాల చాకచక్యంగా వెలువరించారు. లక్ష్యంగా పెట్టుకున్న సామాజిక వర్గాలకు చేరేలా చేయడంలో సఫలమయ్యారు. ఇది గమనించిన తరువాత గత లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ నాయకుల ప్రచారం గుర్తుకువచ్చింది. ‘మీకు రెండు గేదెలు ఉంటే ఒకదాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకెళుతుంది. మీ మంగళసూత్రాలను సైతం తీసుకువెళతారు. అలా తీసుకువెళ్లిన వాటినన్నిటినీ అధిక సంతానం ఉన్న వారికి ఇచ్చి వేస్తారు’ అని మోదీ ప్రభృతులు ప్రచారం చేయలేదూ?!



‘విభజించి గెలిచే’ రాజకీయ క్రీడను ఎన్‌డీఏ కొనసాగిస్తున్న పక్షంలో మైనారిటీల సమస్య భారత్‌ను వెంటాడుతూనే ఉంటుంది. ఆ ఎన్నికల ఎత్తుగడ బ్రిటిష్ వలస పాలకుల కుటిల ‘విభజించి పాలించు’ వ్యూహానికి భిన్న మైనది కాదు.

బీజేపీ నాయకులు ఏ సామాజిక సమూహానికి ఆ సందేశాలను ఉద్దేశించారన్నది స్పష్టమే. ఆ లక్షిత సామాజిక సమూహానికి ఏ సామాజిక సమూహం నుంచి ప్రమాదం వాటిల్లనున్నదని నర్మగర్భితంగా చెప్పారన్నది కూడా తేటతెల్లంగా తెలుస్తూనే ఉన్నది. కాలమిస్ట్ ఆర్. జగన్నాథన్ (బీజేపీ సానుభూతిపరుడు) ఆ ప్రభావశీల నినాదాలను హిందూ ఓటర్లను సంఘటితం చేసేందుకు ఇచ్చారని అంగీకరించారు. ఈ ఏడాది విజయదశమి రోజున ఆరెస్సెస్ సర్ సంఘ్ ప్రచారక్ మోహన్ భాగవత్ వెలువరించిన ప్రసంగ సారాంశాన్ని ఆ కొత్త నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి. మోహన్ భాగవత్ ఆ ప్రసంగంలో ఇలా అన్నారు: ‘అసంఘటితంగా, బలహీనంగా ఉండిపోతే దుర్మార్గుల దురాగతాలను కొని తెచ్చుకోవడమే అవుతుందన్న సత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు అందరూ తెలుసుకోవాలి’. ఈ నినాదాలు, ప్రసంగాలు అన్నీ విద్వేషపూరిత ప్రచారంలోను, ‘విభజించి గెలవడం’ అనే ఎన్నికల వ్యూహంలో భాగమే.

ప్రతి దేశంలోను మైనారిటీ వర్గాలు ఉంటాయి. అవి మతపరమైనవి లేదా భాషా పరమైనవి లేదా జాతి పరమైనవి కావచ్చు. అమెరికాకు నల్ల జాతి ప్రజలు, లాటినోలు; చైనాకు ఉయిఘర్ ముస్లింలు; పాకిస్థాన్‌కు షియాలు; బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లకు హిందువులు; శ్రీలంకకు తమిళులు, ముస్లింలు; ఆస్ట్రేలియాకు మూలవాసులు; ఇజ్రాయెల్‌కు అరబ్‌లు, యూరోపియన్ దేశాలకు యూదులు, రోమాలు మైనారిటీ వర్గాలు. తమ మైనారిటీ వర్గాల భద్రతకు కౌన్సిల్ ఆఫ్ యూరోప్ 1998లో ‘ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ నేషనల్ మైనారిటీస్’ను ఆమోదించింది తమ తమ సమాజాలలోని అన్ని వర్గాల మధ్య సమానత్వాన్ని పెంపొందించేందుకు, జాతీయ మైనారిటీల సంస్కృతి, అస్తిత్వాన్ని పరిరక్షించేందుకు ఈ ఒడంబడికను ఉద్దేశించారు. రాజనీతిజ్ఞుడు, సామాజిక తాత్వికుడు అయిన డాక్టర్ అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో మైనారిటీల హక్కులను భారత రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులుగా పొందుపరిచారు.

బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువుల హక్కుల పరిరక్షణ విషయమై భారత ప్రభుత్వమూ, భారతీయులూ తరచు భావోద్వేగాలకు లోనవుతుంటారు. పొరుగు దేశాలలోని హిందువుల హక్కుల గురించి ప్రభుత్వ నాయకులు గట్టిగా మాట్లాడుతుంటారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో భారత సంతతికి చెందిన విద్యార్థులకు ఎదురవుతున్న వేధింపుల గురించి కూడా మనం ఆందోళన చెందుతుంటాం. విదేశాలలోని హిందూ ఆలయాలు, సిక్కు గురుద్వారాలపై దాడులు జరిగినప్పుడు మనం బిగ్గరగా మండిపడుతుంటాం. అయితే విదేశాలు, మానవ హక్కుల సంఘాలు మన దేశంలోని మైనారిటీ వర్గాలకు ఎదురవుతున్న వేధింపుల గురించి ప్రస్తావించినప్పుడు, ప్రశ్నించినప్పుడు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రంగంలోకి ‘మా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని’ హెచ్చరిస్తుంది. ఇదొక నయవంచన ధోరణి, సందేహం లేదు. బంగ్లాదేశ్‌లో ఒక హిందూ సాధువును అరెస్ట్ చేశారు; ఇస్కాన్‌ను నిషేధించాలన్న డిమాండ్ పెరుగుతోంది. బంగ్లాదేశ్‌లో పరిణామాలకు ప్రతిస్పందనగా మన దేశంలోని ఒక మఠం అధిపతి ‘ముస్లింలకు ఓటింగ్ హక్కులు నిరాకరించాలని’ అన్నట్టు వార్తలు వచ్చాయి. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ రెండు సంకుచిత వైఖరులు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కావు. ‘విభజించి గెలిచే’ రాజకీయ క్రీడను ఎన్‌డీఏ కొనసాగిస్తున్న పక్షంలో మైనారిటీల సమస్య భారత్‌ను వెంటాడుతూనే ఉంటుంది. ఆ ఎన్నికల ఎత్తుగడ బ్రిటిష్ వలస పాలకుల కుటిల ‘విభజించి పాలించు’ వ్యూహానికి భిన్నమైనది కాదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

బౌలర్లు మంచి కెప్టెన్లు కాలేరా?


జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలో టీమ్ ఇండియా పెర్త్ నగరంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. బౌలర్‌గా, కెప్టెన్‌గా బుమ్రా అపూర్వ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. చాలా సంవత్సరాల క్రితం అనిల్ కుంబ్లేకు టీమ్ ఇండియా కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని సూచిస్తూ నేను ఒక వ్యాసాన్ని రాశాను. ‘ది హిందూ’లో 26 జూలై 1998న ‘డు బౌలర్స్ మేక్ గుడ్ కెప్టెన్స్?’ అనే శీర్షికతో అది ప్రచురితమయింది. పెర్త్‌లో బుమ్రా బౌలింగ్ నైపుణ్యం, కెప్టెన్సీ సామర్థ్యం చూసిన తరువాత నాకు ఆ వ్యాసం గుర్తుకు వచ్చింది.

ఒక క్రీడాకారుడి –అతడెంత ఆరితేరిన ఆటగాడు అయినప్పటికీ– పక్షాన అలా వాదించడమనేది నా స్వభావానికి విరుద్ధం. అయితే బ్యాటర్లు మాత్రమే ఉత్తమోత్తమ కెప్టెన్లు కాగలరని క్రికెట్ జగత్తులో విస్తృతంగా ఉన్న ఒక విశ్వాసాన్ని త్రోసిపుచ్చేందుకే నేను ఆ వ్యాసాన్ని రాశాను. కెప్టెన్ సొంత జట్టు ఫీల్డ్‌లో ఉన్నప్పుడు కెప్టెన్సీకి మరింత ప్రాధాన్యముంటుంది. బౌలర్లు, ఫీల్డర్లను మార్చడంలో బ్యాటర్లు దృష్టిని కేంద్రీకరించి నిష్పాక్షిక నిర్ణయాలు తీసుకోగలరనే అభిప్రాయం సర్వత్రా ఉంది. బౌలర్లు తమ టీమ్‌కు నేతృత్వం వహిస్తున్నప్పుడు వారు అండర్ బౌలింగ్ లేదా ఓవర్ బౌలింగ్ (సాధారణంగా ఓవర్ బౌలింగ్) చేస్తారని భావించడం కద్దు.

బ్యాటర్–కెప్టెన్ల అనుకూల వాదనలకు చారిత్రక ఆధారాలు సైతం దృఢంగా ఉన్నాయి. టెస్ట్ క్రికెట్ చరిత్రలో అసాధారణ విజయాలు సాధించిన ప్రశస్త కెప్టెన్లు అందరూ బ్యాటర్లే అన్న వాస్తవాన్ని 1998 నాటి నా వ్యాసంలో నేను అంగీకరించాను. డొనాల్డ్ బ్రాడ్‌మన్, క్లైవ్ లాయడ్ లే కాకుండా లెన్ హట్టన్, ఫ్రాంక్ వర్రెల్, అలెన్ బోర్డర్ (ఆస్సీ స్కిప్పర్‌గా స్టీవ్ వా అనితర సాధ్యంగా ఆడి తన జట్టుకు ఘన విజయాల చరిత్రను సృష్టించక ముందు)లు ఉత్కృష్ట టీమ్ లీడర్స్‌గా జగద్విఖ్యాతులయ్యారు. అయితే బౌలర్లు సైతం టీమ్ లీడర్స్‌గా ఘన చరిత్ర సృష్టించారని నేను వాదించాను. ఆస్ట్రేలియాకు చెందిన రిచియె బెనౌడ్, ఇంగ్లాండ్‌కు చెందిన రే ఇల్లింగ్ వర్త్‌లు తమ తమ టీమ్‌లను చరిత్రాత్మక గెలుపు బాటలలో నడిపించడమే అందుకు ఉదాహరణలు.

సరే, నేను ఆ వ్యాసాన్ని రాసిన కాలంలో టీమ్ ఇండియా కెప్టెన్‌గా అజరుద్దీన్ తన క్రికెట్ జీవితం చివరి దశలో ఉన్నారు. అజరుద్దీన్ నిష్క్రమించిన అనంతరం అనిల్ కుంబ్లే ఆయనకు యోగ్యమైన వారసుడు అవుతారని నేను ఆ వ్యాసంలో వాదించాను. కేవలం క్రికెటింగ్ ప్రతిభ ఉన్నవాడే కాకుండా నిశిత మేధ ఉన్న ఆటగాడు అనిల్ కుంబ్లే అని నేను అభిప్రాయపడ్డాను. రంజీ ట్రోఫీలో కర్ణాటక టీమ్ ప్రశస్త విజయానికి కుంబ్లే కెప్టెన్సీ విశేషంగా దోహదం చేసిందని నేను పేర్కొన్నాను. వికెట్లను పడగొట్టడంలో బెనౌడ్‌కు అలన్ డేవిడ్‌సన్ మరో బౌలర్ సహకారం ఉండేది. ఇల్లింగ్‌వర్త్‌కు జాన్ స్నో, డెరెక్ అండర్ వుడ్ లాంటి బౌలర్లు తోడ్పడేవారు. అనిల్ కుంబ్లే అలాగే జవగల్ శ్రీనాథ్‌పై ఆధారపడవచ్చు. భారత్‌కు ప్రపంచ కప్‌ను సాధించిన టీమ్ ఇండియాకు సారథ్యం వహించింది బౌలర్ కపిల్‌దేవ్ అన్న వాస్తవం అవిస్మరణీయమైనది కాదూ?

పావు శతాబ్దికి పూర్వం ప్రచురితమైన ఆ వ్యాసంలో నేను ఇంకా ఇలా పేర్కొన్నాను: ‘బౌలర్లు మంచి కెప్టెన్లు కాలేరన్న అపోహకు కారణమేమిటి? క్రికెట్ క్రీడలో బౌలర్ల హోదాలో క్రింది స్థాయికి చెందినదనే భావనలో భాగమే ఆ అపోహ. క్రికెట్ క్రీడాకారులలో ప్రజాదరణ అధికంగా పొందుతున్నది బ్యాటర్లే. క్రికెట్ అభిమానులకు, క్రికెట్ టోర్నమెంట్స్ వ్యవహారాలకు బాధ్యత వహించే వారికి ఆ వాస్తవం బాగా తెలుసు’. ఇంకా ఇలా రాశాను: ‘క్రికెటింగ్‌కు సంబంధించిన ఇతర విషయాలు అన్నీ సమరీతిలో ఉంటే బౌలర్లు సైతం ప్రశస్త కెప్టెన్‌లుగా రాణించగలరు. శ్రీనాథ్ రంగంలో ఉండి, తన బౌలింగ్ ప్రతిభను ఉత్కృష్టంగా కొనసాగిస్తున్నంత వరకు ప్రత్యర్థి పక్షాన్ని పూర్తిగా చిత్తు చేయడం కుంబ్లేకు పెద్ద కష్టసాధ్యమైన పని కాబోదు. సమయం వచ్చినప్పుడు కుంబ్లేకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే విషయాన్ని తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. బౌలర్లు ప్రభావశీల కెప్టెన్లు కాలేరన్న నిరాధార నమ్మకంతో కుంబ్లేకు కెప్టెన్సీని నిరాకరించకూడదు’.



బ్యాటర్లు మాత్రమే ఉత్తమోత్తమ కెప్టెన్లు కాగలరనేది ఒక పాక్షిక సత్యం మాత్రమే. బౌలింగ్‌లో ఉద్దండులు అయిన ఆస్ట్రేలియన్ బెనౌడ్, బ్రిటిష్ ఇల్లింగ్‌వర్త్, మన కపిల్‌దేవ్ తమ టీమ్‌లను గెలుపు బాటలో నడిపించలేదూ? 2008లో పెర్త్‌లో ఓటమి అంచుకు చేరిన భారత జట్టు అసాధారణ విజయం సాధించడానికి బౌలర్ కెప్టెన్ అనిల్ కుంబ్లే, 2024లో పెర్త్‌లోనే ఆస్ట్రేలియాపై టీమ్ ఇండియా జయకేతనం ఎగురవేయడానికి జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ నైపుణ్యం, కెప్టెన్సీ పటిమ కారణం కాదూ?



■ రామచంద్ర గుహ

గతానుగతం

నేను క్రికెట్ అభిమానినే కానీ క్రికెట్ వ్యవహారాల నిర్వాహకులను ప్రభావితం చేయగలిగేవాడిని కాను కదా. ఈ కారణంగానే నా ప్రతిపాదన పరిశీలనకు నోచుకోలేకపోయింది. నేను ఆ వ్యాసం రాసి ఏడాది గడవక ముందే అజరుద్దీన్ కెప్టెన్సీ నుంచి నిష్క్రమించారు. ఆయన స్థానంలో సచిన్ టెండూల్కర్ వచ్చారు. సచిన్ గతంలో కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించారు. అయితే ఆ కెప్టెన్సీలో ఎలాంటి ప్రత్యేకత లేకపోయింది. ఎనిమిది టెస్ట్ మ్యాచ్‌ల అనంతరం సచిన్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో గంగూలీ వచ్చారు. వివిధ భారతీయ నగరాలలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లలో టీమ్ ఇండియాకు ప్రశస్త విజయాలు సాధించిపెట్టిన చరిత్ర గంగూలీకి ఉన్నది. అయితే ఆయన బ్యాటింగ్ సామర్థ్యం క్షీణముఖం పట్టడంతో కెప్టెన్సీ బాధ్యతను రాహుల్ ద్రావిడ్‌కు అప్పగించారు.

అజరుద్దీన్ అన్నిటి కంటే ముందుగా బ్యాటర్. అనితరసాధ్యమైన బ్యాటింగ్ ప్రతిభ ఆయన సొంతం. టీమ్ ఇండియా కెప్టెన్‌గా ఆయన వారసులు ముగ్గురూ–సచిన్, గంగూలీ, ద్రావిడ్– స్కిప్పర్లు. వికెట్లు పడగొట్టడం, మ్యాచ్‌లు గెలుచుకునేందుకు ఆ ముగ్గురూ అనిల్ కుంబ్లేపై ఆధారపడినవారే.

అజరుద్దీన్ రిటైర్ అయిన తరువాత కెప్టెన్సీ అవకాశానికి కుంబ్లే 83 టెస్ట్ మ్యాచ్‌ల దాకా వేచి ఉండవలసివచ్చింది. 2007లో పాకిస్థాన్‌పై టీమ్ ఇండియాకు సారథ్యం వహించేందుకు కుంబ్లేకు ప్రప్రథమంగా అవకాశం లభించింది. నిజానికి అంతకు ముందు సంవత్సరాలలోను కుంబ్లేను కెప్టెన్‌గా నియమించి ఉన్నట్టయితే ఆయన ఎటువంటి విజయాలు సాధించి ఉండేవారో కదా? మ్యాచ్‌లు గెలవగలిగే సామర్థ్యంలో సచిన్‌కు లభించిన గౌరవమే కెప్టెన్‌గా కుంబ్లేకూ లభించింది. ఫీల్డ్‌లో గంగూలీ మాదిరిగా కుంబ్లే కూడా దూకుడుగా వ్యవహరించేవారు, ద్రావిడ్ వలే ఆయన కూడా సంపూర్ణంగా టీమ్‌కు కట్టుబడిన ఆటగాడు. నేను, మరికొంత మంది ఆశించినట్టు 1999లోనే కుంబ్లే కెప్టెన్ అయి ఉన్నట్టయితే దాదాపు ఒక దశాబ్ద కాలం పాటు ఆ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండే అవకాశం ఆయనకు లభించి ఉండేది.

మొత్తం మీద టీమ్ ఇండియా కెప్టెన్‌గా కుంబ్లే స్వల్పకాలం మాత్రమే ఉన్నారు. 2008లో పెర్త్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్ ఆయన కెప్టెన్సీ చరిత్రలో ఒక ఘనమైన రికార్డు. 2024 పెర్త్ టెస్ట్ వలే ఆనాడు కూడా టీమ్ ఇండియా దాదాపు ఓటమి అంచుకు చేరి అనూహ్యంగా విజయం సాధించింది. అంతకు ముందు సిడ్నీలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఓడిపోయింది. అంపైరింగ్‌లో జరిగిన పొరపాట్లు కూడా ఆ సిడ్నీలో ఓటమికి కారణమయ్యాయి. అటువంటి ప్రతికూల పరిస్థితుల్లో అనిల్ కుంబ్లే నైరాశ్యంలో ఉన్న తన జట్టు సభ్యులను ఉత్సాహపరిచి పెర్త్‌లో విజయానికి నడిపించారు. అసాధారణమైన విజయమది.

2024లో సైతం స్వదేశంలో న్యూజిలాండ్ చేతుల్లో ఘోరంగా ఓడిపోయిన భారత్ జట్టు ఆస్ట్రేలియాలో ఆ దేశ జట్టుపై గెలవడం అసాధ్యమని క్రికెట్ అభిమానులు అందరూ తీర్మానించుకున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ, బ్యాటర్ శుభ్‌మన్‌గిల్ లేకపోవడం కూడా టీమ్ ఇండియాకు విజయావకాశాలు ఏ మాత్రం లేవనే అభిప్రాయానికి తావిచ్చింది. అయితే మొదటి రోజు చివరి దశలో భారత్ కెప్టెన్, ప్రతిభావంతుడైన బౌలర్ ఆస్ట్రేలియన్ బ్యాటింగ్ వెన్ను విరిచాడు. ఆ తరువాత రెండు రోజులు భారత ఆటగాళ్లు ప్రశస్తంగా ఆడి ప్రత్యర్థులను నిలువరించి తిరుగులేని విజయం సాధించారు.

పెర్త్‌లో బౌలర్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా తన జట్టుకు నెరపిన అసాధారణ సారథ్యం విస్తృతంగా ప్రశంసలు పొందింది. ఆటలోనేకాదు, మ్యాచ్ ముగిసిన అనంతరం విలేఖర్ల సమావేశంలో బుమ్రా ప్రవర్తించిన తీరు కూడా అందరినీ ఆకట్టుకున్నది. సందేహం లేదు బుమ్రా అసాధారణ ప్రజ్ఞావంతుడు. పరిణత వ్యక్తి. రోహిత్ శర్మ రిటైర్మెంట్‌కు సమీపిస్తున్నందున ఆయన తరువాత కెప్టెన్సీ బాధ్యతలను బుమ్రాకు అప్పగించాలని ఇప్పటికే పలువురు సూచించారు. రోహిత్‌కు ప్రత్యామ్నాయంగా రిషబ్ పంత్‌ను కొంతమంది ప్రతిపాదించారు. బౌలర్ –కెప్టెన్లపై ఉన్న అపోహల కారణంగానే ఇటువంటి ప్రతిపాదనలకు ఆస్కారమేర్పడుతుంది. అయితే పెర్త్‌లో టీమ్ ఇండియాకు బుమ్రా అందించిన సమర్థ నాయకత్వాన్ని చూసిన తరువాత, రోహిత్ శర్మ వారసుడు ఎవరనేది మరి ఆలోచించనవసరం లేదు.

2008లో పెర్త్‌లో టీమ్ ఇండియా విజయం సాధించినప్పుడు కెప్టెన్ కుంబ్లే వయసు 37 సంవత్సరాలు. ఆ సంవత్సరాంతంలోగానే ఆయన టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యారు. 2024లో పెర్త్‌లో టీమ్ ఇండియా విజయానికి కారకుడైన బుమ్రా ఇంకా 31వ వసంతంలోకి ప్రవేశించలేదు. రోహిత్ శర్మ రేపో మాపో క్రికెట్ నుంచి నిష్క్రమించనున్నారు. బుమ్రాకు టెస్ట్ క్రికెట్‌లో నాలుగు లేదా ఐదు సంవత్సరాల పాటు అవకాశాలు ఉన్నాయి.

ఒకనాడు కుంబ్లే వలే బుమ్రా కూడా భారతదేశ అగ్రగామి [illegible] బౌలర్. కుంబ్లేకు వలే బుమ్రా కూడా వికెట్లను తీసుకునే సహచర ఆటగాళ్ల సహాయ సహకారాలు సమృద్ధిగా ఉన్నాయి. వారిలో అశ్విన్, జడేజా, షమీ ప్రముఖులు. ఈ ముగ్గురూ బుమ్రా కంటే వయస్సులో పెద్దవారు. ఒకటి రెండేళ్లలో క్రికెట్ నుంచి రిటైర్ అయ్యేవాళ్లే. అయితే సిరాజ్, కుల్దీప్‌లు బుమ్రా కంటే చిన్నవాళ్లు. హర్షిత్ రాణా వలే పెర్త్‌లో తమ ప్రతిభాపాటవాలను చూపిన యువ బౌలర్లు ఉన్నారు. ఇది బుమ్రాకు శుభసూచకం. ఆయన నిస్సందేహంగా టీమ్ ఇండియాకు ప్రశస్తమైన బౌలర్–కెప్టెన్ కాగలరు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ప్రజానాడి తెలిసిన పాలనాదక్షుడు

తెలంగాణ రాష్ట్ర సాధనకు కారణభూతుడు, పది సంవత్సరాలు తొలి ముఖ్యమంత్రిగా అధికారంలో వున్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డిని ‘తెలంగాణ మహానాయకుడు’గా కొనియాడేవారు. 1969 ఉద్యమాన్ని పతాక స్థాయికి చేర్చిన చెన్నారెడ్డి, మలిదశ ఉద్యమానికి మార్గం సుగమం చేసి, రాష్ట్ర సాధనకు కారకుడయ్యాడని కేసీఆర్ అనేవారు. 1971 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) అఖండ విజయం సాధించినప్పటికీ, సీపీఐ నేత ఎస్ఏ డాంగే సలహాతో ఇందిరాగాంధీ రాష్ట్ర ఏర్పాటుకు నిరాకరించారని కేసీఆర్ అనేవారు. కొన్ని రక్షణలను హామీగా పొందడంతో సరిపెట్టుకొని, చెన్నారెడ్డి టీపీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేశారు. తెలంగాణలోని ఆయన ప్రత్యర్థులు ఆంధ్ర కాంగ్రెస్ నేతలతో కుమ్మక్కై ఆయనను విమర్శించేవారు.

చెన్నారెడ్డి, ‘తెలంగాణ అభిమాని, నిర్ద్వంద్వంగా తెలంగాణవాది.’ 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ముందుగానే, అమృతసర్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశానికి, తెలంగాణ అంశంపై అభిప్రాయం వెల్లడించడానికి ఆయనను ఆహ్వానించారు. ఆ సమావేశంలో, దూరదృష్టితో, సాక్ష్యాధారాలతో ఆయన అభిప్రాయం తెలిపిన వెంటనే, వాటితో తాను ఏకీభవిస్తానే, భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు తాను అనుకూలమని జవహర్‌లాల్ నెహ్రూ స్పష్టం చేశారు. అప్పుడు అక్కడే వున్న మౌలానా అజాద్, నెహ్రూతో, ‘మీ జమీర్ (మనస్సు) పిల్పిలా (నీరసంగా) అయిందని’ చమత్కరించారు.

పాత్రికేయ మిత్రుడు వెంకట్ పార్సా ద్వారా, డాక్టర్ చెన్నారెడ్డితో 1988లో పరిచయం, తరచూ కలిసే అవకాశం కలిగింది. మేమిద్దరం తరచు చెన్నారెడ్డి తార్నాకా నివాసానికి వెళ్లేవాళ్లం. ఆయన తన అనుభవాలను, అరుదైన రాజకీయ జ్ఞాపకాలను పంచుకునేవారు. అవి ఎంతో ప్రేరణాత్మకంగా, ఆసక్తికరంగా, ఉల్లాసంగా ఉండేవి. రాజకీయాలలో ఎదుగుతున్న, ఎదగాలనుకున్న యువ నాయకులు, వీటిని తెలుసుకోవడం ఎంతో అవసరం.

చెన్నారెడ్డి రెండవసారి (1989–90) ముఖ్యమంత్రి అయినప్పుడు, ఆయన పీఆర్వోగా పనిచేసే అవకాశం నాకు కలిగింది. అప్పుడూ, అంతకుముందు ఆయన్ను ఏపీసీసీ అధ్యక్షుడిగా నియమించబడటానికి ముందు, తరువాత, నేను ఆయనను దగ్గరగా పరిశీలించే వీలు కలిగింది. ఒక సీనియర్ నాయకుడిగా, సమస్యలను నిజాయితీగా, నిబద్ధతతో ఎదుర్కొని, ప్రజలతో మమేకమై వ్యవహరించడంలో ఆయనకు ప్రత్యేక నైపుణ్యం ఉన్నదన్న అభిప్రాయం నా మొదటి పరిచయంలోనే ఏర్పడింది. ఆయనతో అనుభవాలు జీవితంలో చెరగని అక్షరాలుగా, స్ఫూర్తిని అందించే పాఠాలుగా నిలిచాయి. డాక్టర్ చెన్నారెడ్డికి వున్న రాజకీయ పరిజ్ఞానం, నేతృత్వ లక్షణాలు, సంక్షోభ నిర్వహణలో నైపుణ్యత, క్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించే తీరు ఇతరులలో అరుదుగా కనిపిస్తుంది.



తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం, నాయకత్వ నైపుణ్యం, ప్రజలతో సన్నిహితంగా మమేకం కావడం వంటి ప్రత్యేకతలు డాక్టర్ మర్రి చెన్నారెడ్డిని అసాధారణ నేతగా నిలిపాయి. రాజకీయ చతురతతోనూ, ప్రగతిశీల ఆలోచనలతోనూ, అత్యున్నత ప్రజాసేవా దృక్పథంతోనూ ఆయన తన సేవలు అందించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర అపురూపం. వర్తమాన తెలంగాణ విజయగాథలో చెన్నారెడ్డి స్ఫూర్తి ప్రతిబింబిస్తున్నది. మర్రి చెన్నారెడ్డి లేకుండా తెలంగాణ ఉండేది కాదు.

1950లో ప్రొవిజనల్ పార్లమెంట్‌కు నామినేట్ కావడం, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ విప్‌గా నియమితులవడం కాక ముందు, చెన్నారెడ్డి మూడు సంవత్సరాలు వైద్యవృత్తిలో వున్నారు. 1952లో, హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికై, బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. అప్పటి ఆయన ‘అధిక దిగుబడి’ నినాదం, భవిష్యత్తులో ‘హరిత విప్లవం’గా రూపుదిద్దుకుని, దేశం ఆహారధాన్యాల విషయంలో స్వయంసమృద్ధిని సాధించడానికి దోహదపడింది. 1967 సాధారణ ఎన్నికల తరువాత, ఇందిరాగాంధీ కేంద్ర కేబినెట్‌లో చేరమని సూచించినప్పటికీ, ముఖ్యమంత్రిగా కొనసాగడానికే మొగ్గుచూపిన బ్రహ్మానందరెడ్డి తనకు బదులుగా చెన్నారెడ్డి పేరును ప్రతిపాదించారు.

ముల్కీ ఉద్యమాన్ని నడిపేందుకు ‘తెలంగాణ ప్రజా సమితి’ (టీపీఎస్)ను స్థాపించిన ఏ.మదన్‌మోహన్, తన అధ్యక్ష స్థానాన్ని చెన్నారెడ్డికి అప్పగించారు. ఇది చెన్నారెడ్డి నేతృత్వ సామర్థ్యాలను, నాయకత్వ పటిమను ప్రజలు తెలుసుకోవడానికి, తరువాత జరిగిన 1971 లోక్‌సభ, 1978 అసెంబ్లీ, 1980 లోక్‌సభ, 1989 లోక్‌సభ–అసెంబ్లీ ఎన్నికలలో ‘భారీ విజయాలు’ సాధించడానికి మార్గం సుగమం చేసింది. ఈ విజయాల వల్ల చెన్నారెడ్డి ‘అద్భుతమైన నాయకత్వ నైపుణ్యం’ ఉన్న వ్యక్తిగా నిరూపితమయ్యారు. 1989 మే 1న, చెన్నారెడ్డిని ఏపీసీసీ(ఐ) అధ్యక్షుడిగా నియమించారు.

ఒక నెల తర్వాత, జూన్ 3, 1989న, ‘జవహర్ రోజ్గార్–పంచాయత్ రాజ్: గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం’ అనే అంశంపై ‘నేషనల్ ఇన్ఫర్మేషన్ సర్వీస్’ ఆధ్వర్యంలో, బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో చెన్నారెడ్డి అధ్యక్షత నేను ఏర్పాటు చేసిన సమావేశంలో, సివి నరసింహన్ (ఐసీఎస్), మోహిత్ సేన్ (సీపీఐ నాయకుడు), మదన్‌మోహన్, ఉమా గజపతి రాజు తదితరులు ఘాటుగా ప్రసంగించారు. ఎన్టీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, జైలు భరో కార్యక్రమం అద్భుతంగా ఆయన నిర్వహించడంతో రాష్ట్ర కాంగ్రెస్‌ను ఉత్తేజపరిచాయి. 1989 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ 294 సీట్లలో 181 సీట్లు గెలుచుకుంది.


కాంగ్రెస్ అధిష్ఠానం ఆశీస్సులతో చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఎంపికయ్యారు. ఎన్నికల ముందు ఒక సందర్భంలో మాటవరసకు అన్న ప్రకారం, చెన్నారెడ్డి నన్ను తన నివాసానికి పిలిచి, పీఆర్వోగా నియమించారు.

మర్రి చెన్నారెడ్డి వంటి మహానేతలు రాజకీయాల్లోకి రావడం అనేది అరుదైన భాగ్యం. తెలంగాణ ఉద్యమానికి ఆయన దిశానిర్దేశం, నాయకత్వ నైపుణ్యం, ప్రజలతో సన్నిహితంగా మమేకం కావడం వంటి ప్రత్యేకతలు ఆయనను అసాధారణ నేతగా నిలిపాయి. రాజకీయ చతురతతోనూ, ప్రగతిశీల ఆలోచనలతోనూ, అత్యున్నత ప్రజాసేవా దృక్పథంతోనూ ఆయన తన సేవలు అందించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర అపూర్వం, అపురూపం. దీనిని తర్కించలేము. వర్తమాన తెలంగాణ విజయగాథలో చెన్నారెడ్డి స్ఫూర్తి ప్రతిబింబిస్తున్నది. ఆయన విలువలు, ఆలోచనల నుంచి మనం ఎన్నో, ఎన్నెన్నో పాఠాలు నేర్చుకోవాలి. మర్రి చెన్నారెడ్డి లేకుండా తెలంగాణ ఉండేది కాదు.

■ వనం జ్వాలా నరసింహారావు


విశిష్ట ట్రేడ్ యూనియనిస్ట్ ఎన్.వి. భాస్కరరావు

హైదరాబాదు నగర సిపిఐ(ఎం) పార్టీ, సిఐటియు వ్యవస్థాపకులు కామ్రేడ్ ఎన్.వి. భాస్కరరావు వాటి నిర్మాణం, విస్తరణ క్రమంలో (1964–84) ముఖ్యపాత్ర నిర్వహించారు. భాస్కరరావు సహచరుల, అనుయాయిల జ్ఞాపకాలను అనుభవజ్ఞులైన సంపాదకవర్గం సాయంతో ఆయన ముగ్గురు కుమార్తెలు రూపొందించిన ‘హైదరాబాదు కార్మికోద్యమ దశ, దిశ మార్చిన కా. ఎన్.వి. భాస్కరరావు’ పుస్తకాన్ని కా. బి.వి.రాఘవులు (సిపిఐఎం పొలిట్ బ్యూరో సభ్యులు) నవంబర్ 30న ఉ. 11.గం.లకు సిపిఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ 23వ మహాసభల ప్రారంభ సభలో ఆవిష్కరిస్తారు. హైదరాబాద్ ఎస్.ఆర్. నగర్ మెట్రో సమీపంలోని శ్రీనివాసనగర్ వెస్ట్ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది.



ఎన్.వి. భాస్కరరావు కృష్ణా జిల్లా చల్లపల్లి దగ్గరున్న కమ్యూనిస్టు ప్రభావిత నాదెళ్ళవారి పాలెం అనే గ్రామంలో 1931 జనవరి 9న నాదెళ్ళ రంగయ్య, వెంకటనర్సమ్మ దంపతులకు జన్మించారు. ఆ ఊరిలోని కొంతమంది కమ్యూనిస్టు పార్టీ నాయకులతోపాటు, పుచ్చలపల్లి సుందరయ్య ప్రభావం అతిచిన్న వయస్సులోనే భాస్కరరావు మీద పడింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సమయంలో (1946–1951) ముఖ్య నాయకులకు కొరియర్ గా భాస్కరరావు రాజకీయ ప్రస్థానం మొదలైంది. పార్టీ ఆఫీసు కార్యదర్శిగానూ, సిపిఐ(ఎం) శాసనసభాపక్ష ఆఫీసు కార్యదర్శిగాను, పార్టీ కార్యక్రమాలలోనూ భాస్కరరావు చురుగ్గా పనిచేశారు. 1964లో పార్టీ మొట్టమొదటి చీలిక తరువాత నుండి, చనిపోయేవరకు (1984 అక్టోబర్ 24) సిపిఐ(ఎం) హైదరాబాదు నగర కార్యదర్శిగా పనిచేశారు. 1970–84 మధ్యకాలంలో ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులతో కలసి ట్రేడ్ యూనియన్ రంగంలో గుణాత్మకమైన మార్పులను తీసుకొని రాగలిగారు. ప్రభుత్వ రంగ సంస్థలలోను, ప్రైవేటు రంగ పరిశ్రమలలోను, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలలోను, ప్రభుత్వోద్యోగుల సంఘాలలోను, ఇతర ప్రజాసంఘాలలోను సిఐటియుని, పార్టీని నగరంలోని అనేక ప్రాంతాలకు విస్తరింపచేశారు. చాలామంది పార్టీ కార్యకర్తలను భాస్కరరావు ఓర్పుతో, పట్టుదలతో నిబద్ధతతో నాయకులుగా తీర్చిదిద్దారు. నిశితమైన విప్లవ లక్ష్యంతో తుదిశ్వాస వరకు నిలబడిన ఆదర్శమూర్తి ఎన్.వి. భాస్కరరావు.

– శ్యామల, నిర్మల, ప్రమీల



తూనికల శాఖలో.. వసూళ్ల దందా!

వ్యాపారుల వద్ద చేతివాటం చూపుతున్న అధికారులు

మట్టెవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కంచే చేనుమేసినట్టుగా ఉంది ఉమ్మడి వరంగల్ జిల్లా తూనికలు కొలతల శాఖలోని కొందరు అధికారుల తీరు. వినియోగదారులు మోసపోకుండా కాపాడాల్సిన వీరే వ్యాపారులతో కుమ్మక్కై, చీకటి దందా నడుపుతున్నారు. ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. నిరంతరం షాపుల్లో తనిఖీలు నిర్వహించి మోసాలను అరికట్టాల్సింది పోయి మామూళ్ల మత్తులో పడి ప్రజలను మోసం చేసే వ్యాపారులకే వత్తాసు పలుకుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొందరు వ్యాపారులు తూనికలు, కొలతల శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తూ వస్తువులను ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు విక్రయించడం, ప్యాకింగ్‌లో మోసం చేస్తున్నా లీగల్ మెట్రాలజీ విభాగం అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

తూనికలు, కొలతల శాఖ అధికారులు వారానికో.. నెలకో ఒకసారైనా దుకాణాల్లో తనిఖీలు చేయాలి. కానీ నెలల తరబడి పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాటు రాళ్లతో కాంటా వేస్తున్నారు. అలాంటి వారిపై లీగల్ మెట్రాలజీ అధికారులు నామమాత్రంగా కేసులు నమోదు చేసి సొంత లాభాన్ని చూసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. తూనికలు, కొలతల శాఖలో సిబ్బంది కొరత ఉండటంతో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించడంతో వారు వారంలో మూడు రోజులు కూడా వారు తనిఖీలు చేయడంలేదు. ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై లీగల్ మెట్రాలజీ వరంగల్ ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారు. తనిఖీలకు ప్రైవేట్ వ్యక్తులను తీసుకెళ్లి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒక ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ కిరాణషాపులు, ఐరన్ హార్డ్‌వేర్ షాపులు, పెట్రోల్ బంకులు, బంగారు దుకాణాలు, మాల్స్ నిర్వాహకుల వద్ద పెద్ద మొత్తంలో వసూళ్ళకు పాల్పడినట్లు తూనికలు కొలతల శాఖలో చర్చ సాగుతోంది.



- తూకాల్లో మోసాలే వీరికి ఆదాయ మార్గాలు
- రెన్యువల్ పేరుతో నిబంధనలకు మించి ఫీజుల వసూలు
- మామూళ్లు అందితే సరే.. లేదంటే కేసులు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు
- ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న వైనం

కార్యాలయంలో కన్పించరు.. క్షేత్రస్థాయిలో ఉండరు..

లీగల్ మెట్రాలజీ అధికారులు కార్యాలయానికి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియదు. కార్యాలయానికి వేళ్తే సిబ్బంది తప్ప అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరు. తూకంలో జరుగుతున్న మోసాలను నియంత్రించాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటు పడుతూ నిమ్మకుంటుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

మరమ్మతులు, రెన్యువల్ పేరుతో వసూళ్లు..

లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు కాంటాల మరమ్మతులు, రెన్యువల్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నట్టు వ్యాపారులే చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఎలక్ట్రిక్ కాంటాలను ఏడాదికి ఓసారి రెన్యూవల్ చేసుకోవాలి. మ్యానువల్ కాంటాలు అయితే రెండేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. కానీ ఇన్‌స్పెక్టర్లు మధ్యవర్తుల ద్వారా మ్యానువల్ కాంటాలను కూడా ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని షాపు యాజమానులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. వేబ్రిడ్జీలు రెన్యూవల్, మరమ్మతు ఫీజు కింద నిబంధనల మేరకు రూ.2500 చెల్లించాలి. కానీ లీగల్ మెట్రాలజీ అధికారులు రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. ఇక ఎలక్ట్రిక్ కాంటా స్టాంపింగ్ కోసం రూ.750లకు గాను రూ.2వేలు వసూలు చేస్తున్నారు. చిన్న కాంటాలకు రెన్యూవల్ ఫీజు రూ.350 అయితే రూ.1500 వసూలు చేస్తున్నారు. పెట్రోల్ బంకులో ఉన్న నజల్ ఏడాదికి ఒకసారి రెన్యూవల్ చేయాలి. ఇందుకోసం రూ.1720 ఫీజు చెల్లించాలి. కానీ లీగల్ మెట్రాలజీ అధికారులు ఒక్కో బంకు నుంచి రూ.10వేలు వసూలు చేయడంతో పాటు పెట్రోల్, డీజిల్ తమకు ఉచితంగా ఇవ్వాలని బంకు యాజమానులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఇక తూకం రాళ్లపై ముద్రలను నిర్ణీత వ్యవధిలో వేయించాల్సి ఉంటుంది. దీనిపైనా పర్యవేక్షణ ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి.



విలేకరుల సమావేశంలో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ

నేడు నిట్ స్నాతకోత్సవం

- 22వ సంబురానికి ఏర్పాట్లు పూర్తి
- హాజరవనున్న డిఫెన్స్ డైరెక్టరేట్ సెక్రెటరీ డాక్టర్ సమీర్ వి కామత్
- 1875 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- వివరాలు వెల్లడించిన నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ

6

రామప్పకు కేంద్రం 'ప్రత్యేక' నిధులు

'రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం' కింద రూ.73.74 కోట్లు మంజూరు



హనుమకొండ, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక, యునెస్కో గుర్తింపు పొందిన అద్భుత పురాతన కట్టడం రామప్పకు కేంద్ర ప్రభుత్వం రూ.73.74కోట్లను మంజూరు చేసింది. రామప్పతో పాటు దానిని ఆనుకొని ఉన్న ఇతర చూడదగ్గ ప్రాంతాల సుస్థిర పర్యాటక ప్రాంత సర్క్యూట్‌కు గాను ప్రభుత్వం ఈ నిధులను ఇచ్చింది. కొవిడ్ సంక్షోభ సమయంలో మూల వ్యయం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం' కింద ఈ నిధులు మంజూరు అవగా.. ఈ సొమ్ములతో రామప్ప దానిచుట్టు పక్కల ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఈ నిధులను ఖర్చు చేస్తారు. 23 రాష్ట్రాల్లోని 40 ప్రధాన పర్యాటక ప్రాంతాలకు మొత్తం రూ.3,295.76 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో భాగంగా తెలంగాణలో రామప్పతో పాటు నల్లమల ప్రాంతంలో ఉన్న సోమశిలకు నిధులను కేటాయించింది. సోమశిల వెల్‌నెస్ అండ్ స్పిర్చువల్ రిట్రీట్ పేర రూ.68.10 కోట్లను ఇచ్చింది. ఈ ప్రత్యేక సహాయం కింద ప్రతీ రాష్ట్రంలో రెండేసి దర్శనీయ స్థలాలను ఎంపిక చేసి నిధులను విడుదల చేసింది.

రోడ్డుప్రమాదంలో దంపతుల మృతి

- ఆటోను ఢీకొట్టిన మినీ వ్యాన్
- అక్కడికక్కడే భార్య, చికిత్స పొందుతూ భర్త మృతి

4



ఘటనస్థలంలో సమ్రీన్ మృతదేహం

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

ఎంజీఎంలో పనులను పరిశీలించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ మెడికల్, నవంబరు 29 (అంధ్రజ్యోతి) : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి, మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆస్పత్రి ఆవరణలో కొనసాగుతున్న ఇందిరమ్మ క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించి ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన 6 ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల పునరుద్ధరించి సుందరీకరించిన పేషెంట్ వెయిటింగ్ హాల్, వయోవృద్ధుల కోసం నిర్మించిన ఓపీ గదితోపాటు రోగుల అవసరకోసం నిర్మించిన టాయ్‌లెట్లను పరిశీలించి త్వరగా రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. డయాలసిస్ విభాగంలో నీటికొరత వల్ల డయాలసిస్ జరగడం లేదని కలెక్టర్ దృష్టికి రోగులు తీసుకురాగా స్పందించిన కలెక్టర్ బోర్‌వెల్‌తోపాటు పైపులైన్ వేయించడం జరిగిందని, ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ కుమార్, ఆర్ఎంవోలు మురళి, శ్రీనివాస్, శశి, డీఎంసీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన కాంగ్రెస్

- ఉద్యమ చరిత్రలో మరుపురాని రోజు దీక్షా దివస్
- కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో గెలుస్తాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- హాజరైన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నేతలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మట్టెవాడ నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలకు కేసీఆర్ స్వేచ్ఛనిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఉద్యమ చరిత్రలో దీక్షా దివస్‌ది మరపురాని రోజని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. దీక్షాదివస్ సందర్భంగా శుక్రవారం వరంగల్‌లోని ఓ గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అక్కడ ఏర్పాటు చేసిన కేసీఆర్ భారీ కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు. అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కేసీఆర్ జీవిత చరిత్ర, ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకోగా.. కళాకారుల ధూం..ధాంతో సభ దద్దరిల్లింది. అనంతరం జరిగిన సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమ ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. పరాయి పాలనలో ఉన్న తెలంగాణకు స్వేచ్ఛ ఇచ్చింది కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో భూముల విలువ లక్షల నుంచి రూ.కోట్లకు పెరిగితే.. కాంగ్రెస్‌పాలనలో తగ్గిందని విమర్శించారు. కేసీఆర్ రైతులను రాజులు చేశారని, తెలంగాణకు తాగు, సాగునీరు అందించారని, తండాలను గ్రామపంచాయితీలుగా తీర్చిదిద్దారని, కులానికో సంక్షేమ పథకం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు గోస పడుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. మరో ఉద్యమం ఓరుగల్లు నుంచే ప్రారంభమవుతుందని, కేసీఆర్ దయతోనే సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయంగా అవకాశం వచ్చిందన్నారు.కార్యకర్తలు అధైర్యపడకుండా పనిచేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ దయతోనే రేవంత్‌రెడ్డి 2001లో జడ్పీటీసీగా గెలిచారని, కేసీఆర్‌కు వంగి వంగి దండాలు పెట్టి జడ్పీటీసీగా గెలిచిన రేవంత్‌రెడ్డికి కేసీఆర్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. తెలంగాణలో మరో ఉద్యమం రాబోతోందని, భవిష్యత్‌లో ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని, వరంగల్‌లో పెద్ద ఎత్తున దీక్ష దివస్ నిర్వహించడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు సూచించారు.

చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని, ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పెద్ది స్వప్న, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, ప్రముఖ న్యాయవాది, మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేశ్, బీఆర్ఎస్ నాయకులు మరుపల్లి రవి, దాచేపల్లి సీతారాం, గోరంట్ల మనోహర్, గోగికార్ రవీందర్, టి.రమేశ్‌బాబు, కుందారపు రాజేందర్, బయ్యు స్వామి, చిలివేరు పవన్, రంజిత్, తాళ్ళ ఉమాదేవి, వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్న పేట, పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకు లు కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వాణిదేవి

తెలంగాణకు దిక్సూచి కేసీఆర్

ఆయన పేరు చెరిపిస్తే చెరిగేది కాదు

ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జ్ వాణిదేవి

4

శాస్త్రీయ దృక్పథంతో లక్ష్యాలను అధిగమించాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- ప్రారంభమైన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే రేవూరి, నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 29 : విద్యార్థులందరూ శాస్త్రీయ ఆలోచన దృక్పథంతో వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో అతిథులుగా పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరా జు, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, డీఈవో డి. వాసంతి తదితరుల తో కలిసి ఆయన సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశా రు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ... సైన్స్ లేకుండా ఏదీ లేదన్నారు. జీవితం మొత్తం సైన్స్‌తోనే ముడిపడి ఉం దన్నారు. విద్యార్థులందరు శాస్త్రీయ ఆలోచనలతోనే ముందుకు సాగాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అధ్యక్షోపన్యాసం చేస్తూ... సైన్స్ ఫెయిర్ అంటే మూడు రోజుల ముందు నుంచే హడావుడి చేసేవారమని తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వరంగల్‌లోని సైన్స్ సెంటర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు రూ.10 కోట్లతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థుల్లో వినూత్నమైన ఆలోచనలు పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మాట్లాడుతూ... సైన్స్ నిరంతర విద్య అన్నారు. ఆకాశమే హద్దుగా విద్యార్థులు తమ ఆలోచనలు ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే ఎలాంటి సహకారానికైనా తాము సిద్ధంగా ఉంటామన్నారు. జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగిఉన్న వినూత్నమైన ఆలోచనలకు ప్రదర్శించే వేదికలుగా ఉపయోడపడుతాయని, ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు గొప్ప అవకాశమన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా ప్రశంసిస్తామన్నారు. ఆహుతులు ఎగ్జిబిట్లను సందర్శించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మం ప్రారంభంలో స్వాగత గీతానికి నృత్య ప్రదర్శన చేసిన మర్కజీ పాఠశాల విద్యార్థులను ఆహుతులు అభినందించారు. సైన్స్ ఫెయిర్‌లో ఇన్‌స్పైర్‌కు సంబంధించిన 120 నమూనాలతో పాటు, సైన్స్ ఫెయిర్‌కు సంబంధించిన 106 మొత్తం 226 ప్రద ర్శనలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, ఎంఈవోలు, నిర్వహణ కమి టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇక్కట్లు...

హనుమకొండ నడిబొడ్డులో అన్ని సౌకర్యాలతో అలరారుతున్న ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీ, ఉన్నత పాఠశాల అందుబాటులో ఉండగా అధికారులు మూడంతస్తులున్న ఓ ప్రైవేటు పాఠశాల భవనంలో సైన్స్ ఫెయిర్‌ను ఏర్పాటు చేయడం విమర్శలకు తావిచ్చింది. చాలీచాలని భోజనం అందించడంపై విద్యార్థులతో పాటు వారితో పాటుగా వచ్చిన ఉపాధ్యాయులు నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇరుకు గదుల్లో ఎగ్జిబిట్లు ఏర్పాటు చేయడం పట్ల పలువురు ఉపాధ్యాయులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది.

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-17 ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న అండర్ -14, 17బాలబాలికల టెన్నిస్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దస్రూ తెలిపారు.

అండర్-14 బాల బాలికల విభాగంలో...

డి. దైవిక్ (వరంగల్ పబ్లిక్‌స్కూల్),బి. కృష్ణవిహారి (వరంగల్ పబ్లిక్ స్కూల్), డి, నిత్యసారూన్(వరంగల్ పబ్లిక్ స్కూల్).

అండర్-17 బాలుర విభాగంలో....

బి.అభినవ్(ప్రభుత్వ జూనియర్ కాలేజ్ హనుమకొండ), ఎం.అక్షయ్(ఎస్‌ఎంఆర్ హైస్కూల్), ఎం. శ్రీహస్(శ్రీచైతన్యఐపీఎల్‌స్కూల్), టి. అనీష్‌రాజ్(స్కిల్‌స్ట్రోక్ హైస్కూల్) ఎం. మల్లికార్జున్(హనుమకొండ ప్రభుత్వ హైస్కూల్).

బాలికల విభాగంలో...

భవాని ఎస్ పాటిల్ (సెయింట్ పీటర్స్ హైస్కూల్), జే ఆర్యతి చంద్ర వేద (తేజస్విని హైస్కూల్), వి. శ్రీవాణి (సాయి శివాణి జూనియర్ కాలేజ్), ఎన్ ప్రసన్న(వంచనగిరి మోడల్ స్కూల్), పి. తూజరాణి(వంచనగిరి మోడల్ స్కూల్)కు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారని దస్రూ తెలిపారు.

పీఆర్టీయూ టీఎస్‌తోనే సమస్యల పరిష్కారం

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి



పదవి విరమణ పొందిన గోలి రామకృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భీమదేవరపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ టీఎస్‌తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు గోలి రామకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం భీమదేవరపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి దంపతులను పలువురు ఉపాధ్యాయులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా రామకృష్ణారెడ్డి విశిష్ట సేవలందించారన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తీర్చిదిద్దారన్నారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. త్వరలోనే ఉపాధ్యాయ ఉద్యోగులకు రాబోయే పీఆర్సీలో పిట్‌మెంట్‌లో గతంలో కంటే ఎక్కువ ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మందల తిరుపతిరెడ్డి, పలీత శ్రీహరి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, దండ కోమల్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీధర్, అజిత్, సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, స్రవంతి, సునీత, అనిత, రాజేశ్వరిపాల్గొన్నారు.

ముగిసిన కేయూ సోషియాలజీ జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్ నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : కేయూ సోషియాలజీ, సోషల్‌వర్క్స్ విభాగం నేతృత్వంలో రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. కేయూ సెనెట్ హాల్‌లో సదస్సు డైరెక్టర్, సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ముగింపు సదస్సులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. సదస్సులో వచ్చిన పరిశోధన పత్రాలను పుస్తకంగా తేవాలని, సామాజిక సమస్యలకు సమాధానం అందించడంలో సెమినార్‌లు మార్గం చూపాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డి చెప్పారు. రెండు రోజుల సదస్సు నివేదికను కన్వీనర్ తౌటం శ్రీనివాస్ సదస్సుకు సమర్పించారు. ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్ ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో మానవీయ శాస్త్ర భవనం నుంచి పరిపాలన భవనం వరకు పెద్ద ఎత్తున గుర్రాపు బండిలో ఊరేగిస్తూ విద్యార్థులు నృత్యాలు చేశారు. బాణాసంచా కాల్చారు.

సీఎం కప్‌ను విజయవంతంగా నిర్వహించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2024ను విజయవంతం చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి కప్‌ను గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో వివిధ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10, 11, 12 తేదీల్లో మండలాల్లో, 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయిలో నిర్వహిస్తామన్నారు. వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్, పేరగేమ్స్, ఖోఖో, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, సైక్లింగ్, టేబుల్ టెన్నిస్, లాండ్ టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, ఆర్చరీ, చెస్, జూడో, బేస్‌బాల్, నెట్‌బాల్, కరాటే, స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రంలోనే వరంగల్ జిల్లాను అగ్రగామిగా నిలిచేలా చూడాలన్నారు. వరంగల్‌లోని ఓ సిటీ స్టేడియం, చింతల్ మైదానం, దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానం తదితర ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తు న్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రవీందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, డీఐఎస్‌వో సత్యవాణి, డీపీవో కల్పన, ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజిరెడ్డి, జడ్పీ సీఈవో రాంరెడ్డి పాల్గొన్నారు.

కాశిబుగ్గ: సీఎం కప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేయాలని, ఇందులో క్రీడా సంఘాలు చొరవ చూపాలని జిల్లా యువజన, క్రీడల అధికారిణి టీవీఎల్.సత్యవాణి కోరారు. శుక్రవారం ఓ సిటీలోని స్టేడియంలో వివిధ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

తెలంగాణకు దిక్సూచి కేసీఆర్

ఎమ్మెల్సీ, దీక్షా దివస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ వాణిదేవి

హనుమకొండ టౌన్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని, ఆయన చేసిన అభివృద్ధితోనే దేశంలోనే తెలంగాణ ప్రత్యేక స్థానం సంపాదించుకుందని, ఆయన పేరు చెరిపితే చెరిగేది కాదని ఎమ్మెల్సీ, దీక్షా దీవస్ జిల్లా ఇంచార్జ్ వాణిదేవి అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన నిర్వహించిన దీక్షాదీవస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ కోసం 2009 నవంబరు29 చేపట్టిన దీక్ష చరిత్రాత్మకమైందని, ప్రాణాలకు తెగించి కేసీఆర్ చేసిన దీక్షను చూసి తెలంగాణ ప్రజానీకమంతా కంటతడి పెట్టిందన్నారు. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ ఒక్క రోజుల్లో వచ్చింది కాదని, సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు తెలంగాణ సిద్ధించకుండా కుట్రలకు పాల్పడితే తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో 11 రోజుల పాటు కేసీఆర్ చేసిన ఆమరణ దీక్షతో కేంద్రం దిగొచ్చి తెలంగాణ ఇచ్చేందుకు అడుగులు వేసిందన్నారు. ఆ విషయం యావత్తు తెలంగాణ ప్రజానీకంకు తెలుసన్నారు. ఇవాళ ఆ విషయాన్ని ఈనాటి తరాలకు తెలియజేసేందుకు ప్రజాస్వామ్యయుతంగా దీక్ష దివస్ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామని అనుమతులు అడిగితే ఇవ్వకుండా ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. తెలంగాణ విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ చేసిన ఆందోళనల కారణంగానే ఇవాళ కేంద్రం రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్టర్ యూనిట్‌ను అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా ప్రకటించదన్నారు. రైల్వేలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని మరో ఉద్యమం చేయబోతున్నామని వెల్లడించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ వాదాన్ని విస్తరింపజేసి తెలంగాణను సాధించిన ముద్దుబిడ్డ కేసీఆర్ అన్నారు. దేశంలోని అన్ని పార్టీలను ఒప్పించి తెలంగాణకు స్వేచ్ఛను తీసుకొచ్చిన యోధుడు ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్, చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజు, నాగుర్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు చెన్నం మధు, బొంగు అశోక్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అదాలత్‌లోని అమరవీరుల స్థూపం, ఏకశిల పార్కులోని కాళోజీ విగ్రహం, జయంశకర్, విగ్రహం, అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాల వేసి నివాళర్పించారు. ఉద్యమ సమయంలోని ఫొటోల ఎగ్జిబిట్‌ను ఆసక్తిగా తిలకించి నాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు.

రైల్వే పరిశ్రమలు అప్పుడెందుకు తేలేకపోయారు

వచ్చాక అందరం మేమే తెచ్చాం అంటారు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాలు కలిసి సంసారం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాజీపేటకు రైల్వే వ్యాగన్, కోచ్‌ఫ్యాక్టరీ, డివిజన్ ఎందుకు తీసుకు రాలేకపోయారని, తాము సాధించాక ఇప్పుడు అందరం మేమే తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట మినీ మునిసిపాలిటీలో శుక్రవారం ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైల్వే పరిశ్రమల సాధనతో పాటు ఇతర అభివృద్ధిలో ఎక్కడ కాంగ్రెస్‌కు మంచి పేరొస్తుందో అని ఇతర పార్టీల వారు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. నిత్యం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన గురించి మాట్లాడే వారిది అవగాహన రాహిత్యం అన్నారు. సీఎం ఢిల్లీకి వెళ్లేది బీఆర్ఎస్ నాయకుల మాదిరిగా భూసెటిల్‌మెంట్ల కోసమో, కేసులు తప్పించుకోవడానికో కాదన్నారు. తెలంగాణకు రావల్సిన వాటాల సాధన, నిధుల కోసమే అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఓ విజన్ ఉన్న నాయకుడన్నారు. ఎంపీ కడియం కావ్య ఢిల్లీలో జిల్లాకు రావల్సిన నిధుల కోసమే ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని తెలిపారు. త్వరలో కాజీపేట బస్టాండ్ నిర్మాణం చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ, తోట వెంకటన్న, నాయకులు అబూబక్కర్, ఎండీ అంకూస్, అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, పసునూరి మనోహర్, ఒజ్జ కరుణాకర్, దొంగల కుమార్, తాడూరి ప్రశాంత్, సురేశ్, కట్కూరి రేవంత్, పాక భాస్కర్, తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల క్లినిక్‌లలో తనిఖీలు

ఔషధాల అక్రమ నిల్వల గుర్తింపు



మాట్లాడుతున్న ఔషధ నియంత్రణశాఖ డైరెక్టర్ జనరల్ కమల్ హాసన్‌రెడ్డి

వరంగల్ మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యులు అర్హత లేకున్నా అలోపతి మెడిసిన్‌ను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఔషధ నియంత్రణశాఖ డైరెక్టర్ జనరల్ కమల్ హాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో ఔషధ నియంత్రణ శాఖ అధికారుల బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహిం చింది. ఈ గ్రామంలోని ఆర్ఎంపీ చిదురాల మార్కం డేయ వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 25 రకాల ఔషదా లను, శ్రీపతి మధుకర్ వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 17 రకాల ఔషధాలను అధికారులు గుర్తించి సీజ్ చేశారు. యాంటిబయాటిక్స్, యాంటీఅల్సర్స్, నొప్పులకు సంబంధించిన రకరకాల ఔషధాలను వారి గదుల్లో గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.27వేల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. వీరికి మందులు ఎవరు విక్రయించారు అన్న దానిపై కూడా విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. అర్హతలేని వ్యక్తులు మందులు నిల్వ చేయడం ఔషధ నియంత్రణ చట్ట ప్రకారం నేరమని, ఇందుకు ఐదు సంవత్సరాల వరకు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కమల్‌హాసన్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలో నిర్వహించిన దాడుల్లో ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రాజ్యలక్ష్మీ, హనుమకొండ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ జే.కిరణ్ కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

9 యేళ్ల నిరీక్షణకు నిరాశే మిగిలింది

రిషితేశ్వరి కేసులో నిందితులకు ఊరట

హనుమకొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థి రిషితేశ్వరి మృతి కేసులో నిందితులకు ఊరట లభించింది. ఏలాంటి సాక్ష్యాధారాలు లేనందునా కేసును కొట్టివేస్తున్నట్లు శుక్రవారం గుంటూరు కోర్టు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే... ఏపీ నాగార్జున యూనివర్శిటీలో విద్యనభ్యస్తున్న రిషితేశ్వరి 2015 జూలై 14 బలవన్మరణానికి పాల్పడింది. సీనియర్స్ ర్యాగింగ్ వల్ల తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాయడంతో తల్లితండ్రులు కోర్టును ఆశ్రయించారు. 9 యేళ్ల నుంచి కోర్టులో కేసు విచారణలో జరుగుతండగా మృతికి గల కారణాలపై ఏలాంటి సాక్ష్యాధారాలు లభించలేదని గుంటూరు కోర్టు శుక్రవారం కేసును కొట్టివేసింది. కోర్టు తీర్పుతో నిందితులకు ఊరట లభించగా తీర్పు కోసం 9 యేళ్ల నుంచి దుఃఖాన్ని దిగమింగుకొని ఎదురుచూస్తోన్న బాధిత తల్లితండ్రులకు చేదు వార్త మిగిలింది.

పోక్సో కేసులో సీఐ రవికుమార్‌కు ముందస్తు బెయిల్?

హనుమకొండ టౌన్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : తన కూతురు స్నేహితురాలిని లైంగికంగా వేధించిన కేసులో పోక్సో నిందితుడు సీఐ యం. రవికుమార్ ముందస్తు బెయిల్‌కు అనుమతి పొందినట్లుగా విశ్వసనీయమైన సమాచారం. సుమారు 40 రోజుల క్రితం కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో రవికుమార్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న రవికుమార్ తాజాగా బెయిల్ పొందేందుకు లైన్ క్లియర్ చేసుకున్నట్లు తెలుస్తోంది. గత 40 రోజులు నుంచి పోలీసులు ఆయనను అరెస్టు చేయకుండా బెయిల్ తీసుకునేంత సమయం ఇచ్చి కాపాడటంపై పోలీస్‌శాఖ పనితీరును పలువురు విమర్శిస్తున్నారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్ నవంబరు 29, (ఆంధ్రజ్యోతి) : నవంబరు 29 నుంచి డిసెంబరు 2 వరకు కర్నాటక కరైకూడిలోని అలగప్ప యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ కబడ్డీ మహిళల జట్టును 2024-25 ఏడాదికి గాను శుక్రవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో ఎల్. శ్రీలత , (యూసీపీఈ కళాశాల, కేయూ), వి . వేదశ్రీ, (ఎస్సాఆర్ అండ్ బీజీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల, ఖమ్మం), టి శశిరేఖ. (యూసీపీఈ కళాశాల, కేయూ), కె. రాణి, (యూసీపీఈ, కేయూ ఖమ్మం), ఎస్. పూజిత ,(టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ అండ్ పీజీసీ, వరంగల్ వెస్ట్, హనుమకొండ), సీహెచ్.వైష్ణవి ,(తాళ్ళపద్మావతి ఫార్మసీ కళాశాల, హనుమకొండ), ఎస్. అక్షర ,(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), పి. శిరీష ,(వాగ్దేవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ, హనుమకొండ), జే. బిందు,బి.నందిని, (కేయూ సీఈటీ, కేయూ), జి.శిరిష,(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ)లున్నట్లు పేర్కొన్నారు.

పోటు ప్రసాద్ మరణం తీరని లోటు

బాలసముద్రం, నవంబరు 29.(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పోటు ప్రసాద్ అకాల మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సీపీఐ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి భిక్షపతి ఆధ్వర్యంలో ప్రసాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డుప్రమాదంలో దంపతుల మృతి

ఆటోను ఢీకొట్టిన మినీ వ్యాన్

అక్కడికక్కడే భార్య, చికిత్స పొందుతూ భర్త మృతి



సుభాన్, సమ్రీన్ (ఫైల్)

గీసుగొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి కోటగండి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉర్సు కరీమాబాద్‌కు చెందిన సమ్రీన్(28)అక్కడికక్కడే మృతి చెందగా ఆమె భర్త ఎం.డీ సుభాన్(30) ఎంజీఎంలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాన్ కొద్దిరోజుల క్రితం ఉపాధికోసం కొత్త ఆటోను కొన్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా శుక్రవారం పిల్లలను బట్టలబజార్‌లోని ఆంధ్రబాలిక పాఠశాలలో దింపి ఆటోలో గ్యాస్ నింపుకునేందుకు కొమ్మాల సమీపంలోని సీఎన్‌జీ గ్యాస్‌బంక్‌కు వెళ్లాడు. గ్యాస్‌నింపుకున్న అనంతరం తిరిగి వరంగల్‌కు వస్తుండగా ఎదురుగా అల్లం ఉల్లిగడ్డ బస్తాలతో వేగంగా వచ్చిన మినీ వ్యాన్ ఢీకొంది. దీంతో ఆటోలోంచి ఎగిరిపడిన సమ్రీన్ అక్కడికక్కడే మృతిచెందింది. వ్యాన్ వెనుక టైర్ కిందపడిన సుభాన్‌ను కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. కొన ఊపిరితో ఉన్న అతడిని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు మినీ వ్యాన్ డ్రైవర్ గడ్డం జస్వంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు

మట్టెవాడ నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): వరంగల్ క్రిస్టియన్ కాలనీలోని యూనిక్ స్కూల్ అధ్యయన కేంద్రంలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ కోఆర్డినేటర్ సమీ ఉల్లా బేగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1 నుంచి 11 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు చివరి అవకాశం ఉందని స్పష్టం చేశారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తామని, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఉన్నత చదువులు చదువుకోవచ్చునని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 73961-35390 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

సింహగర్జనను జయప్రదం చేయండి

వరంగల్ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాలలపై జరుగుతున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గ్రేటర్ వరంగల్ కన్వీనర్ పనికెల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద ముదుసు నర్సింహ ఆధ్వర్యంలో సింహగర్జన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ఖిలావరంగల్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పంపిణీ చేసిన దుస్తులను ఖిలావరంగల్ చెమన్ వద్ద శుక్రవారం కార్పొరేటర్ ఉమా-దామోదర్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

డ్రగ్ ఫ్రీ గోడ పత్రిక ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ నవంబరు 29.(ఆంధ్రజ్యోతి) : కేయూ జాతీయ సేవ పథకం, స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ సంయుక్తంగా శుక్రవారం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో డ్రగ్ ఫ్రీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కేయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు గోడ పత్రికను ఆవిష్కరించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్ నవంబరు 29.(ఆంధ్రజ్యోతి) : కేయూ పరిధిలో శుక్రవారం డిగ్రీ 1, 3,5 వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమెయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహ చారి శుక్రవారం తెలిపారు. కాగా, మొదటి రోజు జరిగిన పరీక్షల్లో ఆదిలాబాద్ పరీక్షల కేంద్రంలో 23 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికా రులు డీబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహా చారి తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి



రాజేష్ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చెన్నారంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మడూరి భిక్షపతి, కవిత దంపతులకు కుమార్తె, కుమారుడు మడూరి రాజేష్(20)లు ఉన్నారు. రాజేష్ డిగ్రీ పూర్తి చేసుకుని గ్రామంలోనే ట్రాక్టర్ నడుపుతున్నాడు. ఈ తరుణంలో గ్రామంలో రాజేష్‌కు ఒక్కసారిగా ఛాతిలో నొప్పి లేవడంతో కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. దీంతో చిన్న వయసులోనే కుమారుడు గుండెపోటుతో మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



ముక్తానంద(ఫైల్)

గీసుగొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గీసుగొండ గ్రామానికి చెందిన చాపర్తి ముక్తానంద (20) అనే బీటెక్ విద్యార్థి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్తానందకు కొద్ది రోజులుగా జ్వరం వచ్చి రక్తకణాలు తగ్గిపోవటంతో తల్లిదండ్రులు పలు హాస్పిటల్స్‌లో చూపించారు. అయినప్పటికీ ఆరోగ్యం సరిగా ఉండక పోవటంతో మనోవేదన చెంది ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు సీఐ మహేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడిషనల్ డీసీపీ ప్రభాకర్‌రావు నియామకానికి బ్రేక్

హనుమకొండ టౌన్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిష నరేట్ ఆపరేషన్స్ అండ్ క్రైం అడిషినల్ డీసీపీగా రాయల ప్రభాకర్‌రావును నియమిస్తూ ఈ 26న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా శుక్రవారం తుదుపరి ఆదేశాల వచ్చే వరకు రాయల ప్రభాకర్‌రావు నియామకాన్ని హోల్డ్‌లో పెట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయవాది రమేష్‌బాబు మృతికి బార్ నివాళి

వరంగల్ లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది కూనమల్ల రమేష్ బాబు మృతికి హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్లు ఘనంగా నివాళులర్పించారు. ఆయన అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం హైదరాబాద్‌లో మరణించారు. ఆయనకు భార్య , ముగ్గురు పిల్లలు ఉన్నారు.శుక్రవారం నూతన బార్ అసోసియేషన్ హాల్‌లో సంతాప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఆయన మరణం న్యాయవాద వృత్తికి తీరని లోటని పేర్కొన్నారు. 2002 నుంచి వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ ఎంతో మంది జూనియర్లకు ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు రమేష్‌బాబు, తీగల జీవన్‌గౌడ్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి లాడె రమేష్ పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లను కేటాయించిన టీఎస్‌పీఎస్

ఆరోగ్య శాఖలో ఖాళీలు నిల్

అయోమయంలో ఎంపికైన అభ్యర్థులు

వరంగల్ మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన జూనియర్ అసిస్టెంట్ల హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి కేటాయించి నట్లు సమాచారం. ఆరుగురు జూనియర్ అసిస్టెంట్ అభ్యర్థులను కేటాయించగా ప్రస్తుతం ఈ కార్యాలయంలో ఒక ఖాళీ కూడా లేకపోవడంతో ఎంపికైన జూనియర్ అసిస్టెంట్లు అయోమయంలో ఉన్నారు. నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసిన పోస్టులను ఖాళీగా పెట్టాల్సి ఉన్నప్పటికీ అప్పటి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నాలుగో తరగతి ఉద్యోగుల్లో ముగ్గురికి, మరో ముగ్గురిని నియామకాల ద్వారా భర్తీ చేశారు. దీంతో జిల్లాలో ఒక్క ఖాళీ కూడా లేకుండా పోయింది. నూతనంగా వచ్చిన జూనియర్ అసిస్టెంట్‌లో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. ప్రభుత్వం నియామక పత్రాలు జారీ చేస్తుండగా ఇక్కడ ఖాళీలు లేకపోవడంతో ఆబాసు పాలయ్యే ప్రమాదం ఉంది.

ఎక్స్‌కవేటర్ చోరీ కేసులో నిందితుల అరెస్టు

మామునూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : ఎక్స్‌కవేటర్‌ను అపహరించిన ముగ్గురు నిందితులను శుక్రవారం మామునూరు పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లికుంటకు చెందిన బొంత సంపత్ ఈ నెల 21వ తేదీన తన ఇంటి వద్ద పార్కింగ్ చేసిన జేసీబీ మరుసటి రోజు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. మామునూరు ఏసీపీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి బొల్లికుంటకు చెందిన ఓర్సు రవిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తనతో పాటు నలుగురు స్నేహితులు మొత్తం ఐదుగురు కలసి పథకం ప్రకారం బొల్లికుంటలో ఎక్స్‌కవేటర్‌ను దొంగిలించి రాంపూర్ దగ్గర చెట్లపొదల్లో దాచామని చెప్పాడు. దీంతో ఓర్సు రవితో పాటు మరో ఇద్దరు నిందితులు గుండాల రాజు, కాసీంలను అరెస్టు చేసి శుక్రవారం రిమాండుకు తరలించారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. కాగా, ఈ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ రమేష్, మామునూరు పోలీసులను ఏసీపీ బి.తిరుపతి అభినందించారు.

రైల్వే కార్మికుల సంక్షేమమే ధ్యేయం

ఎన్నికల ప్రచారంలో జాతీయనేత మర్రి రాఘవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాఘవయ్య

కాజీపేట, నవంబరు 29 (ఆన్‌లైన్): రైల్వే కార్మికుల సంక్షేమమే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన ధ్యేయమని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కేంద్ర కమిటీ నేత, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. రైల్వే కార్మికులకు డీఏ, బోనస్‌ల సాధనతో పాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాల సాధించిన ఘనత సంఘ్‌దే అన్నారు. లోకోపైలెట్లకు కిలోమీటర్‌ల అలవెన్స్‌లను త్వరలో సాధించి తీరుతామన్నారు. రైల్వేను కాపాడుకోవడంతో పాటు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తెలిపారు. రైల్వే కార్మికులు రాబోయే ఎన్నికల్లో సంఘ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ్ జాయింట్ జనరల్ సెక్రటరీ భరణీ భాను ప్రసాద్, డివిజనల్ సెక్రటరీ ప్రభురాజ్, డివిజనల్ అధ్యక్షుడు కొత్త మురళీకృష్ణ, సీడబ్ల్యూసీ మెంబర్ సాధినేని వెంకట్ నారాయణ, జోనల్ యూత్‌కమిటీ మెంబర్ పాక రాజ్‌కుమార్ రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీడీఎంఏ టీకే శ్రీదేవి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) అధికారి టీకే శ్రీదేవి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆమె రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కమిషనర్‌లతో పాటు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నందున డిసెంబరు 3న మునిసిపాలిటీలలో అర్బన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇక్కడ చేపట్టనున్న కార్యక్రమాలపై సీడీఎంఏకు వివరించారు. కలెక్టరేట్ భవనాలు, సర్కిల్ కార్యాలయాలు, బల్దియా ప్రధాన కార్యాలయం, కోర్టు భవనాలు, జంక్షన్‌లలో విద్యుతీకరణతో పాటు 2కే రన్ నిర్వహిస్తున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. ఇంకా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను ఏనుమాముల, సీకేఎం ఆసుపత్రి, బల్దియా ప్రధాన కార్యాలయాలలో ప్రారంభిస్తామని చెప్పారు. పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు సైతం ఉచితంగా అందిస్తామని వెల్లడించారు. ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని గుర్తించి సన్మానించనున్నట్టు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

పీఆర్సీని ప్రకటించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు 65 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ యాట సదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో డాక్టర్ సదయ్య మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ డీఏ, పీఆర్సీలపై ఇచ్చిన స్పష్టమైన హామీ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లోని నాలుగు డీఏలను విడుదల చేసి, నూతన పీఆర్సీని ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుతమైనా ఆ నష్ట నివారణ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన హెచ్‌ఎంలను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కె. రాంబాబు, వి. రాంబాబు, బి. రవి, రమేష్, సుధాకర్‌రెడ్డి, మధలిమాయే, నాగరాజు, నర్సింహయ్య, విద్యాసాగర్, తిరుపతి, మహేందర్, శ్రావణ్, వీరబ్రహ్మేంద్రచారి, శివకోటి, శ్రీధర్, బాబు, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు29(ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతీ మహిళకు అవగాహన ఉండాలని డీడబ్ల్యూవో జయంతి అన్నారు. సుబేదారిలోని కాకతీయ మహిళా కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుశ్రీ ఆధ్వర్యంలో సఖీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీడబ్ల్యూవో జయంతి మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సఖీ వన్‌స్టాప్ సెంటర్ అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సఖీ సెంటర్ సిబ్బంది 24 గంటలు మహిళల కోసం పని చేస్తారని, ఏ మహిళకు సమస్య వచ్చినా 181 టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేయాలని, అదే విధంగా 0870 - 2452112, 7382983088 నెంబర్లకు కాల్ చేస్తే వారికి సహాయం చేస్తారన్నారు.

ప్రతిభ ఉంటేనే ఉన్నత ఉద్యోగాలు

కేయూ క్యాంపస్ నవంబరు 29, (ఆంధ్రజ్యోతి) : యువతకు చదువులతో పాటు అత్యున్నత ప్రతిభ ఆధారంగానే మంచి ఉద్యోగాలు వస్తాయని ఇన్‌స్పైర్ ప్రొఫెషనల్ స్పీకర్ బందెల ఆల్ఫోన్సస్ అన్నారు. శుక్రవారం హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు జీఎంఆర్ ప్లేస్‌మెంట్ సర్వీసెస్ నేతృత్వంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల సమావేశంలో ఇన్‌స్పైర్ ప్రొఫెషనల్ ప్రఖ్యాత మోటివేషన్ స్పీకర్ బందెల ఆల్ఫోన్సస్ హాజరై మాట్లాడారు. ఇంటర్వ్యూలు ప్రొఫెషనల్‌గా, పారదర్శకంగా జరుగుతాయని చెప్పారు. ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జీఎంఆర్ ప్లేస్‌మెంట్ అధికారులు ఎస్.శ్రీనివాస్, జి.మనోహర్, సమీరా పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుంది


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

మడికొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులలో క్రమశిక్షణ, అంకితభావం అలవడుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మడికొండలోని నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో జరిగిన మూడు బ్రాంచిల ప్రిమియర్ లీగ్ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు జీవితంలో నిబద్ధతను అలవర్చుతాయన్నారు. కార్యక్రమంలో కాజీపేట మండల విద్యాశాఖాధికారి బి. మనోజ్‌కుమార్, డిప్యూటీ ఫైర్ ఆఫీసర్ శంకర్‌లింగం, జోనల్ డీజీఎం రిజ్వాన, క్లస్టర్ ప్రిన్సిపల్ ముపుపోజు శ్రీనివాసాచారి, జోనల్ కో ఆర్డినేటర్లు సాయిక్రిష్ణ, శ్యామల, శిరీష, ప్రిన్సిపాల్ లు తేజావత్ అనిత, పర్వాన, అలేఖ్య, ఆర్ఎస్‌టి లక్ష్మి, ఆర్ఎస్‌డి కమలాకర్, పీఈటీలు ఘనశ్యామ్, మహేష్, సుమన్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కరీమాబాద్‌లో ఉద్యమకారులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఆర్టీఏ జంక్షన్‌లో దీక్షాదివస్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు


కేయూలో దీక్షాదివస్‌ను ప్రారంభిస్తున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాకారం

- ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు మరుపల్ల రవి
- నగరంలో పలుచోట్ల దీక్షాదివస్

కరీమాబాద్, నవంబరు29, (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు మరుపల్ల రవి అన్నారు. శుక్రవారం కరీమాబాద్ చెట్లవారి గడ్డ వద్ద నిర్వహించిన దీక్షా దివస్‌లో ఆయన పాల్గొన్నారు. 2009 నవంబరు 29న మరుపల్ల రవి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన, రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొని అరెస్టై జైలు జీవితం గడిపిన ఉద్యమకారులను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం మరుపల్ల రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతోనే కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో కేసీఆర్‌ను అరెస్టు చేసినందుకు నిరసనగా వరంగల్ చౌరస్తాలో బస్సు అద్దాలు ధ్వంసం చేసి, రాస్తారోకో చేస్తే వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీసులు 15మందిని అరెస్టు చేసి జైలుకు పంపించారని అన్నారు. ఈ దీక్షాదివస్‌కు బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు డిడ్డి కుమారస్వామి, సిద్ధంరాజు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మేకల ఎల్లయ్య, అంకం దేవానంద్, కెంచ ఆనంద్, ప్రమీలదేవి, తాళ్ల ఉమాదేవి, పప్పుల మంజుల, వనం కుమార్‌తో పాటు రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు మసూద్, ఉద్యమకారులు మొలంగురి నెల్సన్, శెంకేసి లింగమూర్తి, కొంతం మోహన్, తుమ్మరపెల్లి రమేష్, బొల్లం సంజీవ్, సోమ మధుకర్, రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట: నగరంలోని శంభునిపేట, ఆర్టీఏ జంక్షన్‌లలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం దీక్షా దివస్ నిర్వహించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన దీక్ష మరవలేనిదని బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ కొంతం తారమోహన్, బజ్జూరి రవి, సదా నందం, శెంకేశి కుమార్, జయశంకర్, ఇల్లందుల రవి, యాదాల జగపతి, సూరన్న, క్రాంతి, సదయ్య, సాంబ య్య, ప్రభాకర్, కిరణ్, శేఖర్, రాజేష్, ఉదయ్, గోవర్ధన్, గౌస్, షాను, నజీర్, సురేష్ విజయ్, పవన్, మల్లన్న, విశ్వతేజ, రవి, వీరస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలో విద్యార్థులు దీక్ష దివస్ నిర్వహించారు. కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, రాష్ట్ర వికలాంగుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి, కార్పొరేటర్ డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లికొండ వీరేందర్‌లు హాజరై విద్యార్థులకు పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు కేసీఆర్ దీక్షకు కేయూ విద్యార్థులు అండగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వీరేందర్, ఉపాధ్యక్షుడు మాచర్ల శరత్‌చంద్ర, మనోజ్‌కుమార్, సంగాని సూర్యకిరణ్ పాల్గొన్నారు.

కోచ్‌ఫ్యాక్టరీ సాధన ఘనత బీజేపీదే

మాజీ మేయర్ రాజేశ్వర్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు

కాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో వ్యాగన్, కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు, రైల్వే డివిజన్ హోదా సాధన బీజేపీ ఘనతేనని.. ఈ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని మాజీ మేయర్ రాజేశ్వర్ రావు అన్నారు. రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వ జీవో విడుదలను కాంక్షిస్తూ కాజీపేట మీడియా పాయింట్‌లో శుక్రవారం బీజేపీ నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు మాట్లాడుతూ.. రైల్వే పరిశ్రమల సాధన కాంగ్రెస్ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ, డివిజన్ పోరాటం 1979 నుంచే బీజే పీ చేస్తోందన్నారు. నాడు జిల్లా ఎంపీగా పోటీచేసిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావును ఓడించారన్న కారణంతోనే అప్పటి ప్రభుత్వం కాజీపేటకు మంజూరైన కోచ్‌ఫ్యాక్టరీని పంజాబ్‌కు తరలించారని గుర్తు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. వరంగల్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సాధనకోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వరంగల్‌లో నిట్, మెడికల్ కాలేజీ, యూనివర్సిటీ ఉన్నప్పటికీ నాడు కాంగ్రెస్ పార్టీ కోచ్‌ఫ్యాక్టరీని మంజూరు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కేవలం బీజేపీ పోరాటాల వల్లే కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ, వ్యాగన్ తయారీ పరిశ్రమ, రైల్వే డివిజన్ మంజూరయ్యాయని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, ఆరూరి రమేశ్, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌లు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దయవల్లే కాజీపేటకు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, డివిజన్ సాధన జరిగాయన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని ఎంపీ కడియం కావ్య మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటులో ఎంపీ కావ్యకు, మంత్రి సురేఖకు ఏమాత్రం అవగాహన లేదన్నారు. ఈ మీడియా సమావేశంలో మాజీ కార్పొరేటర్‌లు నార్లగిరి రామలింగం, రంజిత్, నాయకులు భగవాన్ ఉపాధ్యాయ, ఊకంటి వెంకట్‌రెడ్డి, సుధా నర్సింగ్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఎండీ చాంద్‌పాష, వెంకట్రావ్, కొత్త రవి, ఉడతల బాబురావు, మహేందర్ స్వామి, కేదారి యాదవ్, మేకల శ్రవణ్ యాదవ్, ఎండీ అలీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భువనలక్ష్మి చిట్‌ఫండ్స్ వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న చిట్‌ఫండ్స్ ప్రతినిధులు

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భువనలక్ష్మీ చిట్‌ఫండ్స్ 11వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ మాసిని నరేందర్ ఆధ్వర్యంలో ఏజెంట్లు, ఉద్యోగుల మధ్య కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ అందరి సహకారంతో 11 వసంతాలు పూర్తి చేసుకొన 12వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, డి.శ్రీకాంత్‌శర్మ, దామోదర్ రెడ్డి, గాదె రాంకిషన్, ఎస్.రాజు, అనంతగిరి, రాంమోహన్, ఉమామహేశ్వర్‌శర్మ, కె.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన పెంచుకోవాలి

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

వడ్డెపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వరదలు, ప్రకృతి వైపరీత్యాలపై సమాజంలోని పౌరులందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని వడ్డెపల్లి చెరువు దగ్గర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పౌరులను ఎలా కాపాడాలనే విషయంపై ఎన్‌డీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక, పోలీసుశాఖ, మున్సిపల్, డీఆర్ఎఫ్ బృందాలు వారి శాఖల ద్వారా ఏవైనా విపత్తులు సంభవించినప్పుడు సామాన్యప్రజలను ఎలా కాపాడాలనే విషయంపై అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు తమంతట తామే రక్షించుకునే విధంగా వారికి మెళకువలను సూచించాలని కోరారు. కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ అప్పయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారిణి నాగమణి, అగ్నిమాపక శాఖ అధికారి జయపాల్‌రెడ్డి, లేదళ్ల దయాకర్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


వడ్డెపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లి చెరువు ప్రాంతంలో రూ. 1 కోటి 47 లక్షలతో నిర్మించిన మోడల్ శ్మశాన వాటికను ఆయన ప్రారంభించారు. అనంతరం శ్మశాన వాటికలో పర్యటించి వడ్డెపల్లి అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, 58, 60 డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నంచందర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు తాళ్లపెల్లి విజయ్, తాళ్లపెల్లి రవీందర్ పాల్గొన్నారు.

● క్రైస్తవ ఆస్తులను పరిరక్షిస్తాం..

హనుమకొండ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ బాధ్యత తమదేనని ఇందులో క్రైస్తవ సంఘాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం మాట్లాడుతూ చర్చిలు, మిషనరీ ఆస్తులు కబ్జాకు గురికాకుండా పరిరక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీబీసీ సంఘం అధ్యక్షుడు టీ విజయ్‌స్వరూప్, ప్రధాన కార్యదర్శి రూబెన్ క్రిష్టఫర్, కోశాధికారి విల్సన్, సంయుక్త కార్యదర్శి విద్యాకర్ తదితర సంఘ సభ్యులతో పాటు సీనియర్ సంఘ కాపరీ రెవ.జి.జె. నిరంజన్‌బాబు, అసిస్టెంట్ సంఘ కాపరులు మోజెస్, మైఖల్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: 31వ డివిజన్ హంటర్‌రోడ్‌లోని వాసవీ కాలనీ, గాయత్రి కాలనీల్లో శుక్రవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

● హనుమకొండ చౌరస్తా: హనుమకొండ 10వ డివిజన్ కాపువాడలో రూ.30లక్షలతో నిర్మించతలపెట్టిన అంతర్గత రోడ్ల పనులకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రత్యేక నిధులు కేటాయించి అన్నిటికంటే పశ్చిమ నియోజకవర్గాన్ని ముందజంలో ఉంచుతానన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శోభనబోయిన కుమార్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సతీష్, మాడిశెట్టి రాజు పాల్గొన్నారు.

తెలుగు అకాడమీ పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ నవంబరు 29.(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తెలుగు అకాడమీ ప్రచురించిన డిగ్రీ బయోటెక్నాలజీ పాఠ్య పుస్తకాలను శుక్రవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆయా పుస్తకాలకు కేయూ బయోటెక్నాలజీ అధ్యాపకుడు శాస్త్రీ సహ పాఠ్య రచయితగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ పి. వెంకయ్య, డాక్టర్‌పి.శ్రీనివాస్, రిటైర్డు ప్రొఫెసర్ ఎస్.రామస్వామి, సదానందం, రాధిక తదితరులు పాల్గొన్నారు.

● ఐసీఎస్ఎస్ఆర్ ఫెల్లోషిప్‌కు ఎంపికైన స్వామికి అభినందన

కేయూ క్యాంపస్: కేయూ తెలుగు విభాగంలో మూడేళ్ళ కాలానికి ఐసీఎస్ఎస్ఆర్ పోస్టు డాక్టర్ ఫెల్లోషిప్‌కు ఎంపికైన బానోతు స్వామిని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అభినందించారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని శుక్రవారం తన చాంబర్‌లో అందజేశారు. ఇటీవల తెలుగు విభాగంలో ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో స్వామి పీహెచ్‌డీ పూర్తి చేశారు. గిరిజన సాహిత్యంపై 'సాహిత్య వ్యాసావళి, తెలంగాణ గిరిజన కథ' అనే సంపుటాలను ప్రచురించారు. ఈ సందర్భంగా స్వామిని వీసీ ప్రతాప్‌రెడ్డితో పాటు రిజిస్ట్రార్ మల్లారెడ్డి, జ్యోతి అభినందించారు.

ఇక నుంచి బిల్లు చెల్లించాల్సిందే

వరంగల్ రైల్వేస్టేషన్‌లో మరో పెయిడ్ పార్కింగ్ ఏర్పాటు

డిసెంబర్ 4 నుంచి ప్రారంభం


పార్శిల్ కార్యాలయం ఎదురుగా పార్కింగ్ చేసిన టూ వీలర్లు

గిర్మాజీపేట, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఉచిత పార్కింగ్‌కు కాలం చెల్లింది. ఇప్పుడున్న వాటికి తోడు మరో టూ వీలర్ పెయిడ్ పార్కింగ్ ఏర్పాటవుతోంది. ప్రస్తుతం వరంగల్ రైల్వేస్టేషన్ ప్రధాన మార్గంలో ఒకటి, శివనగర్ వైపు మరొకటి పెయిడ్ పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. అయితే నిత్యం వరంగల్ నుంచి నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, తమ ద్విచక్ర వాహనాలను పెయిడ్ పార్కింగ్‌లో కాకుండా పార్సిల్ కార్యాలయం, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ స్టేషన్‌ల మార్గంలో పెడుతున్నారు. సుమారు 300 నుంచి 400కు పైగా బైక్‌లు ఇక్కడ పార్కింగ్ చేస్తుండడంతో రైల్వే పోలీసులు, అధికారుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. పైగా రైల్వే ఆదాయానికి గండి పడుతోంది.

దీంతో రైల్వేశాఖ పార్సిల్ ఆఫీసు వద్ద పెయిడ్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నది. ఇందుకోసం మామునూరుకు చెందిన వ్యక్తి సంవత్సరానికి రూ.15 లక్షల చొప్పున మూడు సంవత్సరాల కాలానికి కాంట్రాక్ట్ పొందినట్లు తెలిసింది. ఈ పార్కింగ్ డిసెంబరు నెల 4 నుంచి అమలులోకి వస్తుంది. ఈ మేరకు కాంట్రాక్టర్, రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి డిసెంబర్ 7 వరకు హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జాతీయ స్థాయి మెన్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గంధ్ర సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టూ ఆల్ ఏజ్ క్యాటగిరిలో నాకౌట్ పద్ధతిన సింగిల్స్ డబుల్స్ విభాగాల్లో క్రీడలు నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి 110మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహాయం

పోచమ్మమైదాన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 13వ డివిజన్ దేశాయిపేటకు చెందిన జన్ను సత్యరాజ్ కూతురు జన్ను సబిత ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో శుక్రవారం సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ రూ. పది వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వైభవంగా మహాశివలింగార్చన


కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు

కాశిబుగ్గ, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయంలో మహా శివలింగార్చన వైభవంగా నిర్వహించారు. కార్తికమాసం శుక్రవారం సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. పుట్టమట్టితో చేసిన 365 శివలింగాలకు అభిషేకం చేశారు. మహాశివలింగార్చన విశిష్టతను పండితులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు నాగమళ్ల ఓంకారేశ్వర్, గోనె జగదీశ్వర్, ఉమాశంకర్, రమణి, కొమురయ్య, కృష్ణమూర్తి, భాస్కర్, రవికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టు రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం


రుద్రాభిషేకం చేస్తున్న జిల్లా న్యాయాధిపతి రమేష్‌బాబు

మడికొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం మడికొండలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న మెట్టు రామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మెట్టు రామలింగేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. జిల్లా న్యాయాధిపతి రమేష్‌బాబు స్వామివారిని దర్శించికుని అభిషేకం, రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం రుత్వికులు రుద్రహోమంతో పాటు స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవ తంతును నేత్రపర్వంగా జరిపించారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవం, నక్షత్రహారతి గావించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి కె.శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు పాల్గొని స్వామివారిని కొలిచారు.

కీర్తి పతాక

ఆనంద పారవశ్యం ఆలయ నృత్యం..

టెంపుల్ డ్యాన్స్‌తో ప్రతిభ చాటుతున్న హిమాన్సీ



- జాతీయస్థాయి గుర్తింపు సొంతం చేసుకున్న ఓరుగల్లు నాట్య కళాకారిణి
- వెండి తెరపైనా నాట్య సవ్వడులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ‌గణపురం కోటగుళ్లు.. ఓరుగల్లు రామప్ప.. జాకారం శివయ్య.. వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడు.. చారిత్రక ఉమ్మడి ఓరుగల్లు నేలపై అడుగడుగునా కొలువై ఉన్న దేవదేవుడు పరమేశ్వరుడే అంటూ ఆనంద పారవశ్యంతో ‌ఆలయ నృత్యం చేస్తూ తన నృత్యప్రయాణాన్ని కొనసాగిస్తోంది కాట్రగడ్డ హిమాన్సీ. హనుమకొండ బాలసముద్రం అడ్వకేట్స్ కాలనీకి చెందిన హిమాన్సీ. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన ఆలయాలు ముఖ్యంగా శిథిలావస్థలో ఉన్న ఆలయ ప్రాంగణాల్లో నృత్యం చేస్తూ వాటిని అందమైన వీడియోలు రూపొందించి తన యూట్యూబ్ చానల్ ద్వారా ఆ ఆలయాల పరిస్థితిని వెలుగులోకి తెస్తోంది. ప్రముఖ దర్శకుడు కళా తపస్వీ స్వర్గీయ విశ్వనాథ్, సిరివెన్నెల సీతారామశాస్త్రి లాంటి సినీ ప్రముఖుల ఆశీర్వచనం అందుకొన్న హిమాన్సీ మూడు సంవత్సరాలుగా తనదైన ప్రతిభతో తన టెంపుల్ డ్యాన్స్ స్కూల్ ద్వారా నృత్యంలో ఎదుగుతున్న కళాకారుణిలచే నృత్య సౌరభాలను గుభాళింజేస్తూ ఔరా అనిపిస్తోంది. తండ్రి శ్రీనివాసరావుతో పాటు స్వతహాగా కళాకారిణి అయిన తల్లి శ్రీలక్ష్మి ఇచ్చిన ప్రోత్సాహంతో ప్రముఖ నాట్యాచార్యుడు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద నాట్య ఓనమాలు దిద్దిన హిమాన్సి. ఇప్పటి వరకు పలు జాతీయ, అంతర్జాతీయ వేదుకలపై 900కు పైగా ప్రదర్శనలు ఇచ్చి అతి పిన్న వయసులోనే లెక్కకు మిక్కిలి అవార్డులను, నగదు ప్రోత్సాహలను సొంతం చేసుకుంది. ఎస్ఆర్ విశ్వవిద్యాలయం ద్వారా బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన హిమాన్సీ నాట్యంతో మక్కువతో 8వ ఏటే కాలికి గజ్జెకట్టి అరంగ్రేటం చేసింది. ఇటీవల లోకమందన్ 2024 పేరిట హైదరాబాద్ శిల్ప కళా వేదికలో భారత దేశ అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పాల్గొన్న వేడుకల్లో కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చి ఓరుగల్లు ఖ్యాతిని చాటింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో లెక్కకు మిక్కిలి ప్రదర్శనలు ఇచ్చింది. దేశంలోని అనేక నగరాల్లో నృత్య సౌరభాలు వెదజల్లింది. న్యూ ఢిల్లీలో నిర్వహించిన 75వ గణతంత్ర పరేడ్ వేడుకల్లో రాష్ట్రం నుంచి కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ద్వారా ఎంపికైన ఏకైక కూచిపూడి కళాకారిణిగా నృత్య ప్రదర్శన ఇచ్చింది.





కళాతపస్వి విశ్వనాథ్‌తో హిమాన్సీ (ఫైల్)

వెండి తెరపై చిన్నమ్మగా ..

అంతేగాక నృత్య ప్రాధాన్యతగల సినిమాల్లో అవకాశాలను కూడా అందిపుచ్చుకొని కొన్ని సినిమాల్లోనూ కళాకారిణిగానే ప్రేక్షకులకు కనువిందు చేసింది. సూర్యాస్తమయం సినిమాతో పాటు కన్నడంలో నవిల కిన్నరి పేరిట నృత్య ప్రాధాన్యం గల సినిమాలో హీరోయిన్‌గా నటించి మెప్పు పొందింది. నందమూరి బాలకృష్ణ స్వీయ నిర్మాణంలో రూపొందించిన ఎన్టీఆర్ బయోపిక్‌లో పురందేశ్వరిగా అద్భుత నటనతో ప్రేక్షకుల మదిలో చిన్నమ్మగా ప్రత్యేక గుర్తింపు పొందింది.



శిష్యురాలితో ఆలయ నృత్యం చేయిస్తున్న హిమాన్సీ

రాజస్థాన్ పిల్లలతో నృత్యం చేయించి..

స్పెక్ మ్యాకే స్వచ్ఛంద సంస్థతో కలిసి భారతీయ కళలని భవిష్యత్ తరాలకు అందించాలన్న ఆశయంతో రాజస్థాన్‌లోని ఎంపిక చేసిన 15పాఠశాలల్లో హిమాన్సీ కూచిపూడి కళను పరిచయం చేస్తూ చిన్నారులతో నృత్యం చేయించి ప్రశంసలందుకుంది. అంతేగాక ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, చెన్నైలోని ఎస్ఎంఆర్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు కూచిపూడిలో నాట్యశిక్షణ ఇస్తోంది. నాట్యంతో పాటు సంగీతం, సాహిత్యం, వాయిద్యం కలగలిపి చిన్నారులకు శిక్షణ ఇస్తే మంచి భవిష్యత్ ఉంటుందని హిమాన్సీ ఆకాంక్షించారు. 25 వసంతాల హిమాన్సీ నాట్యమే ధ్యాసగా శ్వాసగా జీవిస్తూ ఇటీవల కార్తీక వేడుకల్లో వారాణసిలో అక్కడి ప్రభుత్వ అతిథిగా వెళ్లి తన నృత్య ప్రతిభతో ప్రశంసలందుకోవడం గర్వకారణం. 2019లో కాలికి గాయమై నాట్యానికి దూర మైన క్రమంలో వచ్చిన ఆలోచనల ప్రతిరూపమే టెంపుల్ డ్యాన్స్ అని, తన ఆలయ నృత్యం ద్వారా వెలుగులోకి వచ్చిన కొన్ని పురాతన ఆలయాలైనా అభివృద్ధి చెందితే తన నృత్యానికి ప్రాధాన్యం లభించినట్లేనని హిమాన్సీ అంటోంది. ముఖ్యంగా వరంగల్ జిల్లాలో నాట్యం పట్ల ఆసక్తి ఉన్న చిన్నారులందరికి నృత్యంలో శిక్షణ ఇస్తూ ఆలయ ప్రాంగణాల్లో వారితో అభినయింపజేయాలన్నదే తన ఆకాంక్ష అని హిమాన్సీ 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు.

ఏపీ జూనియర్ సివిల్ జడ్జిగా జనగామ బిడ్డ

- పేద కుటుంబం నుంచి వచ్చిన ముఖేష్‌కుమార్
- బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన కుటుంబం
- ముఖేష్ ఎంపికతో స్వగ్రామం సీతారాంపురంలో సంబరాలు

దేవరుప్పుల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలోని హైకోర్టు ఇటీవల జూనియర్ సివిల్ జడ్జీ ప్రొవిజనల్లీ సెలెక్షన్స్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. జూని యర్ డివిజన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాగా, జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం సీతారాంపురంనకు చెందిన పెండెం మనోహర్, భవానీల కుమారుడు ముఖేష్‌కుమార్ జూనియర్ సివిల్ జడ్జీగా ఎన్నికయ్యాడు. దాంతో స్వగ్రామంలో సంబరాలు చేసుకున్నారు. ముఖేష్ కుటుంబం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లినా ఆయన మాత్రం తరచూ స్వగ్రామానికి వచ్చి వెళ్లేవాడని గ్రామస్థులు చెబుతున్నారు.



ముఖేష్‌కుమార్‌తో తల్లిదండ్రులు మనోహర్, భవానీ

పేద కుటుంబం నుంచి..

ముఖేష్‌కుమార్‌ది పేద కుటుంబం. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ముఖేష్‌కుమార్ తండ్రి మనోహర్ అడ్డగుట్టలో హోటల్ నడిపించుకుంటూ సోషల్ వర్కర్‌గా ప్రజాసేవ చేసేవాడు. ప్రస్తుతం సివిల్ కాంట్రాక్టు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మనోహర్‌కు భార్య భవానీతో పాటు కుమారుడు ముఖేష్‌కుమార్, కూతురు శ్రావణి ఉన్నారు. కూతురు శ్రావణి న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో అనెస్థీషియాలో పీజీ చేస్తోంది.

సివిల్ సర్వీసెస్ ప్రిపరేషనే.. జడ్జిని చేసింది

పెండెం ముఖేష్‌కుమార్

బీటెక్ సివిల్ ఇంజనీర్ 2016లో పూర్తి చేశాక రెండేళ్లు సివిల్ సర్వీసెస్ ప్రిపేర్ అయ్యాను. హైకోర్టులో జడ్జీలు ఎలా అవుతారో తెలుసు కానీ, కింది కోర్టులో ఎలా అవుతారో తెలియదు. ఆ తర్వాత నెట్‌లో సర్చ్ చేశాను. లోయర్ కోర్టులో ఇలా కావచ్చా అనే ఆలోచించా. ఇది చాలా ఉత్తమమైన ఉద్యోగం అని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశాను. కష్టపడితే సాధించనిది ఏదీ లేదు.

వచ్చేనెలలో ఘన్‌పూర్‌కు సీఎం

- అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఏర్పాట్లు
- నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలబెడతా : కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్‌కు మంజూరైన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు డిసెంబరు చివరి వారంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వస్తారని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం ఘన్‌పూర్‌కు ప్రభుత్వం ద్వారా మంజూరైన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన స్థలాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కడియం పరిశీలించారు. అనంతరం సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఘన్‌పూర్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 45.50కోట్ల నిధులు మంజూరి ఇచ్చిందని, డిసెంబరు 15లోపు సంబంధిత అధికారులు డిజైన్, ఎస్టీమేషన్స్ పూర్తి చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ను జఫర్‌గడ్ మండలంలోని కోనాయిచలం గ్రామ పరిధిలోని 21ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.200 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఘన్‌పూర్‌లో రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ నిర్మాణానికి గాను ప్రభుత్వం రూ.26లక్షల నిధులు మంజూరి చేసిందని, అధికారులు డిజైన్‌ను పూర్తి చేసి టెండర్‌లు పిలువాలని సూచించారు. ఘన్‌పూర్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైందని, వచ్చే విద్యా సంవత్సరం తరగతులు జరుగుతాయన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను రైల్వే ఫైఓవర్ బ్రిడ్జి దిగువన గల స్థలంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్ ప్రధాన కాల్వ మరమ్మతుకు పనులకు నీటిపారుదల శాఖ నుంచి రూ.148.76 కోట్ల నిధులను ప్రభుత్వం 27న విడుదల చేసిందన్నారు.



ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాషా

రాష్ట్రంలోనే జనగామ జిల్లా ధాన్యం దిగుబడిలో టాప్‌లో నిలిచిందని కడియం తెలిపారు. కొందరు నేతలు నీచ స్థాయికి దిగజారి ధాన్యం కొనుగోళ్లు జరుగడంలేదని, రైతులకు ధాన్యం డబ్బులు పడడంలేదని, బోనస్ బోగస్ అని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీపీవో స్వరూప, ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, ఎస్పీడీసీఎల్ డీఈ రాంబాబు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, అంబటి కిషన్ రాజ్, నాగరబోయిన శ్రీరాములు, శిరీష్ రెడ్డి, కోతి రాములు, బూర్ల శంకర్, తెల్లాకుల రామకృష్ణ, చాడ రాజ్‌కుమార్, రజాక్ యాదవ్, గన్ను నర్సింహులు పాల్గొన్నారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

కాళోజీ జంక్షన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక శనివారం హనుమకొండకు రానున్నారు. స్థానిక హరిత కాకతీయ హోటల్‌లో జరిగే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ మహాసభలను జస్టిస్ నగేష్ భీమపాక ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, మహాసభల రిసెప్షన్ కమిటీ చైర్మన్ దుస్సా జనార్దన్ తెలిపారు.

నేత్రపర్వం.. రుద్రేశ్వరుడి కల్యాణం

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో కార్తీక మాస వేడుకలు చివరి అంకానికి చేరుకున్నాయి. శుక్రవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని నిత్య విధుల అనంతరం ఉత్తిష్ట గణపతికి ఆరాధన, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ నాట్యమండపంలో ప్రత్యేక వేదికపై ప్రముఖ వేదపండితులు కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుద్రేశ్వర కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య బాసికాధారణ, యజ్ఞోపవీతం, జిలకర్రబెల్లం, మంత్రసూత్ర మహాపఠనంతో పాదప్రక్షాళన, మాంగళ్యధారణ లాంటి ముఖ్య ఘట్టాలను పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజనుల మధ్య కోలాహలంగా నిర్వహించారు. గుజ్జా సంపత్‌రావు, సౌమ్య దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. అనంతరం నవగ్రహ రుద్రహోమం నిర్వహించారు. కల్యాణ వేడుకల అనంతరం స్వామి వారిని పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. కలకుంట్ల మేఘనాథచార్య, మణికంఠ శర్మ తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ పురాణ ప్రవచకులు రాంబట్ల షణ్ముఖచారి శివవిష్ణుతత్వంపై ధార్మిక ఉపన్యాసం నిర్వహించారు. సాయంత్రం ప్రదోశకాల పూజలో సీపీ అంబర్ కిషోర్ ఝా దంపతులు పాల్గొని పూజలు చేశారు.

నేడు పుష్పగిరి పీఠాధిపతి రాక

శనివారం సాయంత్రం పుష్పగిరి పీఠాధిపతి శ్రీవిద్యాశంకర భారతి స్వామి వేయి స్తంభాల ఆలయాన్ని సందర్శించి భక్తులకు అనుగ్రహ భాషణం చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఆదివారంతో కార్తీక మాస వేడుకలు పరిసమాప్తం కానున్నాయి.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు నిట్ స్నాతకోత్సవం

- 22వ సంబురానికి ఏర్పాట్లు పూర్తి
- హాజరవనున్న డిఫెన్స్ డైరెక్టరేట్ సెక్రెటరీ డాక్టర్ సమీర్ వి కామత్
- 1875 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- వివరాలు వెల్లడించిన నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ

హనుమకొండ, నవంబరు 29 ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూ ట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) కళాశాలలో శనివారం 22వ స్నాతకోత్సవం ఘనంగా జరగనుంది. క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా డిఫెన్స్ డైరెక్టరేట్ సెక్రెటరీ, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ హాజరు కానుండగా ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. సమీర్ వి కామత్ స్నాతకోత్సవ ప్రసంగం చేసిన అనంతరం విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం నిట్‌లోని సెనెట్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ వెల్లడించారు. అత్యున్నత ప్రమాణాలతో సాంకేతిక విద్యను అందిస్తున్న వరంగల్ నిట్‌కు అం తర్జాతీయ ఖ్యాతి ఉందని, అందుకే ఇక్కడ చదవడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఇష్టపడతారన్నారు. ఆ విశిష్టతను దృష్టిలో పెట్టుకొని స్నాతకోత్సవ నిర్వ హణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈసారి స్నాతకోత్సవంలో మొత్తం 1,875 మంది అభ్యర్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నామని, వీరిలో 147 మంది పీహెచ్‌డీ, 539 మంది ఎంటెక్, 154 మంది ఎంఎస్సీ, 949 మంది బీటెక్ గ్రహీతలున్నారని వివరించారు. వీరితో పాటు జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఎగ్జిట్ పాలసీ (ఎన్ఈపీ) కింద మరో 9 మంది పట్టాలు అందుకో బోతున్నారని తెలిపారు.



తొలిసారి రెండు ఎక్సెల్లెన్స్ అవార్డులు

నిట్‌లో మొదటి సారిగా రెండు ఎక్సలెన్స్ అవార్డులను ప్రవేశపెట్టామని, ఇందులో ఒకటి పీజీలో టాపర్‌గా నిలిచినవారికి ఇచ్చే అవార్డు, మరొకటి ఉత్తమ పీహెచ్ డీ థీసిస్‌కు గాను ఇచ్చే అవార్డు అని తెలిపారు. పీజీ ప్రోగ్రాంలో టాపర్‌గా నిలిచిన మనీషా వర్షిణి (ఎంసీఏ-కంప్యూటర్‌సైన్స్ ఇంజనీరింగ్), అరుణ్‌కుమార్ (కెమిస్ట్రీ) ఈ ఎక్సెలెన్సీ అవార్డుల కింద రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్‌కు ఎంపిక య్యారని ప్రొఫెసర్ సుబుధీ తెలిపారు. ఈ సంవత్సరం కాన్వోకేషన్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కె చెందిన మంజిమా కర్మాకర్ ఇన్‌స్టిట్యూట్ గోల్డ్ మెడల్‌ను అందుకోబోతున్నారన్నారు.

బంగారు పతకాల విజేతలు

ఈ సారి రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేతలుగా నిలిచిన ఎనిమిది మంది అభ్యర్థులు స్నాతకోత్సవంలో ముఖ్య అతిథి నుంచి బంగారు పతకాలను స్వీక రించనున్నారు. జగ్యసీ నవీన్ కమేష్ (సివిల్ ఇంజనీరింగ్), మంజిమా కర్మాకర్ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), అనిమేష్‌కుమార్ (మెకానికల్ ఇంజనీరింగ్), కోడూరు శ్రీచరణ్‌రెడ్డి (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికే షన్ ఇంజనీరింగ్), యల్లా ప్రతీక్(మెటల ర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్), శ్రీనివాస్ హేమన్ ధర్మవరం (కెమికల్ ఇంజనీరింగ్), రాలపల్లే కుమార్ చౌదరి(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్), జి.సంతోష్(బయోటెక్నాలజీ) వీరిలో ఉన్నారని వివరించారు. ఈ విలేకరుల సమావే శంలో నిట్ అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ ఏ శరత్‌బాబు పాల్గొన్నారు.

ఈ సారి మారిన స్నాతకోత్సవ వేదిక

నిట్‌లో శనివారం జరగనున్న 22వ స్నాతకోత్సవ వేదిక మారింది. ప్రతీ సారి క్యాంపస్ ఆడిటోరియంలో నిర్వహిస్తుండగా ఈసారి నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. 1500 మందికిపైగా కూర్చునేందుకు వీలున్న ఆడిటోరియంలో మరమ్మతు పనులు జరుగుతున్నందున ఆ పక్కనే ఉన్న అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో వేడుకను నిర్వహించాలని నిర్ణయించారు. లెర్నింగ్ సెంటర్‌లో సీటింగ్ కెపాసిటీ తక్కువైనా డిగ్రీలు తీసుకోవడానికి స్నాతకోత్సవానికి హజరవుతున్న అభ్యర్థులందరికీ కూర్చునే ఏర్పాట్లు చేస్తున్నారు. మీడియా నుంచి పెద్ద సంఖ్యలో రానున్న దృష్ట్యా వారికి బయట నుంచే కవరేజ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సాంకేతికతను ప్రజలకు మరింత చేరువ చేస్తా

మంజిమ కర్మాకర్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ గోల్డ్ మెడల్ విజేత



ప్రస్తుతం నేను టెలీకమ్యునికేషన్‌కు సంబంధించి సెమీ కండక్టర్లను తయారు చేసే కంపెనీ అయిన క్వాల్కంలో అసోసియేట్ ఇంజనీర్ (డిజైన్)గా పని చేస్తున్నా. వార్షిక సీజీపీఏ (ప్యాకేజీ) 17.40 లక్షలు. ఉద్యోగంలో మరింత రాణిస్తూ దేశాభివృద్ధికి దోహదపడేలా సాంకేతికతను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ఉన్నా.

మరింతగా రాణించడమే ధ్యేయం

మానిష వర్షిణి, మైక్రో సాఫ్ట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత (ఆల్ పీజీ ప్రోగ్రామ్స్)



మైక్రోసాఫ్ట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నా. నా సీజీపీఏ 9.62 లక్షలు. ఎంచుకున్న రంగంలో మరింత ఉన్నతంగా రాణించాలన్నది నా లక్ష్యం, అర్థవంతమైన మానవ సంబంధాలను కొనసాగించడం, ప్రజలకు ఉపయోగపడే రీతిలో సేవా కార్యక్రమాలు చేపట్టడం, వ్యక్తిగత వికాసం ద్వారా ఆనందంగా జీవించివృత్తిలో ఆదర్శంగానిలవాలన్నదే నాలక్ష్యం.

సైంటిస్టు కావాలని ఉంది

అరుణ్ కుమార్, కెమిస్ట్రీ రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత (పీహెచ్‌డీ)



నిట్‌లోనే కెమిస్ట్రీ పీహెచ్‌డీ అయిపోయింది. ప్లేస్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నా. సైంటిస్టు కావాలన్నది నా లక్ష్యం. కెమిస్ట్రీలో ఇప్పటికే పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయి. అవన్నీ మానవ జీవన ప్రమాణాల మెరుగు లక్ష్యంగా సాగుతున్నవే. మారుతున్న జీవన స్థితిగతులపై రసాయన శాఖ ఆవిష్కరణల ప్రభావం ఎంతో ఉంది. ఆ దిశగా సరికొత్త పరిశోధనలు చేయాలన్నది నా ఆశయం.

బయోటెక్నాలజీలో కొత్త ఆవిష్కరణలకు కృషి

జి.సంతోష్, బయోటెక్నాలజీ రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత

ఇంకా ఎక్కడా ప్లేస్‌మెంట్ తీసుకోలేదు. ఉన్నత చదువులు చదవాలని ఉన్నది. బయోటెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కర ణల కోసం పరిశోధనలు చేయాలని నా ఆశయం. భవిష్యత్తులో శాస్త్రవేత్తను కావాలనే ఆలోచన ఉంది. ఎంతో విస్తృతమైన బయోటెక్నాలజీ రంగంలో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. నా వంతుగా ఎంతో కొంత తోడ్పాటును అందించాలనుకుంటున్నా.





బోధనా రంగంవైపు వెళ్లాలని ఉంది

ఎల్లా ప్రతీక్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ లోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత

ప్రస్తుతం నేను మద్రాస్ ఐఐటీలో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నాను. పీహెచ్‌డీ పూర్తయిన తర్వాత బోధనా రంగం వైపు వెళ్లాలని ఉన్నది. నాకు అకడెమిక్‌తో పాటు రిసెర్చ్ అంటే చాలా ఇష్టం. నా స్వస్థలం హైదరాబాద్. మా తల్లిదండ్రులు కూడా ఈ దిశగానే నన్ను ప్రోత్సహి స్తున్నారు. నిట్‌లో నేను చదివిన నాలుగేళ్ల కాలాన్ని మరువలేను. ఉన్నతంగా రాణించడానికి బలమైన పునాదులు ఇక్కడే పడ్డాయి.

మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉన్నతంగా ఎదగాలి

అనిమేష్ కుమార్, హెచ్‌పీసీఎల్‌లో మేనేజర్ (ఆపరేషన్) రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత



భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లో మేనేజర్ (మేనేజ్‌మెంట్ ఆపరేషన్)గా పని చేస్తున్నాను. వార్షిక ప్యాకేజీ రూ. 20లక్షలు. స్వస్థలం పాట్నా. ఉద్యోగంలో కొనసాగుతూనే ఇంకా ఉన్నత చదువులు చదివి.. ఉన్నతంగా ఎదగా లని లక్ష్యంగా పెట్టుకున్నా. నిట్ నాకు దేవాలయం వంటిది. నా జీవ న సాఫల్యతలో చుక్కానిగా దోహదపడింది.

ప్రజలకు లబ్ధి చేకూరే పరిశోధనలు నా ప్రణాళిక

శ్రీనివాస్ హేమన్ ధర్మవరం, కెమికల్ ఇంజనీరింగ్ రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత



కేయిర్ అయిల్ అండ్ గ్యాస్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నా. వార్షిక ప్యాకేజీ రూ.14 లక్షలు. ప్రస్తుతం నేను పనిచేస్తున్న కంపెనీలో ఉన్నత స్థాయికి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నా. ఆయిల్ అండ్ గ్యాస్ రంగంతో ప్రజలకు విడదీయరాని బంధం ఉంటుంది. ఈ రంగం ద్వారా వారికి మరింత లబ్ధి చేకూరే పరిశోధనలు చేపట్టాలన్నది నా ప్రణాళిక.

ప్రజోపయోగ పరిశోధనలు నా లక్ష్యం

రాళ్లపల్లె కుమార్ చౌదరి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత



గోల్డ్‌మెన్ ప్యాక్స్ కంపెనీలో క్వాంటమ్ అనలిస్టుగా పనిచేస్తున్నా.ఉద్యోగంలో రాణించడంతో పాటు చదివిన చదువుకు సార్థకత చేకూరేలా ప్రజోపయోగమైన కార్యక్రమాలను, పరిశోధనలను చేయాలన్నది నా ఆశయం. ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టా. కంప్యూటర్ అండ్ ఇంజనీ రింగ్ నాకు ఇష్టమైన సబ్జెక్టు. నిట్‌లో అడ్మిషన్ తీసుకోవడం ద్వారా అత్యంత ప్రామాణికమైన విద్యను పొందగలిగా. ఈ విద్యాలయానికి ఎప్పుడూ రుణపడి ఉంటా.

బియ్యపు జావలు అనేక రకాలు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మనం బియ్యపు అన్నాన్ని ముద్దగా తింటాం. కానీ అలా కాకుండా జావ రూపంలో రకరకాలుగా కూడా స్వీకరించవచ్చు. వాస్తవానికి జావ అంటే అన్నం రసం. అన్నంలో ఉన్న సారమంతా దీనిలో ఉంటుంది. ఇలాంటి జావలు ఎన్ని రకాలో తెలుసుకుందాం.

బియ్యపు కడుగు: బియ్యాన్ని నీళ్లలో వేసి కడిగి తేర్చిన నీటిని బియ్యపు కడుగు అంటారు. ఈ కడుగులో దుమ్ము, బియ్యాన్ని అంటి ఉండే చిట్టు, తవుడు అన్నీ కొట్టుకు వస్తాయి. చేటతో చెరిగి బియ్యాన్ని శుభ్రపరచి కడిగితే ఆ కడుగులో చిట్టు, తవుడు మాత్రమే ఉంటాయి, దీన్ని 'ఆరనాళకము' అంటారు. ఈ నీటిని ఒక రాత్రంతా నిలవుంచితే పులుస్తుంది. ఈ పుల్లని ద్రవం తరవాణి లాంటిదే. బీరుతో సమానమైన గుణాలుంటాయి. దీన్ని 'కలి' అని కూడా అంటారు.

చిట్టుడుకు నీళ్లు: అన్నం వండటానికి బాగా పొంగులొచ్చేలా కాగబెట్టిన నీటిని ఎసరు అంటారు. కడిగి శుభ్రపరచిన బియ్యాన్ని ఎసట్లో వేసి ఉడికిస్తారు. బియ్యం ఉడుకుతూ ఉండగా చిన్న గ్లాసుతో అందులో నీళ్లను ఇవతలకు తీస్తే ఆ నీటిని చిట్టుడుకు నీళ్లు అంటారు. ఈ నీళ్లు తాగితే అమితమైన చలవ నిస్తాయి. బియ్యంలో సారవంతమైన బాగం చిట్టు తవుడే! ఇవి బియ్యపు పైపొరలు. మనం ప్రస్తుతం ఈ పొరలను తొలగించిన నిస్సారమైన బియ్యాన్ని అన్నం పేరుతో తింటున్నాం. దంపుడు బియ్యంతో అన్నం వండేప్పుడు తీసిని చిట్టుడుకు నీళ్లలో ఈ చిట్టు, తవుడు ఎక్కువగా ఉంటాయి.



గంజి: బియ్యానికి రెండు నుంచి మూడు రెట్లు నీళ్లు పోసి ఉడికించిన అన్నంలో అదనపు నీటిని వారుస్తారు. ఇది అన్నరసం. దీన్నే ఇంగ్లీషులో స్టార్చి అంటారు. దీనిని బట్టలు ఫెళఫెళలాడటానికి ఉపయోగిస్తారు. ఈ గంజినీళ్ళని కదలకుండా ఉంచితే దాని పైన తెట్టు కడుతుంది దీన్ని గంజి తొరక అని, మానరం అనీ పిలుస్తారు. మెతుకు లేని గంజిని గొడ్డంబలి అంటారు. ఈ గంజిలో పిండిపదార్థాలు, కొంచెం కొవ్వు, విటమిన్లు కూడా ఉంటాయి. గంజి ద్వారా పిండి పదార్థాలు కొంత వరకు బయటకు పోతాయి. అందువల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు కుక్కర్లో వండిన అన్నం కన్నా గంజివార్చిన అన్నమే గొప్పది. గంజి వార్చకుండా వండిన అన్నాన్ని ఇగిరిక అంటారు. ఇందులో అస్రుతాన్నదోషం ఉంటుందని.. అందువల్ల వార్చిన అన్నాన్నే తినాలని పాకదర్పణం గ్రంథం పేర్కొంది..

జావ: బియ్యానికి ఆరు రెట్లు నీళ్లు పోసి పలుచగా కాచినది జావ. దీన్నే అంబలి, గటక అని కూడా పిలుస్తారు. ఆయుర్వేద గ్రంథాలు యవాగువు అన్నాయి. భోజన కుతూహలం గ్రంథం ఈ యవాగువు బలకరమైందని, సంతృప్తి నిస్తుందని, వాత దోషాన్ని పోగొడ్తుందని పేర్కొంది. దీన్నే 'మండం' అని కూడా పిలుస్తారు.

విలేపి: బియ్యానికి నాలుగు రెట్లు నీళ్లు పోసి కొంచెం చిక్కగా కాచినట్లైతే దాన్ని విలేపి అంటారు. ఇది ఎక్కువ బలకరమైనది. వేడిని తగ్గిస్తుంది. పురుషత్వాన్ని పెంచుతుంది.

పేయం: బియ్యంలో చాలా ఎక్కువ నీళ్లు పోసి పలుచగా కాచినట్లైతే దాన్ని పేయం అంటారు. బార్లీ, జొన్న, రాగి లాంటివాటితో పేయం (పారిజ్)తయారు చేసుకుని ఉదయం టిఫిన్లకు బదులుగా తీసుకుంటారు. దీన్ని పాలు పోసి కాస్తారు లేదా మజ్జిగ కలుపుకుని తాగుతారు. ఇది విరేచనాల్లో నీటి శాతాన్ని తగ్గిస్తుంది. తేలికగా అరుగుతుంది. కఫ దోషాన్ని పోగొడుతుంది.

- గంగరాజు అరుణాదేవి

మేకప్

మొటిమలను దాచేద్దాం

ముఖం మీద మొటిమలను దాచడానికి మేకప్ వేసుకునేటప్పుడు కొన్ని మెలకువలు పాటించాలి. లేదంటే మొటిమలు మరింత స్పష్టంగా కనిపించే ప్రమాదం ఉంది. మొటిమలను దాచే మేకప్ మెలకువలు ఇవే!

మాయిశ్చరైజర్: మేకప్ చర్మం మీద సమంగా అంటుకోవాలంటే, మొదట ముఖాన్ని శుభ్రంగా కడిగి, మాయిశ్చరైజర్ పూసుకోవాలి. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు మాయిశ్చరైజర్ వాడకూడదు.

ప్రైమర్: మేకప్‌కు ముందు అనుసరించవలసిన చిట్కా ఇది. మేకప్ ఉత్పత్తులు చర్మంలోకి ఇంకిపోకుండా ప్రైమర్ తోడ్పడుతుంది. హెచ్చుతగ్గులు లేకుండా మేకప్ చర్మం మీద పరుచుకోవడానికి వీలుగా, ప్రైమర్ చర్మాన్ని సిద్ధం చేస్తుంది.

కరెక్టర్: మొటిమలను కరెక్టర్‌తో కనిపించకుండా చేయవచ్చు. ఇందుకోసం ఎర్రగా ఉండే మొటిమల మీద ఆకుపచ్చని కరెక్టర్ అద్ది, పైన కన్‌సీలర్ అద్దుకోవాలి. ఇలా చేయడంవల్ల మొటిమ ఎరుపు రంగు తగ్గి, చర్మంలో కలిసిపోతుంది. మొటిమ ఎరుపు రంగులో లేకపోతే, నేరుగా కన్‌సీలర్‌నే అద్దవచ్చు. కన్‌సీలర్‌ను మొటిమ మీద అద్దాలే తప్ప, రుద్దకూడదు.

లిక్విడ్ ఫౌండేషన్: బ్రష్ లేదా మేకప్ స్పాంజ్‌తో ముఖం మీద ఫౌండేషన్‌ను వేసుకోవాలి. అంటే ముఖం మీద ఫౌండేషన్ చుక్కలుగా అద్ది, బ్రష్ లేదా స్పాంజ్‌తో ముఖాన్ని అద్దినట్టు చేస్తూ, ముఖమంతా పరుచుకునేలా చేయాలి.



మేపక్ సెట్టింగ్: ఫౌండేషన్ పూసుకున్న తర్వాత కొన్ని నిమిషాలు ఆగాలి. ఆ తర్వాత ప్రెస్‌డ్ లేదా లూజ్ పౌడర్‌ను అద్దుకోవాలి. తర్వాత ఫినిషింగ్ స్ప్రే కూడా వాడుకోవచ్చు.

మచ్చలను దాచాలంటే... : ఫేస్ ప్రైమర్‌తో మేకప్ మొదలుపెట్టాలి. తర్వాత ప్రైమర్, కన్‌సీలర్, అంతిమంగా ఫౌండేషన్, లూజ్ పౌడర్ వాడాలి. మచ్చలు నల్లగా లేదా ఎర్రగా ఉంటే, కలర్ కరెక్టర్‌ను వాడుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి
నవ్య
7
కుటుంబ కదంబం
శనివారం • 30 నవంబరు 2024



వంటిల్లు

శీతాకాలంలో వేడి వేడి చపాతీలతో రుచికరమైన కూరలు తింటుంటే ఆ తృప్తే వేరు. అందుకే ఈ సారి కొన్ని కూరలు మీకోసం అందిస్తున్నాం..

చపాతీలతో తింటే భలే రుచి

పనీర్ మిరియాల కూర

కావాల్సిన పదార్థాలు:

పనీర్- అరకిలో, మిరియాలు- నాలుగు స్పూనులు, తరిగిన ఉల్లిపాయలు- ఒక కప్పు, జీడిపప్పు- అరకప్పు, నూనె- అరకప్పు, నెయ్యి- నాలుగు స్పూనులు, పెరుగు- ఒక కప్పు, జీలకర్ర- ఒక చెంచా, లవంగాలు- నాలుగు, పచ్చి మిర్చి- ఒకటి, ఏలకులు- నాలుగు, పసుపు- ఒక స్పూను, కారం-ఒక స్పూను, తరిగిన కొత్తిమీర- నాలుగు స్పూనులు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, క్రీమ్- నాలుగు స్పూనులు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- పనీర్‌ను చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. మిరియాలను పొడి చేయాలి. ఈ రెండింటిని కలపాలి.
- ఒక గిన్నెలో పెరుగు, కారం, పసుపు, ఉప్పు వేసి ఎక్కడ ఉండలు లేకుండా కలపాలి. ఈ మిశ్రమంలో పనీర్ ముక్కలను వేసి 15 నిమిషాలు వదిలేయాలి.
- ఒక మూకుడులో పావు కప్పు నూనె వేసి పనీర్ ముక్కలను వేయించాలి. వాటిని కిందకు దించి చల్లార్చాలి.
- ఈ మూకుడులోనే మిగిలిన పావు కప్పు నూనెను వేడి చేసి- ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, లవంగాలు, పచ్చిమిర్చి, జీలకర్ర, పసుపు, కారం, జీడిపప్పు వేసి వేయించాలి. ఇవన్నీ చల్లారిన తర్వాత ఒక మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- మూకుడులో నెయ్యిని వేసి వేడి చేయాలి. దీనిలో ఈ ముద్దను వేసి కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. ఉప్పు వేయాలి. దానిలో వేయించిన పనీర్ ముక్కలను వేయాలి. పైన తరిగిన కొత్తిమీర చల్లాలి. క్రీమ్‌ను కలపాలి.

జాగ్రత్తలు

- పనీర్ ముక్కలను ఎక్కువ సేపు వేయించకూడదు. దోరగా వేగిన వెంటనే తీసేయాలి.
- తాజా క్రీమ్ దొరకకపోతే వెన్న కూడా వేసుకోవచ్చు.

చికెన్ జల్‌ఫ్రెజి

కావాల్సిన పదార్థాలు:

చికెన్- పావుకిలో, తరిగిన ఉల్లిపాయముక్కలు- ఒక కప్పు, తరిగిన టమాటాలు- ఒక కప్పు, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, మిరియాలు- ఒక చెంచా, పసుపు- ఒక చెంచా, ఎండు మిర్చి- నాలుగు, వెల్లుల్లి- నాలుగు రెబ్బలు, నూనె- కప్పు, గరం మసాలా- రెండు చెంచాలు, నిమ్మరసం- ఒక స్పూను, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ఒక మూకుడులో అరకప్పు నూనె వేసి ఉల్లిపాయముక్కలు, టమోటా ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, ఎండుమిర్చి, వేసి వేయించాలి. ఇవి బాగా వేగిన తర్వాత కొద్దిగా నీళ్లు పోసి ఉడకనివ్వాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- మిక్సీలో ధనియాలు, జీలకర్ర, గరం మసాలా, మిరియాలు వేసి పొడి చేయాలి.
- చికెన్ ముక్కలను తీసుకొని- వాటిలో అర కప్పు నూనె, మిక్సీలో ఆడిన పొడిని వేసి బాగా కలపాలి. ఈ ముక్కలు ఒక గిన్నెలో లేదా ప్లాస్టిక్ బౌల్‌లో వేసి మూత బెట్టి ఒక గంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి.
- మూకుడులో మిగిలిన నూనె వేసి చికెన్ ముక్కలను వేయించాలి. దానిలో ముందుగా మిక్సీ చేసుకున్న ముద్దను కలపాలి. కొద్దిగా నీళ్లు, ఉప్పు కలిపి ఒక పదినిమిషాల పాటు ఉడకనివ్వాలి.



జాగ్రత్తలు

- చికెన్ ముక్కలను ఎంతసేపు ఫ్రిజ్‌లో ఉంచితే కూరకు అంత రుచి వస్తుంది. చికెన్ ముక్కలను ఎక్కువ వేయించకూడదు.

దమ్ ఆలూ

కావాల్సిన పదార్థాలు

చిన్న బంగాళదుంపలు- 250 గ్రాములు, నూనె- అర కప్పు, తరిగిన ఉల్లిపాయలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 చెంచాలు, జీలకర్ర- రెండు చెంచాలు, నల్ల మిరియాలు- ఒక చెంచా, కారం- రెండు చెంచాలు, పసుపు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, ఎలకులు- నాలుగు, లవంగాలు- నాలుగు దాల్చిన చెక్క- రుచికి తగినంత, జీడిపప్పు- నాలుగు స్పూన్లు, పెరుగు- ఒక కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, నీళ్లు- తగినన్ని, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- ఒక మూకుడులో ఒక అరకప్పు నూనె వేసి వేడి చేయాలి. చిన్న బంగాళ దుంపల తొక్క తీసి వాటిని వేయించాలి. వాటిని చల్లార్చటానికి ఒక ప్లేటులో పెట్టుకోవాలి.



- మిగిలిన నూనెలో ఏలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, లవంగాలు, జీలకర్ర వేసి వేయించాలి. ఇవి వేగిన తర్వాత జీడిపప్పు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేగనివ్వాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో ముద్దగా చేయాలి.
- ఆ ముద్దను మిక్సీలో వేసి తగినన్ని నీళ్లు కలపాలి. దానిలో పసుపు, కారం, ధనియాల పొడి, పెరుగు వేసి మరింత సేపు ఉడికించాలి.
- ఈ మిశ్రమంలో వేయించి పెట్టుకున్న బంగాళ దుంపలను వేసి ఉడికించాలి. ముక్కలు మగ్గిన తర్వాత పైన కొత్తిమీర చల్లాలి.

జాగ్రత్తలు

- చిన్న బంగాళదుంపలు దొరకకపోతే మామూలు బంగాళదుంపలతో ఈ కూర చేసుకోవచ్చు. కానీ పెద్ద బంగాళ దుంపలను ముక్కలుగా చేసిన తర్వాతే నూనెలో వేయించాలి.
- పెరుగు వేసిన తర్వాత కూరను తిప్పుతూ ఉండాలి. దీనివల్ల పెరుగు విరిగిపోదు.

సంస్కృతి



కళా వారసత్వానికి కొత్త ఊపిరి

అంతరించిపోతున్న జానపద సంగీతాన్ని సజీవంగా నిలిపే ప్రయత్నం చేస్తున్నారు ఆమె. భర్త గోవింద్‌సింగ్ భాటీతో కలిసి... యువ కళాకారులను ప్రోత్సహిస్తూ... ఘురాలియో వంటి రాజస్థాన్ సంస్కృతితో ముడిపడిన వాయిద్యాలను భావితరాలకు అందిస్తున్నారు. దాని కోసం 'లోక్ సంగీత్ శాల' నెలకొల్పి... నవతరం కళాకారులను తీర్చిదిద్దుతున్న షరాన్ జెనీవివ్ కథ ఇది.

"శత్రుదుర్భేద్యమైన కోటలు, కళ్లు తిప్పుకోనివ్వని సౌధాలకే కాదు... ఎన్నో అపురూప సంప్రదాయ, జానపద కళలకూ, కళాకారులకూ నిలయం మా రాజస్థాన్. కానీ క్రమంగా ఆ కళలు కనుమరుగైపోతున్నాయి. ముఖ్యంగా పలు వాయిద్యాలను వారసత్వంగా కొనసాగించేవారు కరువై... వాటి ఉనికిని కోల్పోతున్నాయి. ఇది మమ్మల్ని తీవ్రంగా కలవరానికి గురి చేసింది. మాది తమిళనాడే అయినా పెళ్లి తరువాత రాజస్థాన్‌తో విడదీయలేని అనుబంధం ఏర్పడింది. ముఖ్యంగా మావారు గోవింద్‌సింగ్ భట్‌ది రాజస్థాన్ కావడంతో... చిన్నప్పటి జానపద సంగీతం వింటూ పెరిగారు. ఆయన తండ్రి, తాతగారు మోర్చాంగ్, సారంగి తదితర వాయిద్యాలు వాయించేవారు. ఎంతోమంది కళాకారులు ఇంటికి వచ్చి వెళుతుండేవారు. అలాంటి వాతావరణంలో పెరిగిన ఎవరికైనా సహజంగానే కళలపై అమితమైన ప్రేమ ఏర్పడుతుంది కదా. ఆ ప్రేమతోనే మావారు రాజస్థానీ జానపద కళాకారులను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నారు. వారి ప్రదర్శనలు ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు చూపించేందుకు ఎంతో కష్టపడ్డారు. దాని కోసం రాష్ట్రవ్యాప్తంగా 'మెహ్రాన్‌గఢ్ ట్రస్ట్, జైపూర్ విరాసత్ ఫౌండేషన్' తదితర ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశారు. అవి సత్ఫలితాలనిచ్చాయి. ఆ సంస్థల ఆధ్వర్యంలో జానపద కళాకారులు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు.

ఉపాధి మార్గం...

2008లో ప్రారంభమైన ఆయన ప్రయాణంలో తరువాత నేను కూడా భాగమయ్యాను. పద్నాలుగేళ్లుగా నేను కూడా సామాజిక సేవలో నిమగ్నమయ్యాను. మావారు ఎంచుకున్న మార్గం నాలో స్ఫూర్తి నింపింది. కళాకారుల కోసం ఆయన శ్రమించే తత్వం నన్ను ఆకట్టుకుంది. ఆయనతో కలిసి అడుగులు వేశాను. జానపద కళాకారుల అభ్యున్నతి కోసం, అరుదైన సంగీత వారసత్వాన్ని కొనసాగించడం కోసం మేమిద్దరం కలిసి 2014లో 'బ్లూ సిటీ వాల్స్' సంస్థను ప్రారంభించాం. కొందరు కళాకారుల సహకారంతో షోలు నిర్వహించాం. 'జోధ్‌పూర్ ఓల్డ్ సిటీ' పేరుతో పర్యటనలు ఏర్పాటు చేశాం. వీటన్నిటి నిర్వహణకు స్థానికంగా ఉన్న నిరుద్యోగులను నియమించడంవల్ల కళాకారులతో పాటు వారికీ ఉపాధి లభించింది.

యువతను ప్రోత్సహించేలా...

అయితే ఈ ప్రయాణంలో మాకు అర్థమైంది ఏమిటంటే... జానపద కళా వారసత్వాన్ని కొనసాగించాలంటే మా ప్రయత్నం సరిపోదని. మరింతమందికి చేయూత అందివ్వాలని. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని భావించాం. ప్రధానంగా పాత తరం కళాకారులు కాలం చేస్తుంటే... వారి వారసులు ఆ విద్యను అభ్యసించేందుకు ముందుకు రావడంలేదు. ఇది కలవర పెట్టే అంశం. దానికి ప్రధాన కారణం సంప్రదాయ కళలను నమ్ముకొంటే వారికి సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం. రెండోది... నేర్చుకోవాలనే ఉత్సాహం ఉన్నా ప్రోత్సాహం కరువవడం... తమ కళను ప్రదర్శించేందుకు సరైన వేదికంటూ లేకపోవడం. దీనంతటికి పరిష్కార మార్గంగా మా సంస్థ నిలబడాలనే లక్ష్యంతో అడుగులు వేశాం.



అద్భుత స్పందన...

యువ కళాకారులను తీర్చిదిద్దడం, వారికి మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు రాజస్థాన్ సంస్కృతిని నలుదిశలా విస్తరించే లక్ష్యంతో మా 'బ్లూ సిటీ వాల్స్' ఆధ్వర్యంలో పలు ప్రాజెక్టులు చేపట్టాం. తొలి ప్రయత్నంలో భాగంగా ఎనిమిదిమంది యువ జానపద కళాకారులతో 'రైతిలా రాజస్థాన్' పేరుతో ఒక కార్యక్రమం ఏర్పాటు చేశాం. 'మెహమాన్' అనే పాట రూపొందించాం. సంగీతం మావారే సమకూర్చారు. కళాకారులకు ఆరు నెలలపాటు మేమే శిక్షణ ఇచ్చాం. ఆ పాట 'నెట్‌ఫ్లిక్స్'లో బాగా ప్రాచుర్యం పొందిన 'మిస్ మ్యాచ్' షో రెండో సీజన్‌లో ప్రదర్శించారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చింది. నెట్టింట్లో విపరీతంగా చక్కర్లు కొట్టింది. అన్నిటికీ మించి మా కళాకారులకు మంచి పేరు లభించింది.

ఆ ఆలోచన మారాలి...

మా తరువాతి ప్రాజెక్టులు కూడా విజయవంతమయ్యాయి. అయితే జానపద కళలు కలకాలం జీవించి ఉండాలంటే మా ఒక్కరి ప్రయత్నం సరిపోదు. ఇప్పటికీ చాలామందికి జానపద కళాకారులంటే చిన్న చూపు. ఎవరైనా ఈవెంట్ నిర్వాహకుల వద్దకు వెళ్లి 'ఇలా జానపదాలు ప్రదర్శిస్తాం' అని అడిగితే... వెంటనే పారితోషికం సగం తగ్గించి మాట్లాడతారు. ప్రభుత్వ కార్యక్రమాలకూ ఇదే పరిస్థితి. అదే ఏ సినీ గాయకులకో అయితే అడిగినంత ఇచ్చి తెచ్చుకొంటారు. ఈ ఆలోచన మారాలి. అలాంటివారందరికీ నేను ఒక్కటే చెబుతాను... జానపద కళారూపాలు, కళాకారులు దేనికీ తీసిపోరని. ఇది అర్థమయ్యేట్టు చెప్పేందుకు 'లోక్ సంగీత్ శాల' ప్రారంభించాం. దీని ద్వారా తరువాతి తరం కళాకారులను తయారు చేస్తున్నాం. వారసత్వ కళను ఒక వృత్తిగా చేపట్టేలా ప్రోత్సహిస్తున్నాం. అందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేసి, ఉపాధి మార్గాలు చూపి, ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం'.

ఇలా చేస్తే నోటి దుర్వాసన మాయం

కొంతమందికి నోరు ఎప్పుడూ దుర్వాసన వస్తూ ఉంటుంది. పలు రకాల నోటి సమస్యలు, నోటిలో తేమ తగ్గడం, అనారోగ్య కారణాల వల్ల ఇలా జరుగుతూ ఉంటుంది. నోటి దుర్వాసనను తొలగించే కొన్ని మార్గాల గురించి తెలుసుకుందాం!

పళ్లు తోముకోవడం: దంతాల్లో రంధ్రాలు, పిప్పి పళ్లు ఏర్పడితే నోటిలో హానికర బ్యాక్టీరియాలు వృద్ధి పొందుతాయి. ఇవి కడుపులోకి చేరి పలు అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. వీటివల్ల నోరు దుర్వాసన వస్తుంది. ఉదయం లేవగానే మరల రాత్రి పడుకునేముందు తప్పనిసరిగా పళ్లు తోముకోవాలి. పళ్ల సందుల్లో ఆహార పదార్థాలు ఇరుక్కుంటే వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

చిగుళ్లు భద్రం: నోరు పరిశుభ్రంగా లేకపోతే పంటి చిగుళ్లలో వాపు, పుండ్లు ఏర్పడుతుంటాయి. వీటివల్ల కూడా నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. రోజూ పళ్లతో పాటు చిగుళ్లను కూడా శుభ్రం చేసుకోవాలి. ఆలివ్ నూనె, ఇ విటమిన్ నూనె, ఆల్మండ్ నూనెల్లో ఒకదాన్ని తీసుకుని పంటి చిగుళ్ల మీద రాయాలి. తరవాత వేలితో గుండ్రంగా 5 నిమిషాలు రుద్దాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేయడం వల్ల చిగుళ్లు గట్టిపడతాయి. నోటి దుర్వాసన తగ్గుతుంది.



నాలుక శుభ్రం: నాలుక మీద ఆహారపదార్థాలు, నీరు ఒక పొరలా చేరతాయి. వీటి నుంచి కూడా దుర్వాసన వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే రోజుకు ఒక్కసారైనా నాలుకను శుభ్రం చేసుకోవాలి. దూది మీద గ్లిసరిన్ రెండు చుక్కలు వేసి దానితో నాలుక మీద మెల్లగా రుద్దుతూ శుభ్రం చేయాలి. తరవాత గోరువెచ్చని నీటితో నోటిని పుక్కిలించాలి. నాలుక ఎప్పుడూ లేత గులాబీ రంగులో కనిపిస్తూ ఉండాలి.

పుక్కిలింత: భోజనం చేసిన తరవాత నోటిని తప్పనిసరిగా నీళ్లతో పుక్కిలించాలి. నోటినిండా నీరు నింపి 30 సెకన్లు ఉంచుకొని విడవాలి. నోరు బాగా దుర్వాసన వస్తూ ఉంటే ఒక గ్లాసు నీళ్లలో అయిదు పుదీనా ఆకులు వేసి బాగా మరిగించి ఆ నీటితో అయిదుసార్లు నోటిని పుక్కిలించాలి. ఒక గ్లాసు నీళ్లలో మూడు చుక్కల యూకలిప్టస్ ఆయిల్ లేదా ఒక చెంచా తేనె లేదంటే రెండు చెంచాల నిమ్మరసం కలిపి ఆ నీటితో నోరు పుక్కిలించినా మంచి ఫలితం ఉంటుంది. రోజూ రాత్రి పడుకునేముందు ఉప్పు నీటితో నోటిని శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

నీళ్లు తాగాలి: తరచూ మంచి నీళ్లు తాగుతూ నోరు తడారిపోకుండా చూసుకోవాలి. దీనివల్ల నోటిలో సూక్ష్మక్రిములు పెరగకుండా ఉంటాయి. నోరు, నాలుక తేమగా ఉంటే వాటి నుంచి దుర్వాసన రాదు.

సోంపు నమలాలి: భోజనం చేసిన తరవాత ఒక చెంచా సోంపు గింజలు నమలడంవల్ల నోరు పరిశుభ్రమవుతుంది. జీర్ణక్రియ కూడా సజావుగా జరుగుతుంది. పచ్చి ఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి లాంటి ఘాటైన వాసన వచ్చే ఆహారం తిన్నపుడు నోటి శుభ్రతకు జాగ్రత్తలు తీసుకోవాలి.

యాపిల్ తినాలి: రోజూ ఒక యాపిల్ తింటే అందులోని పాలిఫెనాల్స్ దంతాలను, నాలుకను శుభ్రం చేస్తాయి. నోటి దుర్వాసనను దూరం చేస్తాయి. తులసి ఆకులు, పుదీనా ఆకులను తరచూ నమిలినా ప్రయోజనం ఉంటుంది.

ఇలా నడవండి...

నడక ఆరోగ్యానికి మంచిది. రోజుకి కనీసం పదివేల అడుగులు వేయాలని నిపుణులు చెబుతున్నారు. అయితే నడిచే విధానంలో కొన్ని పద్ధతులు ఉన్నాయి. శరీరాన్ని దృఢంగా ఉంచుతూ వివిధ ఆరోగ్య సమస్యలను నివారించే నడకల గురించి తెలుసుకుందాం.

వేగంగా: నడుస్తూ మాట్లాడగలిగే వేగాన్ని అనుసరించాలి. కానీ పాట పాడగలిగేంత తక్కువ వేగం కాదు. గంటకు నాలుగు మైళ్ల వేగంతో భుజాలను కదిలిస్తూ నడవాలి. ఇలా రోజుకు అర్ధ గంట చొప్పున వారానికి అయిదు రోజులు నడవడం వల్ల గుండెకు, ఊపిరితిత్తులకు ఆక్సిజన్ బాగా అందుతుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం తప్పుతుంది. రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతాయి.

శక్తితో: మొదట సాధారణంగా నడక ప్రారంభించి క్రమంగా వేగం పెంచాలి. భుజాలు, చేతులను కూడా వేగంగా ముందుకు, వెనక్కు కదిలేలా చూసుకోవాలి. మధ్యలో విరామం తీసుకోవచ్చు. ఈవిధంగా నడవడానికి ఎక్కువగా శక్తి ఖర్చవుతుంది. గంటకు అయిదు మైళ్ల వేగంతో రోజుకు ఒక మైలు ఇలా నడిస్తే శరీరంలో పేరుకున్న అదనపు కొవ్వు కరిగిపోతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఈ పద్ధతి బాగా ఉపకరిస్తుంది.

ఎగుడు దిగుడు నేలపై: ఎత్తు పల్లాలు ఉన్న ప్రదేశాల్లో నడవడం వల్ల పాదాలు, మోకాళ్లలో కండరాలు ఉద్దీపనకు గురై బలంగా మారతాయి. కీళ్లు పట్టేయకుండా సులువుగా కదులుతాయి. శరీర భాగాలన్నీ సమన్వయంతో పనిచేస్తూ సమతాస్థితిలో ఉంటాయి. కాళ్లకు చెప్పులు వేసుకోకుండా రాళ్లు, ఇసుక ఉన్న నేలపై నడిస్తే పాదాలకు రక్తప్రసరణ అందుతుంది.



సన్నని కర్రలతో: ప్రత్యేకంగా రూపొందించిన సన్నని కర్రలను రెండు చేతులతో పట్టుకుని ముందుకు నడవాలి. దీనివల్ల వల్ల కాళ్లతోపాటు భుజాలు, చేతులు, మెడ కండరాలు బలోపేతమవుతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగవుతుంది. ఊపిరి తీసుకోవడం, వదలడం ఒక క్రమ పద్ధతిలో జరగడం వల్ల గుండె కొట్టుకునే వేగం సాధారణంగా ఉంటుంది. కర్రలు చాలా సన్నగా తక్కువ బరువు ఉండేలా చూసుకోవాలి. లేదంటే చేతి మణికట్టులో నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది.

విరామంతో: నడక వేగాన్ని ఒక నిర్ణీత సమయానుసారం మారుస్తూ నడవడం వల్ల శరీరం జీవక్రియలను సక్రమంగా నిర్వహిస్తుంది. మొదట ఒక నిమిషం వేగంగా నడిచి తరవాత రెండు నిమిషాలు సాధారణంగా నడవాలి. ఇలా నడక వేగాన్ని మారుస్తూ ఉంటే ఓర్పు, సహనం, ఏకాగ్రత అలవడుతాయి.

ఎన్నికల అక్రమాలపై ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవలి ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) శుక్రవారం ఇక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. దాదాపు నాలుగున్నర గంటలపాటు జరిగిన ఈ భేటీలో.. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను సమీక్షించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శులు కె.సి. వేణుగోపాల్, జైరాం రమేశ్ మీడియాకు వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు, క్రమశిక్షణను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఈ సమావేశంలో పిలుపునివ్వగా.. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా కార్యకర్తలు నైతిక స్థైర్యం కోల్పోకూడదని రాహుల్ గాంధీ అన్నారు. రెండు రాష్ట్రాల్లో ఫలితాలు తమకు దిగ్ర్భాంతి కలిగించాయన్న సీడబ్ల్యూసీ.. ఒక పథకం ప్రకారం ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించింది. ఈ ఫలితాలపై సాంకేతిక, రాజకీయ సమీక్షల్ని నిర్వహిస్తున్నామని, త్వరలో మరింత స్పష్టంగా ఈ అక్రమాలను ప్రజల ముందు పెడతామని తెలిపింది. ఫలితాల విశ్లేషణకు అంతర్గత కమిటీలు ఏర్పర్చాలని నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాల్లో జిల్లాలవారీగా సమీక్షలు జరిపి పార్టీ పనితీరును బలోపేతం చేయాల్సిన బాధ్యతను ఖర్గేకు అప్పగించాలని సీడబ్ల్యూసీ తీర్మానించింది. ఎన్నికల్లో ఓటమికి జవాబుదారీ ఎవరిదో నిర్ణయించి కఠిన చర్యలు తీసుకోవాలని నిశ్చయించింది. "మహాత్మాగాంధీ బెల్గాంలో 1924లో పార్టీ అధ్యక్ష పదవి చేపట్టి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెద్ద ఎత్తున ఉత్సవాలు జరపాలి. డిసెంబర్ 26-27 తేదీల్లో బెల్గాంలో ప్రత్యేక వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి" అని సీడబ్ల్యూసీ తీర్మానించింది. జమ్మూకశ్మీర్, ఝార్ఖండ్‌లో ఇండియా కూటమి పార్టీల గెలుపు, వయనాడులో ప్రియాంక ఘనవిజయంపై సీడబ్ల్యూసీ హర్షం వ్యక్తం చేసింది. అదానీ, మణిపూర్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మతపరమైన ఉద్రిక్తతలపై చర్చకు ఒప్పుకోకుండా మోదీ సర్కారు మొండిగా వ్యవహరిస్తోందని నిరసన వ్యక్తం చేసింది.



కఠిన చర్యలు తప్పవు: ఖర్గే

వరుస అపజయాలతో కుంగిపోతున్న కాంగ్రెస్‌కు పూర్వవైభవం రావాలంటే.. పార్టీని మూలాల నుంచి బలోపేతం చేయాలంటే.. కఠిన చర్యలు తీసుకోకతప్పదని ఖర్గే అన్నారు. ఎన్నికల ఫలితాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలంటే ఓటమికి కారకులైన వారిని జవాబుదారీ చేయాలని, పార్టీలో ఉన్న సంస్థాగత లోపాలను సవరించుకోవాలని ఆయన తన అధ్యక్షోపన్యాసంలో పిలుపునిచ్చారు. ఈవీఎంల పనితీరు కూడా ఎన్నికల ఫలితాలపై అనుమానాలను ఏర్పరుస్తున్నాయని, దేశంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌ది అని ఆయన చెప్పారు. కార్యకర్తలు, నాయకులు.. అంతా కలిసికట్టుగా పోరాడాలని, ఒకరికి వ్యతిరేకంగా మరొకరు బహిరంగ ప్రకటనలు చేయడం మానుకోవాలని సూచించారు. అది జరగనంత కాలం ప్రత్యర్థులను రాజకీయంగా ఎలా ఎదుర్కొంటామని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వాతావరణం ఏర్పడినంత మాత్రాన విజయం లభించినట్లు కాదని, ఆ వాతావరణాన్ని ఫలితాలుగా మార్చగలిగిన శక్తిని సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. పాతకాలం పద్ధతులతో పార్టీ విజయాలు సాధించలేదని.. రాజకీయ ప్రత్యర్థుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు కనిపెడుతూ ఉండాలని, తగిన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ ఒంటరి పోరు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయనుంది. మొత్తం 70 నియోజకవర్గాల్లోనూ ఎవ్వరితోనూ పొత్తు పెట్టుకోకుండా పోటీ చేస్తామని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తెలిపారు. ఇండి కూటమిలో భాగంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ హరియాణాలో ఒంటరిగా పోటీ చేయడంతో ఢిల్లీలో కాంగ్రెస్ పొత్తుకు దూరంగా ఉంది.

ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నివేదిక!

న్యూఢిల్లీ, నవంబరు 29: మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ కూటమి పరాభవానికి ఎన్నికల్లో జరిగిన అక్రమాలే కారణమని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ఇదేసమయంలో ఎన్నికల సంఘం మాజీ చీఫ్ కమిషనర్ ఎస్.వై. ఖురేషీ కూడా మహారాష్ట్ర ఎన్నికల ప్రక్రియపై పలు సందేహాలు లేవనెత్తారు. ముఖ్యంగా ఓటర్ల జాబితా, పోలైన ఓట్లు, ఓట్ల లెక్కింపును ఆయన నిశితంగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తాజాగా కాంగ్రెస్ పార్టీ 12 పేజీలతో కూడిన నివేదికను 'అత్యవసర మెమోరాండం' పేరుతో శుక్రవారం ఈసీకి సమర్పించింది. తాము లేవనెత్తుతున్న సందేహాలపై విచారణ చేయాలని, ఇన్ పర్సన్(భౌతికంగా) సమావేశం నిర్వహించి ఎన్నికల్లో అక్రమాలపై నిగ్గుతేల్చాలని కోరింది. పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయని పేర్కొంటూ ఖురేషీ వ్యాఖ్యలను జోడించింది. ఏకపక్షంగా ఓటర్లను తొలగించారని, అదేసమయంలో ఒక్కొక్క నియోజకవర్గంలో 10 వేల మంది చొప్పున ఓటర్లను చేర్చారని తెలిపింది. అదేవిధంగా పోలింగ్ సమయంలో ప్రకటించిన ఓటింగ్ శాతానికి, మరుసటి రోజు ప్రకటించిన ఓటింగ్ శాతానికి మధ్య భారీ వ్యత్యాసం ఉందని పేర్కొంది.

అదానీపై అదే రగడ

న్యూఢిల్లీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాలు అయిదో రోజు కూడా ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడ్డాయి. ప్రతి రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కాగానే అదానీపై అమెరికా చేసిన ఆరోపణలపై చర్చకు అనుమతి ఇవ్వాలని విపక్షాలు పట్టుపట్టాయి. దర్యాప్తునకు జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండు చేశాయి. మణిపూర్, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జరిగిన హింసాకాండపై చర్చించాలని నినాదాలు చేయడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. అదే సమయంలో రాజ్యసభ కూడా విపక్ష సభ్యుల నినాదాలతో అట్టుడుకుంది. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభ్యుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభను డిసెంబర్ 2వ తేదీ (సోమవారానికి)కి వాయిదా వేశారు. అటు లోక్‌సభ మళ్లీ ప్రారంభమైనప్పటికీ ఇదే పరిస్థితి కనిపించడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

అలిగి.. సొంతూరికి శిండే

ముంబై, నవంబరు 29: మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరనే విషయంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఢిల్లీలో బీజేపీ అధిష్ఠానంతో గురువారం చర్చల తర్వాత శుక్రవారం ముంబైలో జరగాల్సిన మహాయుతి కూటమి సమావేశం రద్దు అయింది. తర్వాత ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిండే తన సొంతూరు సతారాకు వెళ్లిపోయారు. ఢిల్లీ సమావేశంలో ఆయన పట్టణాభివృద్ధి శాఖతో పాటు హోం మంత్రిత్వ శాఖ కూడా అడిగినట్లు తెలిసింది. హోం శాఖ సీఎం వద్దే ఉంటుందంటూ బీజేపీ అధిష్ఠానం నిరాకరించినట్లు సమాచారం. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఢిల్లీలో గురువారం రాత్రి జరిగిన సమావేశం తర్వాత విలేకరులకు ఏ విషయమూ చెప్పకుండానే నేతలంతా మౌనంగా వెళ్లిపోయారు. ముంబై తిరిగి వచ్చిన శిండే సొంతూరుకు వెళ్లిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకునే ముందు శిండే సొంతూరుకు వెళ్తుంటారని శివసేన నేత సంజయ్ సిర్సాట్ వెల్లడించారు. కాగా, మహాయుతి సమావేశం ఆదివారం జరుగనుంది.

డ్రగ్స్ స్మగ్లింగ్ కోసం స్టార్‌లింక్

అరేబియా సముద్రంలో 500 కేజీల డ్రగ్స్ పట్టివేత

చెన్నై, నవంబరు 29: అరేబియా సముద్రంలో జరిపిన ఒక ఆపరేషన్‌లో భారత నౌకాదళం 500 కేజీల మాదకద్రవ్యాల(క్రిస్టల్ మెథంఫెటమైన్)ను స్వాధీనం చేసుకుంది. 9 మందిని అదుపులోకి తీసుకుంది. నవంబరు 24న శ్రీలంక నౌకాదళం నుంచి అందిన సమాచారం మేరకు మొదలైన ఈ ఆపరేషన్ రెండు రోజులపాటు సాగింది. అరెస్టు చేసిన 9మందిని భారత్ శ్రీలంక నౌకాదళానికి అప్పగించింది. కాగా, ఈ మాదక ద్రవ్యాల రవాణాకు స్మగ్లర్లు అత్యాధునిక స్టార్‌లింక్ ఉపగ్రహ ఆధారిత సమాచార పరికరాలను ఉపయోగించారని అండమాన్, నికోబార్ పోలీసులు వెల్లడించారు. అక్కడ పట్టుబడిన చేపల వేట ట్రాలర్ నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఆ ట్రాలర్ వెళ్లాల్సిన మార్గ సూచికలు(నావిగేషన్ కోఆర్డినేట్స్)కూడా సేవ్ చేసి ఉన్నాయి. ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్ 'ఎక్స్' నిర్వహిస్తోన్న స్టార్‌లింక్ సుదూర సముద్ర జలాల్లో కూడా అధిక వేగ ఉపగ్రహ ఆధారిత ఇంటర్‌నెట్‌ని అందిస్తోంది. ఇది స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహించేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. మరోవైపు, కొలంబియా దేశ అధికారుల ఆధ్వర్యంలో 60కి పైగా దేశాల అధికారులు జరిపిన ఆపరేషన్‌లో భారీఎత్తున మాదక ద్రవ్యాలను పట్టుకున్నారు. కొలంబియా నుంచి ఆస్ట్రేలియాకు ఆరు సెమి సబ్‌మెర్సిబుల్ పడవల్లో వీటిని రవాణా చేస్తుండగా పసిఫిక్ మహా సముద్రంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొకెయిన్ 225 టన్నులు, 128 టన్నుల గంజాయితోపాటు మొత్తం 1400 టన్నులకు పైగా మాదక ద్రవ్యాలు ఉన్నాయి.

ప్రసాదం నాణ్యతపై 'పిల్'ను తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 29: ఆలయాల్లో పంపిణీ చేసే ప్రసాదం, ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేలా నిబంధనలు రూపొందించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇది ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపర నిర్ణయమని, తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఇది ప్రచారం కోసం వేసిన వ్యాజ్యం కాదని తెలిపారు. ప్రసాదం, ఆహారం తిని భక్తులు అస్వస్థతకు గురయిన సందర్భాలు ఉండడంతో దీన్ని దాఖలు చేసినట్టు చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ "అలాంటప్పుడు దీన్ని ఒక్క ప్రసాదానికే పరిమితం చేయడం ఎందుకు? రెస్టారెంట్లు, కిరాణా కొట్లను కూడా కలపండి. అక్కడ కూడా కల్తీ జరగవచ్చు" అని వ్యాఖ్యానించింది.

సంభాల్ కోర్టు విచారణపై సుప్రీంకోర్టు స్టే!

న్యూఢిల్లీ, నవంబరు 29: యూపీలోని చందౌసీలో ఉన్న మొఘల్ కాలం నాటి జామా మసీదు సర్వే అంశం మీద స్థానిక సంభాల్ జిల్లా కోర్టు జరుపుతున్న విచారణపై సుప్రీంకోర్టు తాత్కాలిక నిలుపుదల (స్టే) విధించింది. స్థానిక కోర్టు ఆదేశాల మేరకు మసీదులో సర్వే జరిపిన కోర్టు కమిషనర్ రూపొందించే నివేదికను తదుపరి ఆదేశాల వరకూ బహిరంగపరచవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మసీదులో సర్వే జరపాలంటూ సంభాల్ జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ షాహీ జామా మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. స్థానిక కోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టుకు రాకుండా, తొలుత హైకోర్టుకు వెళ్లాల్సి ఉంటుందని పిటిషనర్లకు సూచించింది. మూడు పనిదినాల్లో అలహాబాద్ హైకోర్టు ఈ అంశాన్ని విచారణకు తీసుకోవాలని ఆదేశించింది.

నవజోత్ సిద్ధు భార్యకు రూ.850 కోట్లకు నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 29: మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత నవజోత్ సింగ్ సిద్ధు, ఆయన భార్య నవజోత్ కౌర్ సిద్ధు చిక్కుల్లో పడ్డారు. అల్లోపతి మందులతో పనిలేకుండా కేవలం ఆహార నియంత్రణతోనే తన భార్యకు స్టేజ్-4 కేన్సర్ నయమైందంటూ సిద్ధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఛత్తీస్‌గఢ్ సివిల్ సొసైటీ (సీసీఎస్) కౌర్‌కు రూ.850 కోట్లకు నోటీసులు పంపించింది. కేన్సర్ చికిత్సకు సంబంధించి వారం రోజుల్లోగా ఆధారాలు చూపించాలని, లేదంటే రూ.850 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఆ నోటీసుల్లో హెచ్చరించింది. దీనిపై సీసీఎస్ కన్వీనర్ డాక్టర్ కుల్దీప్ సోలంకి మాట్లాడుతూ.. 'ఇలాంటి మాటలు విని కేన్సర్ రోగులు అల్లోపతి చికిత్స తీసుకోవడం, మందులు వేసుకోవడం మానేస్తే వారి ప్రాణానికే ప్రమాదం ఏర్పడుతుంది' అని పేర్కొన్నారు.

ప్రతి ఓటీపీని బ్యాంకు ధ్రువీకరించాల్సిందే

ఆ తర్వాతే వినియోగదారుడికి సందేశం

న్యూఢిల్లీ, నవంబరు 29: టెలికం రెగ్యులేటరీ అథారిటీ(ట్రాయ్) డిసెంబరు 1 నుంచి కొత్త నిబంధనను అమల్లోకి తెస్తోంది. ట్రేసబిలిటీ గైడ్‌లైన్స్‌గా పిలుస్తున్న ఆ నిబంధనల ప్రకారం టెలికం సంస్థలు వినియోగదారులకు వచ్చే ఓటీపీలు నిజమైనవా? కాదా? ధ్రువీకరించుకొని మాత్రమే డెలివరీ చేస్తాయి. ముందు ఓటీపీలు నిర్ణీత ఫార్మట్‌లో ఉన్నాయా? లేదా? చూస్తాయి. ఆ తర్వాత ఓటీపీ సందేశంలో పేర్కొన్న బ్యాంకు లేదా ఈ-కామర్స్ కంపెనీ నుంచే వచ్చిందా? లేదా? అని కూడా ధ్రువీకరించుకుంటాయి. ఆ తర్వాతే వినియోగదారుడికి సందేశాన్ని పంపిస్తాయి. తద్వారా స్పామ్ లేదా మోసపూరిత సందేశాలను చాలా వరకు పరిహరించవచ్చు. అయితే, ఈ మొత్తం ప్రాసెస్ వల్ల ఓటీపీలు కస్టమర్‌కు చేరడానికి సమయం పడుతుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పాముకాటును నోటిఫయబుల్ వ్యాధిగా గుర్తించండి

న్యూఢిల్లీ, నవంబరు 29: పాముకాటులను 'ప్రకటనార్హ వ్యాధి' (నోటిఫయబుల్ డిసీజ్)గా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచించింది. పాముకాటు బాధితులు, ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలను తప్పకుండా ప్రభుత్వానికి పంపించడం కోసం ఈ గుర్తింపు ఇవ్వడం తప్పనిసరి. ప్రయివేటు ఆస్పత్రులకు కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఈ సమాచారం ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది. ఈ గుర్తింపు ఇచ్చేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని సూచిస్తూ కేంద్రం లేఖ రాసింది. దేశంలో ఏటా 30-40 లక్షల మంది పాము కాటుకు గురవుతుండగా సుమారు 50వేల మంది మరణిస్తున్నారు.

మహారాష్ట్రలో ఆర్టీసీ బస్సు బోల్తా 11 మంది మృతి

గోండియా, నవంబరు 29: మహారాష్ట్రలోని గోండియా సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు బోల్తా పడడంతో 11 మంది ప్రయాణికులు మరణించారు. మరో 23 మంది గాయపడ్డారు. దుర్ఘటన సమయంలో బస్సులో 36 మంది ప్రయాణిస్తున్నారు. భండారా నుంచి గోందియా జిల్లాకు వస్తున్న బస్సు సడక్ అర్జుని తాలూకాలోని దవ్వ గ్రామం వద్దకు రాగానే ఈ ప్రమాదం జరిగింది. బస్సు ముందుకు ఆకస్మికంగా ఓ ద్విచక్రవాహనం రావడంతో దానిని ఢీకొట్టకూడదన్న ఉద్దేశంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ఆ కారణంగానే ప్రమాదం జరిగిందని సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. బాధితులను వివిధ ఆస్పత్రులకు తరలించినట్టు తెలిపారు. ఈ దుర్ఘటనపై ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల వంతున ఆర్థిక సాయం ప్రకటించారు.

నవ్య | చిత్రజ్యోతి

కాపీరైట్ ఉల్లంఘన జరగలేదు

● నోటీసులపై నయనతార లాయర్ స్పందన



'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీ విషయంలో నటి నయనతారకు, హీరో ధనుష్‌కు మధ్య తలెత్తిన వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తన చిత్రంలోని మూడు సెకన్ల సన్నివేశాలను వినియోగించారని పేర్కొంటూ నయనతార దంపతులపై ధనుష్ మద్రాస్ హైకోర్టులో దావా వేయగా, దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు నయన్ దంపతులకు నోటీసులు జారీ చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై నయనతార న్యాయవాది రాహుల్ ధవన్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. నయనతార డాక్యుమెంటరీలో ఎలాంటి కాపీరైట్ ఉల్లంఘన జరగలేదని పేర్కొన్నారు. అందులో ఉపయోగించిన క్లిప్పింగ్స్ 'నానుం రౌడీ దాన్' సినిమాలోని సన్నివేశాలు కాదని, అవి వ్యక్తిగత లైబ్రరీలోని బీటీఎస్‌కు సంబంధించినవని స్పష్టంచేశారు.

వడ్డీతో సహా తిరిగొస్తుంది

ఇదిలా ఉంటే నయనతార శుక్రవారం కర్మ సిద్ధాంతాన్ని పేర్కొంటూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. 'అబద్ధాలతో పక్కవారి జీవితాన్ని నాశనం చేయాలని చూసేవాళ్లు దాన్నొక అప్పుగా భావించండి. ఏదో ఒక రోజున మీకు వడ్డీతో సహా తిరిగొస్తుందని గుర్తు పెట్టుకోండి' అనేది ఆ పోస్ట్ సారాంశం. నయనతార ఈ పోస్ట్ ద్వారా ధనుష్‌కు వార్నింగ్ ఇచ్చారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

సమంతకు పితృవియోగం



నటి సమంతకు పితృవియోగం కలిగింది. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు శుక్రవారం గుండెపోటుతో చెన్నై నగరంలో మృతి చెందారు. తండ్రి మరణవార్తను సమంత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. ఒక ఎమోజీని షేర్ చేస్తూ 'నాన్నా... మళ్లీ మనం కలిసేంత వరకూ...' అంటూ పేర్కొన్నారు. తెలుగు ఆంగ్లో ఇండియన్ అయిన జోసెఫ్ ప్రభు మలయాళ కుటుంబానికి చెందిన నినెట్‌ను వివాహం చేసుకున్నారు. మొదటి నుంచీ సమంతకు తండ్రితో అనుబంధం ఎక్కువ. చిన్నతనం నుంచి తనలో ఆత్మవిశ్వాసం నింపి, తను ఈ స్థాయికి ఎదగడానికి తల్లిదండ్రులే కారణం అని సమంత పలు సందర్భాల్లో చెప్పారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

హల్దీ వేడుక



అక్కినేని నాగ చైతన్య - శోభిత ధూళిపాళ్ల డిసెంబరు 4న వైవాహిక బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. గురువారం కాబోయే వధూవరులకు హల్దీ వేడుక నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలో కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. నాగచైతన్య, శోభితలకు మంగళ స్నానాలు చేయించి అభినందనలు తెలిపారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

శ్రీవల్లితో కలసి స్టెప్పులేసిన పుష్ప



అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించిన 'పుష్ప' చిత్రం డిసెంబర్ 5న విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో సినిమా ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. పట్నాతో ప్రారంభించి, చెన్నై, కొచ్చిలలో ఈవెంట్స్ నిర్వహించిన చిత్ర యూనిట్ శుక్రవారం ముంబైలో ప్రెస్ మీట్ నిర్వహించింది. ఇందులో అల్లు అర్జున్, రష్మిక స్టెప్స్ వేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ మాట్లాడుతూ "నేను హీరోగా నిలబడ్డానంటే కారణం దర్శకుడు సుకుమారే. నన్ను స్టార్‌ని చేసింది ఆయనే. హీరోగా నా ఎదుగుదల లో ఆయన పాత్ర కీలకం. ఈ నిర్మాతలు లేకపోతే 'పుష్ప' నిర్మాణం సాధ్యమయ్యేది కాదు. బాలీవుడ్‌లో విడుదల చేస్తున్న అనిల్ తడాని, భరత్ భూషణ్‌కు ధన్యవాదాలు' అని చెప్పారు. ఐదు సంవత్సరాల 'పుష్ప' ప్రయాణంలో ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయని రష్మిక చెప్పారు. చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 12 వేలకు పైగా థియేటర్స్‌లో విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు నవీన్, రవిశంకర్ చెప్పారు.

ఆ నిర్ణయం మారొచ్చు



'ఏ.ఆర్.రెహమాన్, సైరాభానులది సుదీర్ఘ వైవాహిక ప్రయాణం. ఎంతో ఆలోచించాకే వారిద్దరు విడిపోవడానికి సిద్ధపడ్డారు. అయినా ఆ నిర్ణయం మారొచ్చు. వారిద్దరూ తిరిగి కలిసే అవకాశం లేకపోలేదు' అని లాయర్ వందన షా ఓ ఇంటర్వ్యూలో అన్నారు. రెహమాన్, సైరాభాను విడిపోవడం జీర్ణించుకోలేని అభిమానుల్లో వందన షా వ్యాఖ్యలు ఆనందాన్ని నింపాయి. ఈ జంట కలిసుండే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా

కాగా, గోవాలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' ముగింపు వేడుకల్లో రెహమాన్ పాల్గొన్నారు. ఈతరం ఎక్కువగా ఎదుర్కొంటున్న కుంగుబాటు సమస్యపై మాట్లాడారు. 'ఈ రోజుల్లో చాలామంది ఒత్తిడి, కుంగుబాటుకు గురవుతున్నారు. జీవితంలో ఏదో కోల్పోయామనే భావనలో ఉంటున్నారు. జీవితమంతా శూన్యంగా మారిందనే భ్రమలో జీవిస్తున్నారు. అలాంటి వారు చదవడం, రాయడం లేదా మనకు ఇష్టమైన సంగీతం వినడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది. నాకు కూడా యవ్వనంలో ఉన్నప్పుడు ఓ సారి ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. 'మనం ఇతరుల కోసం జీవించినప్పుడు ఆత్మహత్య ఆలోచనలు రావు' అని ఆ సమయంలో మా అమ్మ ఇచ్చిన సలహా నా జీవితాన్ని మార్చేసింది' అని రెహమాన్ అన్నారు.

వచ్చే నెలలో నా పెళ్లి

కీర్తి సురేశ్



తన స్నేహితుడు ఆంటోనీతో ప్రేమలో ఉన్నాననీ, దాదాపు పదిహేనేళ్ల తమ స్నేహబంధం ఇకపై జీవితాంతం కొనసాగనుందని ఇటీవల వెల్లడించిన హీరోయిన్ కీర్తి సురేశ్ తమ పెళ్లి ఎప్పుడనేది మీడియాకు చెప్పేశారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపంలో వేద పండితుల ఆశీర్వాదం పొందిన కీర్తి సురేశ్ ఆలయం వెలుపలికి వచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడారు. వచ్చే నెలలో తన పెళ్లి గోవాలో జరుగనుందని, అందుకే స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం కీర్తి సురేశ్ 'బేబీ జాన్' హిందీ చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమాతోనే ఆమె బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. వరుణ్ ధావన్ ఇందులో హీరోగా నటిస్తున్నారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

నందమూరి నాయకా...



మహానటుడు ఎన్టీఆర్ మనవడు, బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్న సంగతి తెలిసిందే. 'హను-మాన్' ఫేం ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఈ సినిమాను తేజస్విని, చెరుకూరి సుధాకర్ కలసి నిర్మిస్తున్నారు. మోక్షజ్ఞ పుట్టినరోజున ఈ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన దగ్గర నుంచి షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని నందమూరి అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పౌరాణిక గాథల స్ఫూర్తితో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. తాజాగా మోక్షజ్ఞ కొత్త స్టిల్‌ను శుక్రవారం విడుదల చేశారు. గడ్డం, చెక్ షర్ట్‌తో చాలా హాండ్‌సమ్‌గా కనిపించారు మోక్షజ్ఞ. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.



జాసన్ సంజయ్ దర్శకత్వంలో..

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వంలో సినిమా తీయబోతున్నట్లు 'లైకా' సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో హీరోగా సందీప్ కిషన్ నటించబోతున్నారని ప్రకటిస్తూ మూవీ పోస్టర్‌ను చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ మాట్లాడుతూ 'జాసన్ సంజయ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. ఈ కథలో పాన్ ఇండియా దృష్టిని ఆకర్షించే ప్రధానమైన పాయింట్ ఉంది. తమన్ సంగీతం అందించబోతున్నారు. జనవరిలో షూటింగ్ ప్రారంభించబోతున్నాం' అని తెలపారు.

ముగిసిన ఇఫీ చిత్రోత్సవం

- ఆస్ట్రేలియా దర్శకుడు ఫిలిప్ నోయిస్‌కు సత్యజిత్ రే జీవిత సాఫల్య పురస్కారం
- ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2024 - విక్రాంత్ మాస్సే
- 'టాక్సిక్' చిత్రానికి 'ది గోల్డెన్ పీకాక్' పురస్కారం

ఈ నెల 20 నుంచి 28 వరకూ తొమ్మిది రోజుల పాటు సినీ ప్రేమికులను అలరించిన 55వ భారత అంతర్జాతీయ చిత్రోత్సవం (ఇఫీ) ముగిసింది. గురువారం గోవాలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ విజేతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రతిష్ఠాత్మక సత్యజిత్ రే జీవిత సాఫల్య పురస్కారం ఆస్ట్రేలియా దర్శకుడు ఫిలిప్ నోయిస్‌కు దక్కింది. ఉత్తమ చిత్రం విభాగంలో లిథువేనియన్ చిత్రం 'టాక్సిక్' 'ది గోల్డెన్ పీకాక్' పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ చిత్రానికి గాను ఉత్తమ నటీమణులుగా వెస్ట, లెవాలు సంయుక్తంగా పురస్కారం అందుకున్నారు. 'ద న్యూ ఇయర్ దట్ నెవర్ కేమ్' చిత్రానికి గాను రొమేనియాకు చెందిన బోగ్డాన్ మురేసాకు ఉత్తమ దర్శకుడి పురస్కారం దక్కింది. ఫ్రెంచ్ చిత్రం 'హోలీ కౌ'లో నటించిన కెమెంట్ ఫావు ఉత్తమ నటుడి పురస్కారం స్వీకరించారు. స్వీడిష్ చిత్రం 'క్రాసింగ్' దర్శకుడు లెవన్ అకిన్ ఐసీఎఫ్‌టీ - యునెస్కో గాంధీ మెడల్ - 2024 పురస్కారాన్ని అందుకున్నారు.



ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2024 పురస్కారం బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సేకు దక్కింది. ఇండియన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో గుజరాతీ చిత్రం 'ఘరత్ గణపతి'కి గాను నవజ్యోత్ బండివాడేకర్ ఉత్తమ అరంగేట్ర దర్శకుడిగా పురస్కారాన్ని దక్కించుకున్నారు.



ఫిలిప్ నోయిస్



విక్రాంత్ మాస్సే

మరాఠీ వెబ్‌సిరీస్ 'లంపన్' ఉత్తమ వెబ్‌సిరీస్‌గా నిలిచింది. ఈ చిత్రోత్సవాల్లో 80 దేశాలకు చెందిన 180 సినిమాలను ప్రదర్శించారు. ఇఫీ ముగింపు వేడుకల్లో దేశ విదేశాలకు చెందిన సినీ ప్రముఖులు సందడి చేశారు. రష్మిక మందన్న, శ్రియా శరణ్, ప్రతీక్‌గాంధీ, మధుర్ భండార్కర్, హరీశ్ శంకర్, నివేదా థామస్, నిర్మాత దిల్‌రాజు సహా పలువురు సినీ ప్రముఖులు ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ చిత్రోత్సవంలో అక్కినేని నాగేశ్వరరావు, రాజ్‌కపూర్, గాయకుడు మహమ్మద్ రఫీ, దర్శకుడు తపన్‌సిన్హాల శతాబ్ది వేడుకలు నిర్వహించారు.

రాజకీయ శరణార్థిగా గుర్తించండి!

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్‌లో విచారణకు అందుబాటులో ఉంటానని సమాచారం ఇచ్చారు. అధికారులు ఇంటర్‌పోల్ సహకారంతో ప్రభాకర్‌రావును భారత్‌కు రప్పించే ప్రయత్నంలో ఉండగా.. ఆయన ఏకంగా రాజకీయ శరణార్థిగా గుర్తించాలని అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భారత్‌లో తనకు రక్షణ లేదని, అనారోగ్యంతో బాధపడుతున్న తనను కేసుల పేరుతో తెలంగాణ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని అమెరికా ప్రభుత్వానికి తెలిపారు. తెలంగాణలో కీలక హోదాలో పనిచేశానని, ఇప్పుడు కేసుల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. ఆయన విజ్ఞప్తిపై అమెరికా నిఘా వర్గాలు విచారణ జరిపిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

కేంద్రాన్ని ఆశ్రయించనున్న అధికారులు

ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు, నిందితులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. కేసు నమోదైనప్పటి నుంచి ప్రభాకర్‌రావు అమెరికాలో తలదాచుకుంటున్నారు. ఎలాగైనా ఆయన్ను భారత్‌కు రప్పించి విచారించాలని భావించిన అధికారులు.. సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో రెడ్‌కార్నర్ నోటీసు ఇచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ విషయం తెలుసుకున్న ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్న కుటుంబ సభ్యుల సహకారంతో గ్రీన్‌కార్డు పొందినట్లు తెలిసింది. ఇప్పుడు ఏకంగా రాజకీయ శరణార్థిగా గుర్తించాలని అక్కడి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో దర్యాప్తు అధికారులు కేంద్ర విదేశాంగ శాఖను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. అమెరికాలో గ్రీన్ కార్డు పొందినా.. ఇక్కడ పౌరుల భద్రతకు సంబంధించిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నేపథ్యంలో రెడ్‌కార్నర్ నోటీసుతో రప్పించి విచారించేందుకు అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. "ప్రభాకర్‌రావు అమెరికా ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మా దృష్టికి వచ్చింది. అయితే ఈ విషయంలో రాష్ట్ర పోలీసుల ప్రమేయం ఏమీ ఉండదు. అమెరికా నిఘా విభాగం విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటుంది" అని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

శ్రవణ్ కుమార్ కోసం వేట ముమ్మరం..

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ6గా ఉన్న శ్రవణ్ కుమార్‌ను అరెస్ట్ చేసేందుకు అధికారులు గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం శ్రవణ్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన షికాగోలో ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఇంటర్‌పోల్ సహకారంతో పట్టుకునేందుకు చర్యలు వేగవంతం చేశారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు చేసి ఏడాది కావస్తున్న నేపథ్యంలో కేసును ఓ కొలిక్కి తేవడంపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన కొందరిని ప్రశ్నించగా.. మరి కొందరికి నోటీసులు జారీ చేస్తున్నారు.

పులి దాడి.. యువతి మృతి

కాగజ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ యువతిపై శుక్రవారం పులి దాడి చేసింది. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ యువతి ప్రాణాలు కోల్పోయింది. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోహిర్లె లక్ష్మి(22) తోటి మహిళలతో కలిసి నజ్రూల్‌నగర్‌లోని పత్తి చేనులో పని చేసేందుకు శుక్రవారం ఉదయం వెళ్లింది. లక్ష్మి పత్తి ఏరుతుండగా అక్కడే మాటు వేసి ఉన్న ఓ పులి ఆమెపై దాడి చేసి మెడ భాగాన్ని కరించింది. ఈ దాడిని గమనించిన తోటి కూలీలు కేకలు వేయడంతో లక్ష్మిని వదిలేసి పులి పొలాల్లోకి పారిపోయింది. పులి దాడిపై అటవీ శాఖకు సమాచారం ఇచ్చిన గ్రామస్థులు లక్ష్మిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణం విడిచింది. దీంతో స్థానికులు, రాజకీయ పార్టీల నాయకులు కలిసి లక్ష్మి మృతదేహంతో అటవీ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. లక్ష్మి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఐదెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లను నెరవేరుస్తామని అధికారులు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. కాగా, లక్ష్మికి ఏడాదిన్నర క్రితమే వివాహమైంది.

'సరగసీ' మహిళ మృతి.. సర్కారుకు ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

- కేసు సుమోటోగా విచారణకు స్వీకరణ
- నిందితుడు రాజేశ్ బాబు అరెస్టు

న్యూఢిల్లీ, రాయదుర్గం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సరగసీకి సహకరించి ఆర్థిక లబ్ధి పొందుదామని హైదరాబాద్ వచ్చి కామాంధుడి చెర నుంచి తప్పించుకునే క్రమంలో భవనంపై నుంచి పడి ఒడిశాకు చెందిన వివాహిత మరణించిన ఘటన దేశ వ్యాప్తంగా సంచలనమైంది. జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్ఆర్సీ) ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. వివాహిత మృతి ఘటనపై రెండు వారాల్లోగా తమకు సమగ్ర నివేదిక అందజేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఎఫ్ఐఆర్ స్థితిగతులతోపాటు సరగసీ పేరిట మహిళలపై జరుగుతున్న వేధింపులకు సంబంధించి తెలంగాణ పోలీసులకు వచ్చిన ఫిర్యాదుల వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది. వివాహిత మృతిపై మీడియా కథనాల్లోని అంశాలు నిజమైతే మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన తీవ్రమైన అంశాన్ని లేవనెత్తుతాయని కమిషన్ అభిప్రాయపడింది. కాగా, ఈ కేసులో నిందితుడు రాజేశ్‌బాబును అరెస్టు చేసినట్టు శుక్రవారం పోలీసులు ప్రకటించారు. శనివారం అతడిని కోర్టులో హాజరుపరిచే అవకాశం వుంది.

ఐటీ ఉద్యోగ సాధనకు టీసాట్‌లో నేటి నుంచి శిక్షణ

హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో ఉద్యోగాలు సాధించేందుకు కావాల్సిన నైపుణ్యాలపై టీసాట్‌లో ప్రత్యేక ప్రసారాలు చేస్తున్నట్టు టీసాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఐటీ ఉద్యోగాల్లో ప్రధాన భూమిక పోషించే చిప్ డిజైనింగ్, ప్రొడక్షన్ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ప్రత్యేక అవగాహన కల్పించాలని ఈ ప్రసారాలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా శనివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి శనివారం టీ-సాట్ నిపుణ చానల్‌లో మర్నాడు (ఆదివారం) విద్య చానల్‌లో రాత్రి 7-8 గంటలకు కార్యక్రమాలు ప్రసారమవుతాయన్నారు. ఏప్రిల్ 26 వరకు ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దీక్షాదివస్ స్ఫూర్తిగా మరో పోరు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజును గుర్తు చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా దీక్షాదివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ర్యాలీలు, సభలతోపాటు ఆసుపత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్, హైదరాబాద్‌లో కేటీఆర్, సిద్దిపేటలో హరీశ్‌రావు, ఆయా జిల్లాల పరిధిలో మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లో నిర్వహించిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అడ్రస్ లేనోడు, ఉద్యమ సమయంలో మన మీదికి తుపాకీ తీసుకువచ్చినోడు.. ఈ రోజు మనల్ని తిడుతున్నాడని సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. హిమాలయాలంతటి సమున్నతుడైన కేసీఆర్ కాలి గోటికి కూడా రేవంత్‌రెడ్డి సరిపోడన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని, గురుకులంలో ఉండే పిల్లలు కూడా ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వం పెట్టే దిక్కుమాలిన బువ్వతిని విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారని విమర్శించారు. ఈపాటి పరిపాలనకు విజయోత్సవాలా అంటూ ఎద్దేవా చేశారు. పోలీసోళ్లు లేకుండా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఊళ్లకి పోతే ప్రజలు తరిమి కొడతారన్నారు.

కాంగ్రెస్ వల్లే బలిదానాలు

కాంగ్రెస్ పార్టీ కర్కశత్వం వల్ల 2009 నుంచి 2014 వరకు వందలాది మంది పిల్లలు ఆత్మబలిదానాలు చేసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష.. ఉద్యమానికి పతాక సన్నివేశంగా మారిందని, ఆ తర్వాత ఐదేండ్ల పాటు తెలంగాణ కోసం కేసీఆర్ వివిధ రూపాల్లో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడిగా ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చిండని ఇప్పటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ 2001లో తెలంగాణ కోసం పార్టీ పెట్టినపుడు ఆయనకు 46 ఏళ్ళు మాత్రమేనని... ఆయనకు పదవుల మీద మోజు ఉంటే అప్పటి ముఖ్యమంత్రి ఇచ్చిన మంత్రి పదవిని తీసుకొని హాయిగా ఉండేవాడన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరముందని కేటీఆర్ అన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఇప్పుడు తెలంగాణ భవన్ గుర్తుకువస్తోందని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన పోరాటం వల్లే.. లగచర్ల భూముల సేకరణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కు తగ్గిందన్నారు. గుజరాత్ గులాంలు ఓవైపు.. ఢిల్లీ కీలుబొమ్మలు మరోవైపు తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీలను ఉద్దేశించి విమర్శించారు.


తెలంగాణ భవన్ వద్ద లంబాడా మహిళలతో కలిసి దీక్షా దివస్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

ఓవర్ కాన్ఫిడెన్స్ పనికిరాదు: మల్లారెడ్డి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన దీక్షాదివస్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, నాయకులకెప్పుడూ ఓవర్ కాన్ఫిడెన్స్ పనికిరాదని.. ఓవర్ కాన్ఫిడెన్స్ వల్లనే అధికారం పోయిందన్నారు. ప్రజల్లో పైసలు పని చేయవని, నాయకులు కావాలనుకునే వారు ప్రజల ప్రేమ ఆప్యాయతలను సంపాదించాలని, అది సాధిస్తే.. ఇంట్లో కూర్చున్నా జనం ఓట్లేస్తారన్నారు. వరంగల్‌లో జరిగిన దీక్షా దివస్‌లో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. 'ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది.. జమిలి ఎన్నికలు రాబోతున్నాయి. మళ్లీ కేసీఆరే సీఎం అవుతారు. కార్యకర్తలెవరు అధైర్యపడొద్దు' అని చెప్పారు.

అలాంటి దొంగలను మళ్లీ రానివ్వం: హరీశ్‌రావు

సిద్దిపేటలోని బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన దీక్షాదివస్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కొంత మంది బీఆర్ఎస్‌లో చేరి పదేళ్లపాటు పందికొక్కుల్లా తిని ఇప్పుడు పార్టీని వదిలి పోయారని, అలాంటి దొంగలను మళ్లీ రానివ్వబోమని హెచ్చరించారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ నిబద్ధత, నిజాయితీ గురించి కాంగ్రెస్ అగ్రనేతలకు తెలుసని.. మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ తన ఆత్మకథలో కూడా కేసీఆర్ గురించి గొప్పగా ప్రస్తావించారని వివరించారు. బంగారు తెలంగాణగా పరుగులు పెట్టిన రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి ఆగం చేస్తున్నాడని విమర్శించారు.

వ్యవసాయ క్షేత్రాల్లో నిఘా నేత్రాలు

- పంట రక్షణకు ఖమ్మం రైతుల వినూత్న ఆలోచన



అశ్వారావుపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా బ్యాంకులు, కార్పొరేట్ కార్యాలయాలు, ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. కానీ ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలంలో కొందరు రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయ క్షేత్రాల్లో నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. గతంలో పామాయిల్, నర్సరీల్లో చోరీలు జరిగాయని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రక్షించుకోవడానికి సీసీ కెమెరాలను అమర్చుకుంటున్నామని రైతులు చెప్పారు. అశ్వారావుపేట మండలంలోని ఓ పామాయిల్ రైతు సోలార్ పద్ధతి ద్వారా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా.. మారుతినగర్‌లోనూ ఓ నర్సరీలో నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. తాము ఎక్కడ ఉన్నా పనులు పర్యవేక్షించటంతో పాటు చోరీలు జరగకుండా నివారించేలా సీసీ కెమెరాలు అమర్చుకున్నట్లు క్షేత్రాల యజమానులు తెలిపారు.

తెలంగాణ కోసం నేను కూడా దీక్ష చేశా

- మంత్రి పదవిని త్యజించా: మంత్రి కోమటిరెడ్డి



నిజామాబాద్ అర్బన్ / ధర్పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమ సమయంలో తాను కూడా దీక్ష చేశానని, మంత్రి పదవిని సైతం త్యాగం చేశానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. దొంగ దీక్షలతో తెలంగాణ రాలేదని, దీక్షా దివస్ పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ధర్పల్లి, ఇందల్వాయిలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం వెంకటరెడ్డి విలేకరులతో మాట్లాడారు. యువకులు, విద్యార్థుల పోరాట ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందన్నారు. దీక్షా దివస్ జరుపుకునే అవసరం బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చిందని, అందుకే డిసెంబర్ 9న సచివాలయంలో లక్షలాది మంది మహిళలతో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగబోతుందని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనా కాలం 'దోచుకో.. దాచుకో' అన్న రీతిలో సాగిందన్నారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఎక్కడా గుంతలు లేని రహదారులను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లాకు మంజూరైన పసుపు బోర్డు అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్తానన్నారు.

'మత్తు' కేసుల్లో దొరికితే ఆస్తులు సీజ్!

- మూడు కేసుల్లో నిందితుల ఆస్తులు ఫ్రీజ్ చేసిన టీజీ న్యాబ్

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి కేసుల్లో పట్టుబడుతున్న నిందితుల ఆస్తులను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) అధికారులు ఫ్రీజ్ చేస్తున్నారు. హైదరాబాద్ శివారులోని గుమ్మడిదలలో జి.అంజిరెడ్డి అల్ప్రాజోలం విక్రయిస్తుండగా స్థానిక పోలీసులు, టీజీ న్యాబ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి 2.6 కిలోల అల్ప్రాజోలం, రూ.లక్షపైగా నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ అనంతరం మత్తు పదార్థాలు విక్రయించి సంపాదించిన సుమారు రూ.కోటి విలువైన ఆస్తులను టీజీ న్యాబ్ అధికారులు ఫ్రీజ్ చేశారు. మరో కేసులో ఎం.రామకృష్ణ (ఏఆర్ కానిస్టేబుల్) మరికొందరితో కలిసి అల్ప్రాజోలం విక్రయిస్తుండగా రెండుసార్లు అరెస్ట్ చేశారు. కేసుల విచారణ అనంతరం నిందితులు కూడబెట్టిన సుమారు రూ.4.5 కోట్ల విలువైన బ్యాంకు బ్యాలెన్స్, స్థిరాస్తుల్ని ఫ్రీజ్ చేశారు. మరో కేసులో ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలకు ఉపయోగించే మత్తు ఇంజక్షన్లను విక్రయిస్తున్న అనస్థిషియా డాక్టర్ అహసాన్ ముస్తఫా ఖాన్‌తోపాటు మరికొందర్ని అరెస్ట్ చేశారు. నిందితుల ఖాతాల్లో నగదు, ఓపెన్ ప్లాటు, ద్విచక్ర వాహనాలు ఫ్రీజ్ చేశారు.

వైద్య బిల్లుల చెల్లింపునకు సుస్తీ

ఫిబ్రవరిలో సమర్పించినవి ప్రస్తుతం పరిశీలన.. ఉద్యోగుల ఆరోగ్య పథకంలో తీవ్ర ఆలస్యం

- ఆస్పత్రుల ఎంప్యానెల్ రెన్యువల్‌లోనూ కొర్రీలు



హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణలోని ఓ జిల్లాకు చెందిన ఆయన విశ్రాంత న్యాయమూర్తి. ఆయన భార్య కూడా విశ్రాంత న్యాయమూర్తే. తీవ్ర అనారోగ్యానికి గురవగా వైద్యం చేయించారు. ఆ ఖర్చును తిరిగి (రీయింబర్స్‌మెంట్) పొందేందుకు బిల్లులు పెట్టారు. కానీ, వైద్య విద్య సంచాలకుడి (డీఎంఈ) కార్యాలయం సిబ్బంది ఎన్ని నెలలైనా పరిశీలించలేదు. పలుసార్లు తిరిగినా ప్రయోజనం లేకపోగా నిర్లక్ష్య సమాధానం వచ్చింది. దీంతో ఆ విశ్రాంత న్యాయమూర్తి.. ఓ ఐఏఎస్‌ను సాయమడిగారు. ఆయన పలుసార్లు డీఎంఈ కార్యాలయానికి ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోయింది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు ఆస్పత్రి.. ఉద్యోగుల చికిత్సల అనుమతి పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకుంది. కానీ, ఫైర్ ఎన్‌వోసీ లేదని తిరస్కరించారు. నిబంధనల మేరకు 15 మీటర్ల లోపు ఎత్తున్న భవనాలకు ఈ ఎన్‌వోసీ అవసరం లేదు. కానీ, డీఎంఈ తిరస్కరించారు. దీంతో ఈ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఉద్యోగులకు చెల్లింపులు నిలిచిపోయాయి.

పై రెండు ఉదాహరణలు డీఎంఈ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎంతటి అత్యవసర విషయాలనైనా పట్టించుకోరన్న ఆరోపణలు వస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లేదా ఆరోగ్య శాఖ కార్యదర్శి అడిగితే తప్ప చేయని పరిస్థితి నెలకొంది. కొన్నిసార్లు వారు చెప్పిన అత్యవసర ఫైల్స్‌నూ రోజుల కొద్దీ జాప్యం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇంచార్జి డీఎంఈ డాక్టర్ వాణి, అకడమిక్ ఇంచార్జి డాక్టర్ శివరాంప్రసాద్ ఏ విషయంలోనూ త్వరిత నిర్ణయాలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. వీరిపై మంత్రి, ఆరోగ్య శాఖ కార్యదర్శి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

రిటైరైన, పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఏదైనా ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటే.. రూ.50 వేలలోపు బిల్లులను జిల్లా అధికారులే మంజూరు చేస్తారు. మించితే డీఎంఈకి పంపుతారు. అన్నిటినీ పరిశీలించి ఎంత ఇవ్వాలో కార్యాలయ వైద్యులు నిర్ణయిస్తారు. ఇక్కడ రూ.2లక్షల వరకు మంజూరు చేయొచ్చు. అది దాటితే ప్రభుత్వానికి పంపుతారు. రాష్ట్రవ్యాప్తంగా రోజూ 100-150 దరఖాస్తులు డీఎంఈకి వస్తాయి. కాగా, సకాలంలో పరిష్కరించకపోవడంతో పేరుకుపోయాయి. ఫిబ్రవరిలో ఇచ్చిన బిల్లులను ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు డీఎంఈ చుట్టూ తిరగలేక నరకయాతన అనుభవిస్తున్నారు. వైద్య బిల్లులను ఆన్‌లైన్ చేయాలని, పరిశీలనను ఆరోగ్య శ్రీ కార్యాలయానికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినా అమలు కావడానికి కొన్ని నెలలు పట్టేలా ఉంది.

రెన్యూవల్‌లో ద్వంద్వ వైఖరి

ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందవచ్చు. ప్రైవేటు ఆస్పత్రులు కచ్చితంగా ఎం-ప్యానెల్ అయి ఉండాలి. డీఎంఈ కార్యాలయం ఇచ్చే ఈ అనుమతిని గడువు ముగియకముందే పునరుద్ధరించుకోవాలి. ప్రస్తుతం పదుల కొద్దీ ప్రైవేటు ఆస్పత్రులు డీఎంఈ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. ఎప్పటికప్పుడు చేయాల్సి ఉన్నా నిబంధనల సాకు చూపి దాటవేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రి 15 మీటర్ల మించి ఎత్తు ఉండి, అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం లేకున్నా అనుమతిని పునరుద్ధరించారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో ప్రైవేటు ఆస్పత్రి భవనం 15 మీటర్ల లోపు ఎత్తున్నా తిరస్కరించారు. దీంతో ఆస్పత్రుల యాజమాన్యాలు విసుగెత్తాయి. ఇలాగైతే చికిత్సలు చేయలేమని తేగేసి చెబుతున్నాయి. మంత్రి దామోదరను కలిసి ఫిర్యాదు చేసే ఉద్దేశంలో ఉన్నాయి.

సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్‌గా టీవీవీపీ..?

- కొడంగల్, సుల్తాన్‌పూర్‌లో సైన్స్ కేంద్రాలు: మంత్రి దామోదర



హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ విభాగంగా మార్చాలని సర్కారు భావిస్తోంది. వచ్చే మంత్రి మండలి సమావేశంలో దీనికి ఆమోద ముద్ర వేసే అవకాశం కనిపిస్తోంది. దీనిపై అధికారులు రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. శుక్రవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలోని ప్రాథమిక ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై మంత్రి చర్చించారు. సీజనల్ వ్యాధులు విస్తరించకుండా ప్రాథమిక ఆసుపత్రులలో అవసరమైన సిబ్బంది, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కాగా, కొడంగల్, సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ క్యాంపస్‌లలో ప్రతిష్ఠాత్మక సైన్స్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జీవో జారీ చేసింది. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో అండర్ కేటగిరిలో ఒక్కో సైన్స్ కేంద్రాన్ని రూ.6.65 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు ఆ జీవోలో పేర్కొంది. ఈ సైన్స్ సెంటర్లు విద్యార్థులకు ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, అండ్ ఐటీ రంగాలలో ఉన్న విద్యార్థులు తమ ప్రతిభను మెరుగు పరుచుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. కాగా, మంత్రి రాజనర్సింహతో భారత్‌లోని తుర్కియే రాయబారి ఫిరాట్ సునెల్ సచివాలయంలో సమావేశమయ్యారు. మెడికల్ ఫ్యాకల్టీ, మెడికల్ మౌలిక సదుపాయాల కల్పనలో సహకారంపై చర్చించారు.

ఊపిరితిత్తుల రక్తనాళాల్లో అడ్డంకులు!

- 20 ఏళ్ల యువకుడికి ప్రాణాపాయ పరిస్థితి
- 'పల్మనరీ థ్రోంబెక్టమీ' చికిత్సతో స్వస్థత చేకూర్చిన యశోద ఆస్పత్రి వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రక్తంలో ఏర్పడిన గడ్డలు (బ్లడ్‌క్లాట్స్) ఊపిరితిత్తుల ధమనులను అడ్డుకోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరిన ఓ యువకుడికి.. యశోద ఆస్పత్రి వైద్యులు అత్యాధునిక 'ఇనారీ మెడికల్ డివైస్ పల్మనరీ థ్రోంబెక్టమీ' చికిత్స జరిపి స్వస్థత చేకూర్చారు. కరీంనగర్ జిల్లాకు చెందిన 20 ఏళ్ల విద్యార్థి మాలి రిషికేష్‌కు.. గుండె నుండి ఊపిరితిత్తులకు రక్తాన్ని తీసుకువెళ్లే ధమనుల్లో బ్లడ్ క్లాట్స్ వల్ల ఊపిరితిత్తులకు రక్త ప్రవాహం నిలిచిపోయింది. దీంతో 'పల్మనరీ ఎంబోలిజం' అనే సమస్య ఏర్పడి, తీవ్రమైన అస్వస్థతతో చికిత్స కోసం యశోద ఆస్పత్రిలో చేరాడు. అతనికి వైద్యులు ఆధునిక చికిత్స అందించి బ్లడ్‌క్లాట్స్ తొలగించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పల్మనరీ ఎంబోలిజం అనేది గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లాంటిదేనని, కాళ్లకు సంబంధించిన రక్తనాళాల్లో ఏర్పడే బ్లడ్ క్లాట్స్ రక్తప్రవాహం ద్వారా ఊపిరితిత్తులకు చేరుకొని ధమనులను అడ్డుకుంటాయని యశోద ఆస్పత్రుల గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి వివరించారు.



పేషంట్ రిషికేష్‌తో యశోద ఆస్పత్రి వైద్యులు

ఫలితంగా గుండె ఆగిపోవడం, ఊపిరితిత్తుల స్ట్రోక్, గుండె వైఫల్యం, క్రానిక్ థ్రోంబోఎంబాలిక్ పల్మనరీ హైపర్‌టెన్షన్, పల్మనరీ ఎంబోలిజం షాక్ వంటి తీవ్రమైన ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయవచ్చునన్నారు. రిషికేష్ విషయంలో కూడా ఇదే జరిగిందన్నారు. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సీ రఘు మాట్లాడుతూ.. మెకానికల్ థ్రోంబెక్టమీ ద్వారా ఊపిరితిత్తుల నుండి బ్లడ్ క్లాట్స్‌ను తొలగించడం వల్ల పేషెంట్ వేగంగా కోలుకోవడం, తక్కువ సమయం ఐసీయూలో ఉండటం, రక్తస్రావం సమస్యలు, పల్మనరీ హైపర్‌టెన్షన్ తదితర దీర్ఘకాలిక సమస్యలు తగ్గుతాయన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి: జాజుల

మంచిర్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస గౌడ్ డిమాండ్ చేశారు. ప్రధాని బీసీ అయి ఉండి కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని, కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. ఈనెల 6వ తేదీ నుంచి శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కులగణన చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బీసీ గణన చేపట్టడం లేదని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడం లేదని, మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా పెట్టలేదని అన్నారు. దేశవ్యాప్తంగా జాతి జనగణన, బీసీల డిమాండ్ల సాధన కోసం ఉద్యమం చేపట్టనున్నట్లు జాజుల తెలిపారు. రాష్ట్రంలో బీసీలను రాజకీయ పోరాటానికి సిద్ధం చేసే దిశగా బీసీ రథయాత్ర చేపడతామని తెలిపారు.

పోటీపై అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం: జీవన్‌రెడ్డి

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఎవరుంటారనే నిర్ణయం తీసుకునేది కాంగ్రెస్ అధిష్ఠానమేనని, ఇందులో తన వ్యక్తిగత నిర్ణయం ఏం ఉండదని సిటింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలోని స్థానిక ఇందిరాభవన్‌లో సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ తాను పోటీ చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని అధిష్ఠానానికి టీపీసీసీ తీర్మానించి నివేదించిందన్నారు. నివేదిక పరిశీలన తర్వాత హైకమాండ్ నిర్ణయం మేరకే పోటీలో ఎవరు ఉంటారనేది స్పష్టమవుతుందని వెల్లడించారు. అధిష్ఠానం నిర్ణయించిందే పార్టీ అమలు చేయాల్సి ఉంటుందన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం పేరు మార్పు!

హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం పేరును డా. బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ సంఘంగా మార్చుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సచివాలయ సంఘంలో పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని, 2024 డిసెంబరులోగా ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేశారు. మూడు సంవత్సరాల కంటే తక్కువ సర్వీసు ఉండే ఉద్యోగులు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. డిసెంబరు 2న సమావేశమై ఎన్నికల షెడ్యూల్‌పై నిర్ణయం చర్చిస్తామని అధికారులు తెలిపారు. ఎన్నికల అధికారిగా అదనపు కార్యదర్శి ఎన్. శంకర్‌ను నియమించారు.

మాలల ఆత్మగౌరవం కోసమే సింహగర్జన

» ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడలేదు: వివేక్

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న తాము నిర్వహిస్తున్న 'మాలల సింహగర్జన' సభ ఎవరికీ వ్యతిరేకం కాదని కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఈ సభ నిర్వహణ కోసం జిల్లాల వారీగా తాము చేస్తున్న కార్యక్రమాల్లో ఎక్కడైనా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడామా అని ప్రశ్నించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడనప్పుడు తనపై చర్యలు ఎలా ఉంటాయన్నారు. ఈ మేరకు శుక్రవారం మీడియాతో వివేక్ మాట్లాడారు. ఎస్సీలకు సంబంధించి ఇటీవల సుప్రీం ఇచ్చిన తీర్పు మాదిగ, మాలల రిజర్వేషన్లకే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది మాలలు ఉన్నారని, తమ జాతి ఆత్మగౌరవం, గుర్తింపు కోసమే మాలల సింహగర్జన సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణను తామేమీ అడ్డుకోవడం లేదన్నారు.

ఆ 40 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి

» తీర్మానం చేసిన బీసీ కమిషన్

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వెనుకబడిన తరగతుల జాబితాలో ఉండి, ఓబీసీలో లేని 40 కులాలను వెంటనే కేంద్రజాబితాలో చేర్చాలని రాష్ట్ర బీసీ కమిషన్ తీర్మానించింది. ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన బహిరంగ విచారణల్లో కమిషన్‌కు వచ్చిన వినతులను శుక్రవారం ఖైరతాబాద్ కార్యాలయంలో సమీక్షించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర బీసీ జాబితాలో 130 కులాలు ఉండగా, కేంద్ర ఓబీసీ జాబితాలో రాష్ట్రానికి చెందిన 90 కులాలు మాత్రమే ఉన్నాయని గుర్తించింది. రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చబడిన 40 కులాలను కేంద్ర జాబితాలో చేర్చేందుకు రాష్ట్రం నుంచి గతంలోనే ప్రతిపాదనలను పంపినప్పటికీ ఇప్పటికీ కేంద్రం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని కమిషన్ పేర్కొంది. మరోవైపు రాష్ట్రంలోని దొమ్మర, పిచ్చకుంట్ల, బుడబుక్కల, తమ్మలి తదితర కులాల పేర్లను మార్చాలంటూ వచ్చిన వినతుల పట్ల కమిషన్ సానుకూలంగా ఉందని తెలిపింది.

కుట్రంతా కేసీఆర్‌దే..

» నాటి మంత్రి తలసాని కోసం రైతులను ముంచే యత్నం..

» నిబంధనలకు విరుద్ధంగా ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు

» ముఖ్యమంత్రి కార్యాలయం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతుల్లో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ కుట్ర చేశారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులకు కేటాయించిన ఈ ఫ్యాక్టరీ కోసం కేసీఆర్ నిబంధనలు ఉల్లంఘించి ఆగమేఘాలపై అనుమతులిప్పించారని వెల్లడించింది. నాడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు, ఉల్లంఘించిన నిబంధనలపై సీఎంవో శుక్రవారం నిలదీసింది. కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి లేకుండానే కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వ మంత్రిమండలి ఆమోదించిందని, ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని తెలిపింది. 'తలసాని కుటుంబానికి లబ్ధి చేసేందుకు దిలావర్‌పూర్ రైతులను ముంచేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఫ్యాక్టరీకి అడ్డగోలుగా అనుమతులిచ్చింది. స్థానిక గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) తీసుకోకుండా ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభించేలా అనుమతించడం సీఎం హోదాలో కేసీఆర్ అధికార దుర్వినియోగానికి నిదర్శనం. పర్యావరణ సమస్యలు అధికంగా ఉండే రెడ్ జోన్‌లో ఈ పరిశ్రమ ఉన్నప్పటికీ.. అనుమతులు ఇచ్చి స్థానికులను మోసం చేసింది' అని సీఎంవో వెల్లడించింది.



శాలిబండ పోలీస్‌స్టేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

చాంద్రాయణగుట్ట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మండలం ఛత్రినాక ఏసీపీ డివిజన్ పరిధిలోని శాలిబండ పోలీస్ స్టేషన్ జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా శాలిబండ పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉండడంతో దేశంలో 8వ ఉత్తమ పోలీసు స్టేషన్‌గా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ ఛత్రినాక సీహెచ్ చంద్రశేఖర్‌లు శాలిబండ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. శాలిబండ పోలీస్ స్టేషన్ దేశంలో 8వ ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా నిలవడం అభినందనీయమన్నారు.

కాంగ్రెస్ 6 గ్యారంటీలపై రేపు బీజేపీ చార్జిషీటు

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఆరు గ్యారంటీల గారడీ అంటూ బీజేపీ చార్జిషీటు విడుదల చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన 6 అబద్ధాలు.. 66 మోసాలు అని పేర్కొంటూ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని బీజేపీ నిర్ణయించింది. ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపింది. బాధితులు తమ ఫిర్యాదులను 9240015427 నెంబరుకు కాల్ చేయాలని కోరింది. ఈ మేరకు ప్రత్యేక కరపత్రాన్ని రూపొందించింది. రుణమాఫీ, రైతు భరోసా, పంటల బోనస్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, రూ. 2,500 ఆర్థిక సాయం, రూ. 4 వేల పింఛన్, ఇందిరమ్మ ఇల్లు అందనివారు, మూసీ, హైడ్రా, ఫార్మాసిటీ, పోలీసు దౌర్జన్యాలు బాధితుల పేరిట రెండు క్యాటగిరీలలో ఫిర్యాదులు స్వీకరించనున్నారు.

ఫార్మా క్లస్టర్ రద్దు!

(మొదటిపేజీ తరువాయి)



భావిస్తోంది. లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయబోవడం లేదని ఇటీవలే తనను కలిసిన వామపక్ష నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. ఆయన చెప్పినట్లుగానే అది ఇప్పుడు కార్యరూపం దాల్చుతోంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల, రోటిబండ తండా, పులిచర్ల తండా, హకీంపేట్, పోలేపల్లిల్లో 1,359 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలని ఈ ఏడాదే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపాదించింది. మొదట రెండు తండాలతో కూడిన లగచర్లలో 580 మంది రైతుల నుంచి 632 ఎకరాల భూములను సేకరించేందుకు గత ఆగస్టు నెలలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఫార్మా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు భూములు ఇచ్చేది లేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. గత ఆరేడు నెలలుగా ఆందోళనలు, నిరసనలు కొనసాగిస్తూ వచ్చారు. భూసేకరణ కోసం పలుమార్లు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభల్లో రైతులు తమ భూములు ఇచ్చేది లేదంటూ తేల్చి చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఈ నెల 11న లగచర్లలో గ్రామసభ నిర్వహించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిలపై అక్కడి రైతులు, ఇతర గ్రామాల ప్రజలు దాడి చేశారు. రైతులతో మాట్లాడేందుకు వచ్చిన అధికారులను తరుముతూ రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. వారి వాహనాలను ధ్వంసం చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లను కడా ప్రత్యేకాధికారి వాహనంలో అక్కడి నుంచి పంపించివేయగలిగారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను రక్షించేందుకు ప్రయత్నించిన వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పైన కూడా దాడి చేశారు. ఈ ఘటన వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందని, ప్రధానంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఉన్నారని పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు మరో 28 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. లగచర్ల ఘటన రాజకీయ రంగు పులుముకుంది. అధికార, విపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగాయి. బీఆర్ఎస్ నేతలు బాధిత రైతుల కుటుంబాలను తీసుకొని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్‌లను కలిసి పోలీసులపై ఫిర్యాదు చేశారు. కేటీఆర్ వారితో పాటు ఢిల్లీకి వెళ్లి జాతీయ ఎస్సీ, ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్లకు ఫిర్యాదు చేశారు. ఫార్మా విలేజ్ రద్దు చేయాలని, తమ భూములు తమకే ఉండేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రతినిధుల బృందం లగచర్ల, రోటిబండ తండా గ్రామాల్లో పర్యటించి విచారణ జరిపారు. గ్రామస్థులతో పాటు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి, విద్యుత్, పోలీసు అధికారులను కూడా విచారించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల ప్రతినిధులు బాధిత రైతుల కుటుంబాలతో మాట్లాడి తమ పర్యటనలో పరిశీలించిన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ నెల 11 నుంచి చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూసేకరణ చట్టం 2013లోని సెక్షన్ 11 ప్రకారం జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ గజిట్ నెం.07/2024, తేదీ: 01-08-2024ను సెక్షన్ 93 ప్రకారం ఉపసంహరించుకున్నట్లు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), భూసేకరణ అధికారి/సబ్ కలెక్టర్ - తాండూరు ప్రకటన జారీ చేశారు.

రద్దు హర్షణీయం: సీపీఎం

భూసేకరణ ప్రకటనను ప్రభుత్వం ఉపసంహరించుకోవడంపై సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. రద్దు నిర్ణయానికి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన కృషే కారణమని, ఇది లగచర్ల ప్రాంత ప్రజల విజయం అని తెలిపింది. నవంబరు 21న వామపక్ష ప్రతినిధుల బృందం లగచర్ల, పరిసర గ్రామాల్లో పర్యటించిందని, వాస్తవాలను 23న సీఎం రేవంత్‌ని కలిసి వివరించామని వెల్లడించింది. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు ప్రతిఘటించారని, తక్కువ ధరతో భూములు లాక్కునే పద్ధతిని వ్యతిరేకించారని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు.

లగచర్ల రైతుల బెయిల్ పిటిషన్ వాయిదా

లగచర్ల ఘటనలో అరెస్టయి సంగారెడ్డి జిల్లాలో రిమాండ్‌లో ఉన్న రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా పడింది. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో రైతుల పక్షాన బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు ఇదివరకే వాదనలు వినిపించారు. ధ్రువపత్రాలు సమర్పించేందుకు గడువు కావాలన్న ప్రాసిక్యూషన్ విజ్ఞప్తి మేరకు పిటిషన్ వాయిదా వేయగా శుక్రవారం విచారణకు వచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సెలవులో ఉండడంతో సోమవారానికి వాయిదా వేశారు.



ఇంటర్నల్ మార్కులు ఈసారికి యథాతథం

» వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు


» పదో తరగతి పరీక్షలపై ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఇంటర్నల్ మార్కులను రద్దు చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వచ్చే ఏడాదికి వాయిదా వేసింది. రద్దు నిర్ణయాన్ని ఈ ఏడాది అమలు చేయడం లేదని, వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి దీనిని అమలు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం.. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 80% మార్కులు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు 20% మార్కులను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇంటర్నల్ మార్కులను రద్దు చేస్తున్నట్లు, ఇకపై కేవలం వార్షిక పరీక్షలల్లో వచ్చే మార్కుల ఆధారంగానే గ్రేడింగ్ ఇస్తామని ప్రభుత్వంగురువారం ప్రకటించింది. ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని కూడా తెలిపింది. కానీ, వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఇప్పటికే 80% మార్కుల విధానం ప్రకారం సిద్ధమవుతుండడం, దాదాపుగా సిలబస్ పూర్తయి.. పరీక్షలకు ప్రిపరేషన్ మొదలు పెట్టిన నేపథ్యంలో ఇంటర్నల్ మార్కుల విషయంలో ప్రభుత్వం పునరాలోచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు కొత్త నిర్ణయాన్ని అమలు చేస్తే.. విద్యార్థులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం కావడం కూడా ఇందుకు కారణమైనట్లు సమాచారం.

లగచర్ల ఘటనపై ఒక ఎఫ్ఐఆర్ చాలు

» పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్/వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్ నెంబర్ 153కి మాత్రమే పోలీసులు పరిమితం కావాలని శుక్రవారం హైకోర్టు స్పష్టం చేసింది. భూసేకరణ నిమిత్తం విచారణకు వచ్చిన కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేసిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని ఏ-1గా చేర్చుతూ తొలుత బొంరాస్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అదే ఘటనలో దాడికి గురైన వేర్వేరు అధికారులు ఇచ్చిన ఫిర్యాదులతో అదనంగా మరో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే నేరంపై అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున న్యాయవాది టీవీ రమణారావు వాదిస్తూ.. ఒకే నేరానికి అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకూడదంటూ సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చిందని, 'తీన్మార్ మల్లన్న' కేసులోనూ ఇదే ధర్మాసనం దీన్ని పాటించిందని గుర్తుచేశారు. ప్రభుత్వం తరపున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదిస్తూ.. చివరి రెండు ఎఫ్ఐఆర్‌ను విలీనం చేయవచ్చని, దాంతో మొత్తం రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లవుతుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఒకే నేరంపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయరాదని చాలా స్పష్టమైన తీర్పులు ఉన్నందున మొదటిదానినే కొనసాగించాలని తెలిపింది. ఆ తరువాత నమోదు చేసిన రెండింటిని నిలిపివేయాలని పేర్కొంది. దీంతో పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించినట్టయింది.



వేలిముద్ర పడకున్నా అవ్వాతాతలకు పింఛను

» పంచాయతీ కార్యదర్శుల వేలిముద్రతో.. లబ్ధిదారుల గుర్తింపు, నగదు పంపిణీ

» వయోవృద్ధుల సమస్యకు పరిష్కారం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వయోభారంతో బాధపడుతూ ప్రభుత్వం అందించే చేయూత పింఛన్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు రాష్ట్రంలో ఎందరో ఉన్నారు. వీరంతా తమకు సమీపంలోని పోస్టాఫీసుకు వెళ్లి వేలిముద్ర ద్వారా తమ గుర్తింపును నిరూపించుకుని పింఛను సొమ్ము పొందుతారు. కంప్యూటర్‌తో అనుసంధానమైన యంత్రాలు ఒక వేళ వేలిముద్రను గుర్తించకపోతే పింఛను లేనట్టే. ఆ యంత్రం వేలిముద్రను గుర్తించే దాకా రోజులైనా సరే వేచి ఉండాల్సిందే. రాష్ట్రంలో చాలా మంది వృద్ధులు, మంచానికి పరిమితమైన వారు ఈ వేలిముద్ర సమస్య వల్ల అవస్థలు పడుతున్నారు. వృద్ధులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను గుర్తించిన గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (ఎస్ఈఆర్‌పీ) ఓ పరిష్కారాన్ని ఆలోచించింది. ఎవరైనా వృద్ధుల వేలిముద్రను యంత్రాలు గుర్తించకపోతే.. పంచాయతీ కార్యదర్శులు తమ వేలిముద్ర నమోదు చేసి పింఛను సొమ్మును లబ్ధిదారుకు ఇచ్చే అవకాశం కల్పించింది. అనారోగ్యంతో బాధపడుతూ ఇల్లు వదిలి రాలేని స్థితిలో ఉన్న లబ్ధిదారుల అంశంలోనూ పంచాయతీ కార్యదర్శులకు ఈ అధికారం ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సెర్ప్ సీఈఓ డి.దివ్య శుక్రవారం జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియను అమలు చేయాలని డీఆర్డీవోలకు ఆమె సూచించారు. ఈ విధానం విజయవంతమైతే వృద్ధాప్య పింఛన్ల పంపిణీలో ప్రధాన సమస్య మాయమైనట్టే!!

రెండు మెడికల్ కాలేజీల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

» పీజీ మెడికల్ సీట్ల బ్లాక్‌పై కన్నెర్ర

» చల్మెడ, ఎంఎన్ఆర్ కాలేజీలకు షాక్

హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మేనేజ్‌మెంట్ కోటాలో పీజీ మెడికల్ సీట్లను బ్లాక్ చేసిన కేసులో చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీలకు చెందిన రూ.5.34 కోట్ల మేరకు ఆస్తులను ఈడీ తాత్కాలికంగా అటాచ్ చేసింది. పీజీ నీట్‌లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటాలోని పీజీ సీట్లను తరచూ బ్లాక్ చేస్తున్నారంటూ వరంగల్ జిల్లా మట్వాడ పోలీస్ స్టేషన్లో కాళోజీ నారాయణరావు వర్సిటీ రిజిస్ట్రార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఈడీ దర్యాప్తులో ఆ విద్యార్థుల్లో కొందరు తాము మేనేజ్‌మెంట్ కోటా కింద పీజీ సీటు కోసం దరఖాస్తే చేసుకోలేదని వెల్లడించారు. కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు కన్సల్టెంట్లు, మధ్యవర్తులతో కుమ్మక్కై పీజీ నీట్‌లో అత్యధిక మార్కులు సాధించిన కొందరు విద్యార్థుల సర్టిఫికెట్లను వినియోగించి మేనేజ్‌మెంట్ కోటా సీట్లను బ్లాక్ చేసినట్లుగా ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. దీంతో ఈ కేసుకు సంబంధించి చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు సంబంధించి రూ. 3.33 కోట్లు, ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీకి సంబంధించి రూ. 2.01 కోట్ల మేరకు ఆయా కాలేజీల బ్యాంకు ఖాతాల్లో ఉన్న బ్యాలెన్స్‌ను ఈడీ తాత్కాలికంగా అటాచ్ చేసింది.

పెరిగిన ఎయిడ్స్ కేసులు

» రాష్ట్రంలో ఈ ఏడాది 10,754 కేసులు

» మిజోరం తర్వాత రాష్ట్రంలోనే ఎక్కువ

» హైదరాబాద్‌లో అత్యధికంగా నమోదు

రేపు (డిసెంబరు 1) ప్రపంచ ఎయిడ్స్ దినం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఈ ఏడాది హెచ్ఐవీ పాజిటివ్ కేసులు పెరిగాయి. ప్రధానంగా మూడు, నాలుగు జిల్లాల్లో కేసుల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. అయితే, మెజారిటీ జిల్లాల్లో నాలుగేళ్ల క్రితం నమోదైన కేసులతో పోల్చితే.. ప్రస్తుతం వ్యాప్తి రేటు మాత్రం తక్కువగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఏయిడ్స్ కంట్రోల్ సొసైటీ గణాంకాలు చెబుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 11.95 లక్షల మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా.. 10,754(0.89%) మందికి పాజిటివ్ వచ్చింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 7,78,020 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేయగా.. 10,651(1.36%) మందికి పాజిటివ్ వచ్చింది. 2018లో నేషనల్ ఏయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) లెక్కల ప్రకారం.. ఎయిడ్స్ వ్యాప్తిలో మిజోరం దేశంలో మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ రెండో స్థానంలో ఉంది. ఆ ఏడాది తెలంగాణలో కొత్తగా 11,820 కేసులు నమోదయ్యాయి. 2019-20 కేసులతో పోల్చితే ఈ ఏడాది 103 కేసులు ఎక్కువగా నమోదయ్యాయి.

పాలమూరులో వ్యాప్తి రేటు ఎక్కువ

రాష్ట్రంలో హెచ్ఐవీ వ్యాప్తి రేటు మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాల పరంగా చూసినా కూడా తెలంగాణలో అత్యధిక పాజిటివ్ రేటు అక్కడే రికార్డు అయింది. గత ఆర్థిక సంవత్సరంలో 1.73 శాతం వ్యాప్తిరేటుతో పాలమూరు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. నాలుగేళ్ల క్రితం ఈ రేటు 2.75 శాతంగా ఉండడం గమనార్హం. ఆ తర్వాత 1.66% వ్యాప్తి రేటుతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. అత్యధిక కేసుల విషయానికొస్తే హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. రాజధానిలో నాలుగేళ్ల క్రితం 1944 హెచ్ఐవీ పాజిటివ్‌లు నమోదు కాగా.. 2023-24లో 2043 కేసులు వచ్చాయి. హైదరాబాద్ తర్వాత రెండో స్థానంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉంది. మొత్తంగా చూస్తే రాష్ట్రంలో ఎయిడ్స్ ప్రభావం మెల్లమెల్లగా తగ్గుతున్నట్టు కనిపిస్తున్నా.. కొన్ని జిల్లాల్లో మాత్రం కేసులు ఇంకా అలాగే ఉంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, ఉమ్మడి మహబూబ్ నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో కేసుల సంఖ్య పెరుగుతోంది. జాతీయ రహదారులు ఆ జిల్లాల గుండా వెళ్లడంతో పాటు.. ఇంకా అక్కడి జనాభాకు ఎయిడ్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు. కాగా.. పలు జిల్లాల్లో హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయినవారిలో కొంత మంది ఆ తర్వాత వైద్య శాఖ కన్నుగప్పి తప్పించుకుంటున్నారు. ఉదాహరణకు హైదరాబాద్‌లో 2043 కేసులు రాగా, అందులో 1982 మందే రిట్రో థెరపీ వైద్య సేవలు పొందుతున్నారు. మిగతా 51 మందిని ట్రేస్ చేయలేక వైద్యశాఖ సిబ్బంది బాగా ఇబ్బంది పడుతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 544 మంది రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సిబ్బందికి దొరకడం లేదు.

అప్పుడెన్ని? ఇప్పుడెన్ని?

నాలుగేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలవారీగా కేసులు...

ఉమ్మడి జిల్లాలు	2019-20లో కొత్త కేసులు	పాజిటివ్ రేటు (%)	2023-24లో కొత్త కేసులు	పాజిటివ్ రేటు (%)
ఆదిలాబాద్	440	0.63	327	0.26
హైదరాబాద్	1944	1.84	2043	1.66
కరీంనగర్	713	1.23	593	0.99
ఖమ్మం	988	0.92	918	0.46
మహబూబ్‌నగర్	1407	2.03	1597	1.73
మెదక్	1097	1.74	1187	0.94
నల్గొండ	1180	1.75	1081	0.85
నిజామాబాద్	808	1.26	852	0.69
రంగారెడ్డి	1312	1.64	1012	1.45
వరంగల్	762	0.82	816	0.65
	10651	1.37	10754	0.89

బీఆర్ఎస్ పనైపోయింది..

» కాంగ్రెస్ సర్కారు రావడానికి గ్రామస్థాయి నేతలే కారణం

» స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించిన వారికి పదవులు: మహేశ్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ గౌడ్

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందంటే అది గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమేనని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీని గెలిపించడానికి కృషి చేయాలని గ్రామస్థాయి నేతలకు సూచించారు. ఈ ఎన్నికల్లో పార్టీని గెలిపించిన వారికి పదవులు దక్కుతాయన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమళ్ల సిద్ధేశ్వర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడారు. గ్రామ పంచాయతీలంటే రాజీవ్‌గాంధీకి చాలా ఇష్టమని, రాజ్యాంగానికి ఆయన 73, 74 సవరణలు తెచ్చి గ్రామాలకు హక్కులు కల్పించారన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో అనేక మంది సర్పంచులు ఆత్మహత్యలూ చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లోపు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఓ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశాన్ని కాంగ్రెస్ కాపాడుతుంటే.. బీజేపీ అమ్మేస్తోందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీని గెలిపించి సంస్థను ఇంకా బలోపేతం చేయాలన్నారు. సంఘటన్ జాతీయ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ మాట్లాడుతూ.. తెలంగాణలో పంచాయతీ రాజ్ సంఘటన్ చాలా బలంగా పని చేస్తోందని, జాతీయ స్థాయిలో తీసుకున్న అన్ని నిర్ణయాలను ఇక్కడ ఆచరణలో పెట్టారని కితాబిచ్చారు. స్పౌజ్ బదిలీలపై ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా ఇంకా అవి అమల్లోకి రాలేదని, వెంటనే అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మహేశ్‌గౌడ్‌ను ఉపాధ్యాయులు కోరారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని మహేశ్‌గౌడ్ వారికి హామీనిచ్చారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం: కుంభం అనిల్

మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వనుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ వెల్లడించారు. సీఎల్పీ మీడియా హాల్లో ఆయన మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళనపైన హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత కూడా హరీశ్‌రావు అబద్ధాలు చెబుతున్నాడని మండిపడ్డారు. ఇప్పటిదాకా మూసీ ప్రక్షాళనకు సంబంధించి ఒక్క ఇంటిని కూడా కూల్చలేదని, కొందరు స్వచ్ఛందంగా ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్తున్నారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వివిధ ప్రాజెక్టుల కోసం భూసేకరణలో హరీశ్ చేసిన దాష్టీకాలు అన్నీ, ఇన్నీ కావన్నారు. గత ప్రభుత్వ హయాంలో 36 మంది గురుకులాల విద్యార్థులు పాముకాటుకు గురై మరణించినప్పుడు, అజీర్తితో అనేక మంది ఆసుపత్రి పాలైనప్పుడు పట్టించుకున్నారా అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ నిలదీశారు. గురుకులాల్లో కాస్మొటిక్, డైట్ చార్జీల పెంపుతో ప్రభుత్వం పట్ల విద్యార్థుల్లో పెరుగుతున్న అభిమానం చూసి తట్టుకోలేకే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, అందుకే అధ్యక్ష పదవి కోసం గోబెల్స్ ప్రచారంలో పోటీ పడుతున్నారని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో పర్యాటక, రోడ్ల అభివృద్ధి, ఎంబీసీ, మత్స్య కార్పొరేషన్ల చైర్మన్లు పటేల్ రమేశ్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, జైపాల్, సాయికుమార్ మాట్లాడుతూ.. రేవంత్ నాయకత్వాన్ని బలహీన పరిచేందుకు కుట్రలు పన్నుతున్నారని ఫైర్ అయ్యారు. సర్కారు చేసే మంచి పనులపై సోషల్ మీడియాలో బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని.. ఇందుకు నెలకు రూ.3 కోట్లు ఖర్చు చేస్తోందని ఆరోపించారు.

ఫుడ్ పాయిజన్ వెనుక బీఆర్ఎస్ కుట్ర :సీతక్క

» ఎక్కడో ఓ చోట జరిగితే... రాద్ధాంతమా: మంత్రి పొన్నం

కొత్తగూడ, కొండపాక, ములుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఆహార కల్తీ వెనుక పెద్దకుట్ర జరుగుతోందని, రాజకీయం కోసం విద్యార్థులను బలి తీసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించాలనే ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందన్నారు. మెస్‌చార్జీలు పెంచినప్పట్నుంచి ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయన్నారు. తప్పుడు ప్రచారంతో బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి బీఆర్ఎస్ నాయకులకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. రాజకీయ ఉనికి కోసం విద్యార్థులను బలి తీసుకునేందుకు ఆ పార్టీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో కల్తీ ఆహార ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఎక్కడో ఓ చోట ఫుడ్ పాయిజనింగ్ జరిగితే దానిని రాద్ధాతం చేయడం సరికాదని ప్రతిపక్షాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యార్థులకు సంబంధించిన ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

రుణమాఫీ ఎప్పుడు?... రైతు బంధు ఎప్పుడిస్తరు

» మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నిలదీసిన మహిళ

చిగురుమామిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను "రైతుబంధు ఎప్పుడిస్తారు?" అంటూ ఓ మహిళా నిలదీసింది. చిగురుమామిడి మండల కేంద్రంలో ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతుండగా... గ్రామానికి చెందిన మహిళా రైతు బెజ్జంకి భాగ్య లేచి.. "రుణమాఫీ ఎప్పుడు చేస్తారు? రైతు బంధు ఎప్పుడిస్తారు?" అంటూ మంత్రిని ప్రశ్నించింది. వెంటనే స్పందించిన మంత్రి... డిసెంబరు 1 నుంచి రెండు లక్షల రూపాయాల రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమవుతుందని, రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని హామీ ఇచ్చారు. రైతు భరోసాను సైతం త్వరలోనే అందజేస్తామన్నారు. దీంతో సదరు మహిళ శాంతించింది.

ఫుడ్‌పాయిజన్‌పై...
ఆర్ఎస్ ప్రవీణ్‌తో సైకోరావు కుట్రలు: సురేఖ

హైదరాబాద్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ అంటూ జరుగుతున్న దుష్ప్రచారాల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం ఉందని, సైకో(కేటీఆర్)రావు ఆయనతో ఈ కుట్రలు చేయిస్తున్నారని దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ ఆరోపించారు. గురుకుల ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. గురుకుల విద్యార్థి మరణాన్ని కేటీఆర్ రాజకీయ లబ్ధి కోసం వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అధికారం కోల్పోవడంతో కేటీఆర్ పిచ్చిపట్టినట్టు ప్రవర్తిస్తున్నాడని, ఆయన మానసికవైద్యుడికి చూపించుకుంటే మంచిదని ఎద్దేవా చేశారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

» మంత్రి పొంగులేటికి టీజీవో వినతి

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, ఈహెచ్ఎస్, జీవో 317, సీపీఎస్ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీవో ప్రతినిధులు శుక్రవారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎ. సత్యనారాయణ నేతృత్వంలో ఉద్యోగుల సమస్యలను మంత్రికి వివరించారు. అలాగే ఉద్యోగులకు రైతు రుణమాఫీ వర్తింపజేసే అంశాన్ని కూడా పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాశారు. ప్రభుత్వంలో తక్కువ వేతనం పొందే ఉద్యోగులకు, అసిస్టెంట్ క్యాడర్, నాలుగో తరగతి ఉద్యోగులకు రుణమాఫీ పథకాన్ని అమలుచేయాలని కోరారు. అలాగే క్షేత్రస్థాయిలో పని చేసే ఉద్యోగులకు టోల్ ట్యాక్స్ మినహాయింపు కూడా ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ రాశారు.

డీఏవో పోస్టులకు ఎంపిక జాబితా విడుదల

డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ (డీఏవో) గ్రేడ్-2 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదలైంది. శుక్రవారం తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు ఈ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కాగా, రాష్ట్రంలో ఎంఈడీ సీట్ల భర్తీకి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదలైంది. ఈ మేరకు అభ్యర్థులు ఈ నెల 30 నుంచి డిసెంబరు 2వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. డిసెంబరు 3, 4 తేదీల్లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. 5న సీట్లను కేటాయించనున్నారు.

'ప్రజా విజయోత్సవాల'కు ప్రణాళిక


» జిల్లాల వారీగా డాక్యుమెంట్లను రూపొందించండి:సీఎస్

రాష్ట్రంలో డిసెంబరు 1 నుంచి 9 వరకు నిర్వహించే 'ప్రజా పాలన... ప్రజా విజయోత్సవాల'కు సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్సవాలకు సంబంధించి ఏ రోజు ఎలాంటి కార్యక్రమాన్ని చేపట్టాలన్న వివరాలను అన్ని జిల్లాలకు పంపించామని తెలిపింది. జిల్లా, మండల స్థాయిల్లో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని తెలిపారు. జిల్లాలవారీగా విజయోత్సవాలను డాక్యుమెంట్లుగా రూపొందించాలని, ఫొటోలు, కార్యక్రమాల హైలెట్స్‌తో సమగ్ర నివేదికలను పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు.

గ్రీన్ టెక్నాలజీస్ అభివృద్ధిపై హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ ఉమ్మడి పరిశోధనలు

» పెయిర్ ప్రోగ్రామ్ కింద రూ.100కోట్లు ఇవ్వనున్న కేంద్రం

హైదరాబాద్ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అండ్ సస్టెయినబుల్ టెక్నాలజీస్‌ను అభివృద్ధి చేయడంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనలు నిర్వహించేందుకు జేఎన్‌టీయూ సన్నద్ధమవుతోంది. ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధనలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన పార్ట్‌నర్‌షిప్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్స్ అండ్ రీసెర్చ్ (పెయిర్) కార్యక్రమం కింద ఈ రెండు విశ్వవిద్యాలయాలు సమష్టిగా పనిచేసేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. జేఎన్‌టీయూ, హెచ్‌సీయూ సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు పెయిర్ కార్యక్రమం కింద కేంద్రం సుమారు రూ.100కోట్లు మంజూరు చేయనుందని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా పరిశోధన/అభివృద్ధి చేయాల్సిన సాంకేతికతలపై రెండ్రోజులపాటు జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్లతో ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్స్ అండ్ డిజిటల్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి పలు అంశాలపై పరిశోధనలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆయా సాంకేతికతలపై పట్టున్న ఆచార్యుల నుంచి ప్రతిపాదనలను స్వీకరించి డిసెంబరు 1లోగా సమర్పించాలని అన్ని విభాగాల అధిపతులను యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఆదేశించారు.



పట్టాలు పొందిన విద్యార్థులతో రేవా చాన్స్‌లర్ శ్యామరాజు తదితరులు

'రేవా'లో 4,537మందికి పట్టాల ప్రదానం

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ప్రతిష్ఠాత్మక రేవా యూనివర్సిటీ తొమ్మిదో స్నాతకోత్సవంలో 4,537 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. శుక్రవారం జరిగిన స్నాతకోత్సవంలో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాళ జగదీశ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఉద్యోగాలకంటే పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలని ప్రజాప్రభుత్వ సాధనలు, హక్కుల విషయంలో గర్వపడాలన్నారు. చాన్స్‌లర్ పి.శ్యామరాజు మాట్లాడుతూ అకడమిక్ ద్వారా పట్టాలు సాధ్యమని అంతకుమించి నైపుణ్యత పొందేలా యూనివర్సిటీలో సౌలభ్యాలు కల్పించామన్నారు. ప్రొ-చాన్స్‌లర్ ఉమేశ్ ఎస్ రాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న తెలంగాణ తల్లి విగ్రహం

పెద్ద అంబర్‌పేటలో రూపుదిద్దుకుంటున్న లోహ శిల్పం.. 10 టన్నుల ఇత్తడితో 17 అడుగుల ఎత్తులో తయారీ

» ఆకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్

» వచ్చే నెల 9న సెక్రటేరియట్‌లో విగ్రహావిష్కరణ

హయత్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహం సిద్ధమవుతోంది. నగర శివారులోని పెద్ద అంబర్‌పేట ఔటర్ రింగు రోడ్డు సమీపంలోని ఓ వర్క్‌షాప్‌లో లోహ (ఇత్తడి) విగ్రహం రూపుదిద్దుకుంటోంది. తయారీ దాదాపు పూర్తయి.. తుది మెరుగులు దిద్దుకుంటోంది. విగ్రహాన్ని తయారు చేస్తున్న ఈశ్వర్‌కు చెందిన లోహ వర్క్‌షాప్‌కు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా వచ్చి పరిశీలించారు. ఇప్పటిదాకా ఇక్కడ తెలంగాణ తల్లి విగ్రహం తయారవుతున్న విషయం తెలియని స్థానికులు.. ముఖ్యమంత్రి రాకతో ఆశ్చర్యపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం తెలిసిందే. ఈ మేరకు దేశ మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు విగ్రహాన్ని తయారు చేసిన లోహ శిల్పికే తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేసే బాధ్యతను అప్పగించినట్లు తెలుస్తోంది. 17 అడుగుల ఎత్తు, సుమారు 10 టన్నుల ఇత్తడితో విగ్రహాన్ని తయారు చేయిస్తున్నారు. విగ్రహం తయారీకి దాదాపు రూ.70 లక్షలు వెచ్చిస్తున్నట్లు సమాచారం. ఈ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పుట్టినరోజును పురస్కరించుకొని డిసెంబరు 9న సచివాలయంలో ఆవిష్కరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కాగా, విగ్రహ తయారీని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించేందుకు రావడంతో వర్క్ షాపు వద్ద హయత్‌నగర్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మీడియా ఫొటోలు తీయకుండా అడ్డుకున్నారు. విగ్రహానికి సంబంధించిన వివరాలను వెల్లడించడానికి శిల్పి సైతం నిరాకరిస్తున్నారు. విషయాన్ని గోప్యంగా ఉంచాల్సిందిగా శిల్పిని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం.

రేవంత్ భరోసా!

(మొదటిపేజీ తరువాయి)



మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్ వద్ద సీఎం సభ కోసం జరుగుతున్న ఏర్పాట్లు

సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఈ పథకాన్ని ప్రారంభించకపోవడంతో.. పెట్టుబడి సాయం పెంపు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలమూరు రైతు సదస్సులో ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేసే అవకాశముందని భావిస్తున్నారు.మంత్రివర్గ ఉపసంఘం నివేదిక, అసెంబ్లీలో చర్చించిన తర్వాత మార్గదర్శకాలు ఖరారు చేసి.. రైతుభరోసా ప్రారంభిస్తామని ప్రకటించే అవకాశం ఉంది. దీంతోపాటు రైతు రుణమాఫీ కింద 2 లక్షల వరకు బకాయిలున్న రైతులకు రుణ విముక్తి కలిగించి చెక్కులను పంపిణీ చేయనున్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ చెక్కుల పంపిణీ..

రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతలుగా రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. తొలుత రూ.లక్ష వరకు, రెండో విడతలో రూ.1.50 లక్షల వరకు, మూడో విడతలో రూ. 2 లక్షల వరకు రుణాలున్న రైతులకు మాఫీ చేసింది. అయితే ఈ కేటగిరీల్లో కొందరు రైతులు పలు కారణాల వల్ల రుణమాఫీ కాకుండా మిగిలిపోయారు. తెల్ల రేషన్‌కార్డులు లేనివారు, కుటుంబ నిర్ధారణ కానివారు, ఆధార్ కార్డులో తప్పులు ఉన్నవాళ్లు, బ్యాంకు ఖాతాల్లో పొరపాట్లున్న రైతులు, పేర్లలో తప్పులు దొర్లినవారు.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.50 లక్షల మందికి రుణమాఫీ కాలేదు. మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డులు సేకరించి, సెల్ఫీలు దిగి, రైతు నుంచి డిక్లరేషన్ తీసుకొని, 'యాప్'లో నమోదు చేశారు. కుటుంబ నిర్ధారణ పూర్తిచేశారు. వీటితోపాటు కెనరా బ్యాంకు సహా కొన్ని బ్యాంకులు గతంలో ప్రభుత్వానికి ఇవ్వని పంట రుణాల వివరాలను ఇప్పుడు సమర్పించాయి. ఇటువంటి రైతులు సుమారు 50 వేల మంది ఉన్నారు. దీంతో మొత్తం కలిపి 4 లక్షల మంది రైతుల లెక్క తేలింది. వీరికి రూ.2 లక్షల రుణమాఫీ చేయడానికి రూ.2,700 కోట్ల నుంచి రూ. 2,800 కోట్లు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. వీరికి శనివారం పాలమూరులో నిర్వహించే రైతు సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేయనున్నారు. డిసెంబరు మొదటి వారంలో ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు చెల్లించిన తర్వాత.. రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో రూ.2 లక్షల వరకు రుణమాఫీ ప్రక్రియ పూర్తి కానుంది.

ఇతర పథకాలపైనా ప్రకటన!

రైతు సదస్సులో భాగంగా.. గడచిన ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం రేవంత్‌రెడ్డి వివరించనున్నారు. సన్నాలకు బోనస్, ఉచిత విద్యుత్తు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు రైతు బీమా తదితర అంశాలపై సీఎం ప్రసంగించే అవకాశాలున్నాయి. భవిష్యత్తు కార్యాచరణను కూడా ఆయన ప్రకటించనున్నారు. దీంతో పాటు రూ.4 వేల పింఛన్‌పైనా ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. కాగా, శనివారం సీఎం సభతో మూడు రోజుల రైతు సదస్సు ముగియనుంది. బహిరంగ సభలో ప్రసంగించేందుకు ముందు వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. లక్ష మంది రైతులతో నిర్వహించే ఈ సభకు అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రైతులు సభకు తరలివస్తుండటంతో పోలీస్ శాఖ 2వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది.

సన్నాలకు బోనస్‌తో రైతుల్లో సంతోషం..

మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహిస్తున్న రైతు సదస్సులో పాల్గొన్న పలువురు రైతులు... 'సన్నాలకు బోనస్' పథకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. బీడు భూములకు, అనర్హులకు రైతుబంధు ఇచ్చే బదులుగా.. పంటలకు గిట్టుబాటు ధరలు, బోనస్ ఇస్తే రైతులతోపాటు కౌలు రైతులకు కూడా మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. చలమయ్యే అనే ఒక రైతు మాట్లాడుతూ.. ఒకటిన్నర ఎకరాల్లో తన తండ్రి వరిపంట సాగు చేశారని, 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు. ఎమ్మెస్పీతోపాటు బోనస్ కూడా రావడంతో రూ.25 వేల అదనపు ఆదాయం వచ్చిందన్నారు.

భూమికి భూమే పరిహారం

ప్రతిపాదిత రావిర్యాల-ఆమనగల్ గ్రీన్‌ఫీల్డ్ మార్గంలో రిజర్వ్ ఫారెస్టులు

» 18 కి.మీ. పరిధిలో 84.15 హెక్టార్ల అటవీభూమి

» పరిహారం కింద అటవీశాఖకు ఇతర ప్రాంతాల్లో భూమి కేటాయింపు

» గుర్తించాలంటూ కలెక్టర్లకు సీసీఎల్ఏ ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ఫ్యూచర్‌సిటీ, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు వెళ్లేందుకు ప్రభుత్వం పలు ప్రాంతాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌కు చేరుకునేందుకు దాదాపు 9 కొత్త రోడ్లను దశలవారీగా నిర్మించాలని నిర్ణయించింది. దీంట్లో భాగంగా భూ సేకరణపై దృష్టి సారించింది. తొలిదశలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని రావిర్యాల నుంచి ఆమనగల్ వరకు 41.5 కి.మీ.ల మేర రోడ్డు నిర్మించనున్నారు. అందుకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియ కూడా నడుస్తోంది. ఈ క్రమంలోనే రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 18 కి.మీ.ల పరిధిలో 6 రిజర్వ్ ఫారెస్ట్‌లు ఉన్నాయని, రహదారి నిర్మాణానికి 84.15 హెక్టార్ల (దాదాపు 208 ఎకరాల) అటవీభూమి అవసరమవుతోందని అధికారులు గుర్తించారు. ఆ భూములు అటవీశాఖకు చెందినవి కావడంతో వాటి మీదుగా రహదారిని నిర్మించాలంటే అటవీశాఖ అనుమతి తీసుకోవడంతోపాటు, పరిహారం కింద తిరిగి భూములనే ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, 18 కి.మీ.ల రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే 84.15 హెక్టార్ల అటవీ భూమికి పరిహారంగా రాష్ట్రంలో మరో చోట భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, వికారా బాద్ జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో పరిహారం కింద ఇచ్చేందుకు అనువైన భూములను ఆయా జిల్లాల పరిధిలో గుర్తించాలంటూ భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు పంపారు. మళ్లీ అడవిని పెంచేందుకు వీలుగా ఉండే భూములనే అటవీశాఖకు ఇవ్వాల్సి ఉంటుందని అధికారిక వర్గాలు అంటున్నాయి. అందుకు అనుగుణంగా ఉన్న భూముల గుర్తింపుపై ఆయా జిల్లాల కలెక్టర్లు దృష్టి సారించినట్లు సమాచారం. కాగా, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించతలపెట్టిన అన్ని గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్లకు సంబంధించి హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ప్రభుత్వానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికను అందించింది.

వానాకాలం పంటలో రైతులకు రూ.40 వేల కోట్లు

» వరిలో ఉమ్మడి రాష్ట్రం రికార్డులు చెడిపేశాం: ఉత్తమ్

» ఆయిల్‌పామ్ వేస్తే ఇంటికొచ్చి కొంటాం: తుమ్మల



మహబూబ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద ఎక్కువ వరి పండిస్తున్నామని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేపదే చెప్పేదని, ఈ వానాకాలం కాళేశ్వరం లేకుండానే ఏ రాష్ట్రంలో పండనంత వరి తెలంగాణలో పండిందని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. వానాకాలం 66.7 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని, ఉమ్మడి రాష్ట్ర రికార్డులను కూడా తెలంగాణ చెరిపేసిందని చెప్పారు. ఈ ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులదేనన్నారు. పండిన పంటకు మద్దతుతో పాటు సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని వెల్లడించారు. వానాకాలం పంట ద్వారా తెలంగాణ రైతాంగం రూ.40 వేల కోట్లు ఆర్జించారని చెప్పారు. కల్లాలలో మిగిలిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న రైతు పండగ రెండో రోజు కార్యక్రమంలో శుక్రవారం ఉత్తమ్, తుమ్మల పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్ళను పరిశీలించారు. అనంతరం మంత్రులిద్దరూ రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర పరిస్థితులు ఎలా ఉన్నా ప్రభుత్వం రైతు పక్షపాతిగా పని చేస్తుందని ఉత్తమ్ చెప్పారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలని పిలుపునిచ్చారు. ఈ పంటతో ఎకరాకు రూ.2 లక్షలు ఆదాయం వస్తుందన్నారు. మహబూబ్‌నగర్‌లో రెండు పామాయిల్ మిల్లులను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పండిన పంటను రైతుల ఇంటి వద్దకే వచ్చి కొనుగోలు చేస్తామని చెప్పారు. వలసల జిల్లాగా పేరుపడిన మహబూబ్‌నగర్ జిల్లాను పెట్టుబడులు పెట్టే జిల్లాగా మారుస్తామని ప్రకటించారు.

ఫోన్‌చేస్తే చాలు.. రైతు ఇంటికే వరి విత్తనాలు!

» 15 కిలోల విత్తన బస్తా ధర రూ.700

» 25 కిలోల బస్తాకు రూ.995

» రవాణా చార్జీలు లేకుండానే సరఫరా

» రైతులే వచ్చి కొంటే 6శాతం రాయితీ

» విత్తనాభివృద్ధి సంస్థ వినూత్న సేవలు

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఆహార పదార్థాలు ఇంటికే వచ్చినట్లుగా.. ఫోన్ చేస్తే చాలు రైతుల ఇంటికే వరి విత్తనాలు పంపించే వినూత్న సేవలకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ శ్రీకారం చుట్టింది. యాసంగి సీజన్‌లో 2.5 లక్షల ఎకరాలకు సరిపడా 50 వేల క్వింటాళ్ల నాణ్యమైన వరి విత్తనాలు సరఫరా చేయాలనే లక్ష్యం విధించుకున్న విత్తనాభివృద్ధి సంస్థ.. రకరకాల మార్గాల ద్వారా రైతులకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఎలాంటి రవాణా చార్జీలు లేకుండా.. రైతుల ఇంటివద్దకే విత్తనాలు పంపించాలని నిర్ణయించింది. యాసంగి పంటకాలంలో రైతుల నుంచి గిరాకీ ఎక్కువగా ఉన్న తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్- 15048), కూనారం సన్నాలు (కేఎన్ఎం- 163), జగిత్యాల సన్నాలు (జేజీఎల్- 27356)తోపాటు.. దొడ్డు రకాలైన కేఎన్ఎం- 118, జేజీఎల్- 4423, ఎంటీయూ- 1010, ఆర్ఎన్ఆర్- 29325.. ఇలా ఏడు రకాల వరి విత్తనాలను సరఫరా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో 10 కిలోల విత్తన బస్తా రూ.900 ఉండగా.. విత్తనాభివృద్ధి సంస్థ 15 కిలోల బస్తాకు రూ.700, 25 కిలోల బస్తాకు రూ.995 చొప్పున ధర నిర్ణయించడం విశేషం. ప్రైవేటు విత్తన వ్యాపారులతో పోలిస్తే తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తున్నామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి తెలిపారు. సీడ్ కార్పొరేషన్ పరిధిలో నిజామాబాద్, వరంగల్, జీడిమెట్ల, నిర్మల్, కరీంనగర్, వనపర్తి, నందిపహాడ్, జోగిపేట,ఖమ్మంలో 9 ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. వీటితోపాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో కూడా విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలవారీగా కలెక్టర్ కార్యాలయాల్లో వ్యవసాయ, సహకార, ఏఈఓ, ఆర్ఎస్‌కేలతో సమావేశాలు నిర్వహించి విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు మరింత చేరువ కావటానికి.. బ్రోచర్లు, కరపత్రాల్లో ప్రాంతీయ మేనేజర్ల ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చారు. రైతులు ప్రాంతీయ మేనేజర్లకు ఫోన్ చేస్తే..ఇంటికే నేరుగా విత్తనాలు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాల్లో విత్తనాలు డోర్ డెలివరీ చేసినట్లు, రాష్ట్రంలో ఎక్కడైనా ఈ సౌకర్యం కల్పించినట్లు అన్వేష్‌రెడ్డి తెలిపారు. రవాణా ఖర్చులు కార్పొరేషన్ భరిస్తుండగా... ప్రాంతీయ కార్యాలయాలకు నేరుగా వచ్చి విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు 6 శాతం రాయితీ కూడా ఇస్తుండటం గమనార్హం.

ఇందిరమ్మ ఇంట్లో అదనపు గదులకు ఓకే!

లబ్ధిదారులను అనుమతించాలన్న సీఎం రేవంత్.. పథకంలో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం

» ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ప్రత్యేక కోటా

» ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్షలో సీఎం



హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేనివారు, పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్య క్రమంలో ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ పథకం కింద ప్రభుత్వం అందించే ఇళ్లలో లబ్ధిదారులెవరైనా అదనపు గదులు నిర్మించుకునేందుకు ఆసక్తి కనబరిస్తే.. అందుకు అవకాశం కల్పించాలన్నారు. ఇక రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ప్రత్యేక కోటాను అమలు చేయాలని నిర్దేశించారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పథకంపై గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిదశలో సొంత స్థలాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పథకం అమలులో గ్రామ కార్యదర్శితోపాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయాలని, అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని అన్నారు. పథకం కోసం రూపొందించిన మొబైల్ యాప్‌లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, ఏ దశలోనూ లబ్ధిదారుకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అదే సమయంలో శాఖాపరంగా కూడా ఎలాంటి పొరపాట్లకు తావుండొద్దన్నారు. పథకాన్ని సమర్థంగా కొనసాగించేందుకు వీలుగా గృహనిర్మాణ శాఖ బలోపేతం కావాలని, అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని అన్నారు.

ఇళ్ల కోసం పైలట్ యాప్..

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించింది. ప్రస్తుతం మహబూబ్‌నగర్, మెదక్‌తోపాటు మరో రెండు జిల్లాల్లోని ఒక గ్రామం, మునిసిపాలిటీ పరిధిలోని ఒక వార్డులో యాప్‌ను పైలట్ ప్రాజెక్టు కింద పరిశీలిస్తున్నారు. యాప్‌లో పొందు పరచాల్సిన వివరాలను పూర్తిస్థాయిలో తీసుకుంటుందా, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు తలెత్తుతాయా, ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను యాప్‌లో నమోదుచేసేందుకు ఎంత సమయం పడుతుంది వంటి ,అన్ని అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు పరిశీలనలో యాప్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే.. వాటన్నింటినీ పరిశీలించి, పథకం అమలుకు చర్యలు తీసుకోనున్నారు. మరో వైపు కేంద్రం అందించే ప్రధానమంత్రి ఆవాసయోజన పథకంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం కూడా తమ పథకం అమలు పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేసిన వివరాలను, కేంద్రం సూచించే యాప్‌లోనూ పొందుపరచాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వ యాప్‌ను.. కేంద్రం సూచించే యాప్‌కు అనుసంధానం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అలా అనుసంధానిస్తేనే దరఖాస్తుదారులకు పథకం అందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. డిసెంబరు 1 నుంచి 9వరకు నిర్వహించబోయే ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమాల్లో ఏదో ఒక రోజు పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది. కాగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో సొంత స్థలం ఉన్నవారు ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 4.50 లక్షల ఇళ్లను అర్హులకు అందించనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.

మూసీ ప్రక్షాళనలో ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానం

» ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

» ఇజ్రాయెల్ రాయబారి తో సమావేశం

హైదరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఇజ్రాయెల్ సంసిద్ధత వ్యక్తం చేసిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజర్ .. మంత్రితో సమావేశం అయ్యారు. మూసీ ప్రాజెక్టు, వ్యర్థ జలాల పునర్వినియోగ సాంకేతికతలో తమకు సహకరించాలని శ్రీధర్ బాబు కోరారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, శిక్షణనిచ్చే వారికి ఆధునిక శిక్షణలో సహకారం అందించాలన్నారు. కృత్రిమ మేథ, సైబర్ సెక్యూరిటీలో ఇజ్రాయెల్ అగ్రగామిగా ఉందని, ఆ రంగాల్లో తెలంగాణకు సహకరించాలన్నారు. కాగా తుర్కియె రాయబారి ఫిరట్ సునెల్ కూడా మంత్రి శ్రీధర్ బాబుతో సచివాలయంలో భేటీ అయ్యారు.

స్కిల్ వర్సిటీలో 'విప్రో' భాగస్వామి కావాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీలో విప్రో భాగస్వామి కావాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. విప్రో ప్రధాన ఆర్థిక అధికారి రాఘవ్ స్వామినాథన్ శ్రీధర్ బాబును కలిశారు. ఐటి, ఎఫ్ఎంసీజీ రంగాల్లో పేరు గడించిన విప్రో తమ సంస్థకు అవసరమయ్యే మానవ వనరులకు స్కిల్ యూనివర్సిటీలో స్వయంగా శిక్షణ ఇచ్చి నియమించుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ఎస్‌పీఎఫ్ పాత్ర ఎంతో కీలకమైనదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 265మంది కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్‌కు ముఖ్య అంతిథిగా హాజరై గౌరవం వందనం స్వీకరించారు.



ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్‌ను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

రామప్ప సోమశిల అభివృద్ధికి రూ.141.84 కోట్లు

'సాస్కి' పథకం కింద కేంద్రం నిధులు

దేశ వ్యాప్తంగా 40 ప్రాజెక్టులకు నిధులు

తెలంగాణ పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తున్నాం : కిషన్ రెడ్డి



హైదరాబాద్/న్యూఢిల్లీ/హనుమకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప, సోమశిల పర్యాటక సర్క్యూట్ ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్రం రూ.141.84 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. సాస్కి(స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్, యూనియన్ టెరిటోరీస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) పథకం కింద ఈ నిధులను మంజూరు చేసినట్టు వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు దేశ వ్యాప్తంగా 40 ప్రాజెక్టులను ఎంపిక చేసిన కేంద్రం సాస్కి కింద రూ.3,295.76 కోట్ల నిధులను మంజూరు చేసింది. 50 ఏళ్ల కాల వ్యవధితో వడ్డీరహిత రుణం రూపంలో కేంద్రం ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు విడుదల చేస్తుంది. ఇందులో భాగంగా రామప్ప రీజియన్ సస్టెయినబుల్ టూరిజం సర్క్యూట్ ప్రాజెక్టుకు రూ.73.74 కోట్లు, సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు రూ.68.10 కోట్లు కలిపి రూ.141.84 కోట్లను కేంద్రం రాష్ట్రానికి కేటాయించింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గండికోటకు రూ.77.91 కోట్లు, అఖండ గోదావరి, రాజమహేంద్రవరం ప్రాజెక్టుకు రూ.94.44 కోట్లు కేటాయించింది. కాగా, స్వదేశ్ దర్శన్, ప్రసాద్, స్వదేశ్ దర్శన్ 2.0 తదితర పథకాల కింద రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను కేంద్రం అభివృద్ధి చేసిందని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గడ్కరీతో డీకే అరుణ భేటీ..

తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని రహదారులను ఇతర మార్గాలతో అనుసంధానించాలని, విస్తరణ పనులు చేపట్టాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆమె భేటీ అయ్యారు. రహదారుల అభివృద్ధికి సంబంధించి వినతి పత్రాలు అందించారు. కల్వకుర్తి-కరివెన(ఎన్‌హెచ్-167 కే) జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలని, దీనిలో భాగంగా సోమశిల వద్ద కృష్ణా నదిపై వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

కేటీఆర్‌కు మెదడు లేదు: రఘునందన్

మాజీ మంత్రి కేటీఆర్ పనికిమాలిన ప్రకటనలు చూస్తుంటే ఆయన అధికారంతోపాటు మెదడు కూడా కోల్పోయారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఘాటుగా స్పందించారు. తాము కాంగ్రెస్‌తో కలిసి ఉంటే చర్లపల్లి జైలులో కేటీఆర్ చిప్పకూడు తింటూ ఉండేవాడని కౌంటర్ ఇచ్చారు. పదేళ్ల అధికారంలో ఉండి అన్ని వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేశారని విమర్శించారు.

పనికొచ్చే చదువు

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన కసరత్తును రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రారంభించింది. పరిశ్రమల అవసరాల మేరకు నైపుణ్యాలను సిలబస్‌లో అంతర్భాగం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కొత్త కరికులాన్ని ఖరారు చేయడం కోసం నాలుగు కమిటీలను ఏర్పాటు చేశారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో బీకాం, లా కోర్సులకు కమిటీని నియమించారు. సైన్స్ కోర్సులకు ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ మహమూద్, ఆర్ట్స్ కోర్సులకు మరో వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ఇంజనీరింగ్ కోర్సులకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ స్టీరింగ్ కమిటీలు త్వరలోనే వర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్లతో సంప్రదింపులు జరిపి అవసరమైన మార్పులపై చర్చిస్తాయి. ఈ నేపథ్యంలో శనివారం సైన్స్ కోర్సుల కరికులమ్, సిలబస్ రూపకల్పనపై సంప్రదింపులు జరపనున్నారు. ఈ విధంగా ఆయా సబ్జెకులపై స్టీరింగ్ కమిటీలు వరుసగా భేటీకానున్నాయి. చర్చల అనంతరం కొత్త కరికులమ్‌పై ప్రత్యేక నివేదికను రూపొందించనున్నారు. ప్రభుత్వం అనుమతి అనంతరం ఈ కొత్త కరికులాన్ని అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ కరికులమ్‌ను అమలుపరిచే అవకాశం ఉంది.

ఉన్నత విద్యను పరిశ్రమలకు అనుసంధానించేలా ప్రభుత్వ చర్యలు..

రాష్ట్రంలో ఉన్నత విద్యను, పరిశ్రమలకు అనుసంధానించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఉపాధి లభించే విధంగా కోర్సులు ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఆయా పరిశ్రమల్లో ఉద్యోగాలు వచ్చే విధంగా కోర్సులను ప్రారంభిస్తున్నారు. అలాగే రాష్ట్రంలోని ఐటీఐలను కూడా టెక్నికల్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం టాటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో ఇతర ఉన్నత విద్య కోర్సుల్లోనూ మార్పులు తీసుకురావాలని భావిస్తోంది. అందులో భాగంగానే ఆయా కోర్సుల్లో మార్పులు, చేర్పులపై కరికులమ్‌ను రూపొందించాలని నిర్ణయించారు.

మరింత ఉపాధి అవకాశాలు కల్పించేలా డిగ్రీ కోర్సులు..

డిగ్రీ కోర్సుల్లో మార్పులు, చేర్పులు ఎక్కువుండే అవకాశం ఉంది. డిగ్రీ కోర్సులను మరింత ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా తీర్చిదిద్దనున్నారు. బయటి మార్కెట్‌లో నానాటికీ సాంకేతిక పెరిగిపోవడం, పరిశ్రమల్లో ఆధునికీకరణ చోటుచేసుకుంటోంది. ఈ పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కోర్సులు ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ముఖ్యంగా రాష్ట్రంలో రిటైల్ రంగం గణనీయంగా వృద్ధి చెందుతోంది. దానికి తగ్గట్టుగా కోర్సులను రూపొందిస్తే.. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు అందుబాటులోకి రావడానికి అవకాశం ఉంటుంది. ఇప్పుడు ప్రతి రంగంలోనూ కంప్యూటర్‌పై కనీసం అవగాహన అవసరం ఉంటోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని డిగ్రీ స్థాయిలోనూ కంప్యూటర్ కోర్సును విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ప్రధానంగా ఉన్నత విద్యలో క్లాస్ రూం తరగతులతోపాటు ప్రాక్టికల్స్‌నూ ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. తద్వారా విద్యార్థి తన చదువు పూర్తయ్యే సమయానికి కొంత అవగాహన, అనుభవం లభించే అవకాశం ఏర్పడుతుంది. ఇందులో భాగంగా ఆయా రంగ ప్రముఖ కంపెనీలతో ఒక అవగాహనకు వచ్చి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను ఇప్పించే విధంగా చర్యలు తీసుకునే ఆస్కారం ఉంది.





Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.